30-9-83
150 పైసలు

ఆంధ్ర సచిత్ర వారపత్రిక



ప్రియమైన భారతీయులందరికి స్విట్జరులాండు దేశ మిత్రులు శుభాకాంక్షలు పంపుచున్నారు
సర్వశక్తుని దేవుని ప్రేమతో సమాధానము, ఆనందము సమృద్ధి దీవెనలతో పాటు ప్రభువైన

యేసుక్రీస్తు రక్తములో మీకు రక్షణ కలుగుగాక

బైబిలు గ్రంధముల నుండి దైవ వాక్యములతో మమ్మును మీకు పరిచయం చేసికొనుచున్నాము.

బైబిలు గ్రంధము దేవుని వాక్యము. దేవుడు మానవునితో మాట్లాడిన దివ్యమైన వాక్కులు దేవుడీలాగు మానవునితో చెప్పుచున్నాడు. నేను పరిశుద్ధ దేవుడనుగాని మనుష్యుడను కాను. ఆయన మాట సెలవియ్యగా లోకములు కలిగెను. ఆయన ఆజ్ఞ ఇయ్యగా దాని ప్రకారము సమస్తము కలిగెను. ఆకాశమును, భూమియును గతించును గాని నా మాటలు ఏమాత్రమును గతింపవు. దేవుని రాజ్య సువార్త సకల జనములకు సాక్ష్యార్థమై లోకమంతటను ప్రకటింపబడును. అటు తరువాత అంతము వచ్చును. దేవుడొక్కడే. దేవునికిని, నరులకును మధ్యవర్తియు ఒక్కడే ఆయన క్రీస్తు యేసను నరుడు. క్రీస్తు మధ్యవర్తిగా నుండి దేవుని మానవునిని సమాధాన పర్చినాడు. మరి ఎవనివలనను రక్షణ కలుగదు. ఈ నామముననే మనము రక్షణ పొందగలము. ఆకాశము క్రింద మనుష్యులలో యివ్వబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము. ఏ అన్య దేవతను నీవు పూజింపకూడదు. నీ గృహములో ఏ విగ్రహముండకూడదు,

నేను చెప్పునదేమనగా ఆత్మానుసారముగా నడుచుకొనుడు. మీ శారీరేచ్ఛను బట్టి నడుచుకొనిన యెడల చెడ్డ కార్యాలు మీలోనుండి పుట్టును. అవేవనగా జారత్వము, అపవిత్రత, కాముకత్వము, విగ్రహారాధన, అభిచారము, ద్వేషము, కలహము, మత్సరములు, క్రోధములు, కక్షలు. భేదములు, విమతములు, అసూయలు, మత్తతలు, అల్లరితో కూడిన ఆట పాటలు మొదలైనవి. వీటిని గూర్చి నేను మునుపు చెప్పిన ప్రకారము ఇట్టి వాటిని చేయువారు దేవుని రాజ్యమును స్వతంత్రించుకొనరని మీతో స్పష్టముగా చెప్పుచున్నాను. ఆయితే ఆత్మఫలమేమనగా, ప్రేమ, ఆనందము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము ఇట్టి వాటికి విరోధమైన నియమమేదియు లేదు.

అందరితో సమాధానమును పరిశుద్ధతయును కలిగియుండుటకు ప్రయత్నించుడి. పరిశుద్ధత లేకుండా ఎవడును దేవుని చూడలేడు. మీలో ఎవడైనను దేవుని కృపను పొందకుండ తప్పిపోవుదురేమో అనియు చేదైన వేరు ఏదైనను మొలచి కలవర పరుచుటవలన అనేకులు అపవిత్రులైపోవుదురేమో అనియు

వెంటనే వాడు చూపు పొంది దేవుని మహిమపరచుచు ఆయనను వెంబడించెను. ప్రజలందరు అది చూచి దేవుని స్తుతించిరి. యేసుక్రీస్తు నిన్న, నేడు, నిరంతరము ఒకే రీతిగా యున్నాడు.

పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునపుడు మీరు శక్తి నొందెదరు. గనుక మీరు నాకు సాక్షులై యుందురని వారితో చెప్పెను. వారందరు పరిశుద్ధాత్మతో నిండినవారై ఆత్మ వారికి వాక్ శక్తిని అనుగ్రహించినకొలది అన్యభాషలలో మాట్లాడసాగిరి. సమరయవారు దేవుని వాక్యము అంగీకరించిరని యెరుషలేములోని అపొస్తులులు విని పేతురును యోహానును వారియొద్దకు పంపిరి. దావీదు వారు పరిశుద్ధాత్మను పొందవలెనని వారికొరకు ప్రార్థన చేసిరి. అప్పుడు పేతురును యోహాను వారిమీద చేతులుంచగా వారు పరిశుద్ధాత్మను పొందిరి. పేతురుతో కూడా వచ్చిన యూదులు పరిశుద్ధాత్మ వరము అన్యజనులమీద సయితము కుమ్మరింపబడుట చూచి విభ్రాంతి నొందిరి. ఏలయనగా వారు భాషలతో మాట్లాడుచూ దేవునే ఘనపరచుచుండగా వినిరి. తరువాత పౌలు వారిమీద చేతులుంచగా పరిశుద్ధాత్మ వారిమీదికి వచ్చెను. అప్పుడు వారు భాషలతో మాట్లాడుటకు, ప్రవచించుటకును మొదలు పెట్టిరి. అంత్యదినములయందు నేను నా ఆత్మను మనుష్యులందరిమీద కుమ్మరించెదను. మీ కుమారులు మీ కుమార్తెలును ప్రవచించెదరు.

నమ్మినవారివలన ఈ సూచిక క్రియలు కనబడును. నేను ఇచ్చిన అధికారమునుబట్టి నా నామమున దయ్యములు వెళ్ళగొట్టుదురు. క్రొత్త భాషలు మాట్లాడుదురు. రోగులమీద చేతులుంచగా వారు స్వస్థత నొందుదురు. ఈలాగు ప్రభువైన యేసు వారితో మాట్లాడిన తరువాత పరలోకమునకు చేర్చబడి దేవుని కుడి పార్శ్వమున ఆసీనుడయ్యెను. వారు బయలుదేరి వాక్యమును అంతట ప్రకటించిరి. ప్రభువు వారికి సహకారుడై యుండ వెనువెంట జరుగుచు వచ్చిన సూచక క్రియలవలన వాక్యమును స్థిరపరచుచుండెను. నేను తండ్రివద్దకు వెళ్ళుచున్నాను. గనుక నేను చేయు క్రియలు నాయందు విశ్వాసముంచువాడును చేయును. వాటికంటే గొప్పవియు అతడు చేయునని వారితో నిశ్చయముగా చెప్పెను, మీరు నా నామమున దేనినడుగుదురో

జాగ్రత్తగా చూచుకొనుడి. మనుష్యులయెదుట నన్ను ఒప్పుకొనువాడెవడో పరలోకమందున్న నా తండ్రియెదుట నేనును వానిని ఒప్పుకొందును. మనుష్యుల యెదుట ఎవడు నన్ను ఎరుగననునో వానిని పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును ఎరుగనందును.

దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వారియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను. మనుష్య కుమారుడు నశించిన దాన్ని వెదకి రక్షించుటకు వచ్చెను. కుమారుడు మిమ్ములను స్వతంత్రులనుగా చేసినయెడల మీరు నిజముగా స్వతంత్రులై యుందురు. దావీదు మహారాజు యీలాగు చెప్పెను : ''తన అతిక్రమములకు పరిహారం నొందినవాడు ధన్యుడు...తన పాపములకు ప్రాయశ్చిత్తము నొందినవాడు ధన్యుడు. దేవునిచేత నిర్దోషి అని ఎంచబడినవాడు, ఆత్మలో కపటములేనివాడు ధన్యుడు. ఒకనాడు నేను పాపినని గ్రహించి ఒప్పుకొనలేని స్థితిలో వున్నాను. నా పాపము ఒప్పుకొనకుండా మౌనినైయుండగా నీ నిరాశ నిస్పృహ నన్ను ఆవరించినవి. దివారాత్రులు నీ చెయ్యి నా మీద బరువుగా ఉన్నది. నా బలమంతయు ఆవిరివలె మాయమైనది. నా దోషమును కప్పుకొనక నీ యెదుట నా పాపము ఒప్పుకొంటిని.

నీవు నా పాప దోషమును పరిహరించియున్నావు.'' నా పాప భారమంతా దొర్లిపోయింది.

యేసు గలిలయమునుండి యోహానుచేత బాప్తిస్మము పొందుటకు యోహాను దగ్గరవున్న అతని యొద్దకు వచ్చెను. యేసు బాప్తిస్మము పొందిన వెంటనే నీళ్ళలోనుండి ఒడ్డునకు వచ్చెను. ఇదిగో ఆకాశము తెరవబడెను. దేవుని ఆత్మ పావురమువలె దిగి తనమీదికి వచ్చుట చూచెను. యోహాను ఈలాగు చెప్పెను. నేను ఆయనను ఎరుగనైతినిగాని నన్ను పంపినవాడు ''నీవే పనిమీద ఆత్మ దిగివచ్చి నిలుచుట చూతువో ఆయనే పరిశుద్ధాత్మతో బాప్తిస్మమిచ్చువాడని నాతో చెప్పెను. ఈయనే దేవుని కుమారుడని తెలిసికొని సాక్ష్యమిచ్చితిని.''

అప్పటినుండి యేసు పరలోక రాజ్యము సమీపించి యున్నది గనుక పాపమును విడిచి మారు మనస్సు పొంది దేవునివైపు తిరుగుడి అని ప్రకటింప మొదలుపెట్టెను. ఆయన — నా వెంబడి రండి — నేను మిమ్మును మనుష్యులను పట్టు జాలరులనుగా చేతునని చెప్పెను. నాయందు మీరును మీయందు నా మాటలును నిలిచి యుండిన యెడల మీకేది ఇష్టమో అడుగుడి అది మీకనుగ్రహింపబడును. నీవు కన్నీళ్ళు విడుచుట చూచితిని నీ ప్రార్థన నే నంగీకరించి యున్నాను. నేను నిన్ను బాగుచేసెదను. స్వస్థ పరచునట్లు ప్రభువు శక్తి ఆయనకుండెను. ఇదుగో కుష్ఠురోగి వచ్చి ఆయనకు మ్రొక్కి ప్రభువా నీకిష్టమైతే నన్ను శుద్ధునిగా చేయుమని కోరెను. అందుకాయన చెయ్యి చాపి, వానిని ముట్టి నాకిష్టమే— నీవు శుద్ధుడవు కమ్మని చెప్పెను. వెంటనే వాని కుష్ఠురోగము శుద్ధియాయెను. మరియు మీరు ప్రార్థన చేయునప్పుడు వేటిని అడుగుదురో అవి దొరికినవని నమ్మినయెడల వాటన్నిటిని పొందుదురని చెప్పెను. గ్రుడ్డివానితో యేసు ఈలాగు చెప్పెను. ''చూపు పొందుము. నీ విశ్వాసము నిన్ను స్వస్థపరచెనని చెప్పెను.''

తండ్రి కుమారుని యందు మహిమపరచబడుటకు దానిని చేతును. నా నామమున మీరు నన్నేమి అడిగినను నేను చేయుదును. మీరు నన్ను ప్రేమించినయెడల నా ఆజ్ఞలను గైకొందురు.

కావున ప్రతి స్థలమందును కోపమును సంశయమును లేనివారై పవిత్రమైన చేతులెత్తి ప్రార్థన చేయవలెనని కోరుచున్నాను. యెహోవా సేవకులారా ! యెహోవా మందిరములో ప్రతి రాత్రి కావలికాయు బాలులారా ! మీరందరును ఆయనను సన్నుతించుడి. విరిగిన హృదయమును ఆయన సమీపముగా నున్నాడు. నలిగిన మనస్సుగలవారై పాప పశ్చాత్తాపులైనవారిని ప్రభువు రక్షించును. పర్వతములు తొలగిపోయినను, మెట్టలు తత్తరిల్లినను నా కృప నిన్ను విడిచిపోదు. సమాధాన విషయమై నా నిబంధన తొలగిపోదు అని నీయందు జాలిపడు యెహోవా ప్రభువు సెలవిచ్చుచున్నాడు.

మీరు కోరిన యెడల అందుబాటులో వున్నంతవరకు నూతన నిబంధన గ్రంథము బహుమానముగా మీకు పంపగలము. నూతన నిబంధన గ్రంథము దేవుని పరిశుద్ధ వాక్యములతో నిండి యున్నది. మీ స్వాగత పూరితమైన సాక్ష్యములు పంపించినందుకు మా వందనములు. ఈ క్రింద ఇవ్వబడిన విలాసమునకు వ్రాసి మాతో సంప్రదించండి. మీయొక్క అడ్రస్సు, పిన్‌కోడ్, పెద్ద అక్షరములతో విపులముగా వ్రాయండి.

శ్రీ దీక్షితులుగారు

2-9-83 సంచికలో హైదరాబాద్ నోట్‌బుక్ శీర్షికలో శ్రీ కల్లూరి వేంకట సుబ్రమణ్య దీక్షితులుగారిని గురించి ప్రచురించిన వ్యాసం నాకెంతో సంతోషాన్ని కలుగజేసింది. 1952లో నేను విజయవాడ సి. వి. ఆర్. మునిసిపల్ హైస్కూల్‌లో చదివినప్పుడు శ్రీ దీక్షితులుగారు తెలుగును బోధించేవారు. ఆయన గొప్ప పండితులు. విద్వాంసులు. తెలుగు పద్యం చదవటం, దానికి తాత్పర్యంతోసహా అర్థం చెప్పటం ఆ రోజుల్లో ఆయనకు సాటి ఎవరు ఉండేవారుకాదు.

ఉద్యోగరీత్యా బొంబాయిలో ఉంటున్నా తెలుగు పుస్తకాలు చదవటం, తెలుగువాళ్ళతో తెలుగులోనే మాట్లాడటం నాకు చాలా ఇష్టం. తెలుగు భాషలో అంతటి అభిమానం ఏర్పడటానికి చదువుకునే రోజుల్లో శ్రీ దీక్షితులుగారు తెలుగును చక్కగా బోధించటమే కారణమనుకుంటాను.

తెలుగువారే "మాకు తెలుగులోమాట్లాడటమంటే అసహ్యం. తెలుగు సినిమాలు చూసేకంటె హిందీ సినిమాలు చూడటమే నయం. తెలుగు పుస్తకాలలో ఏముంది, ఇంగ్లీషు నవలలు చదివితే బాగుంటుంది" అనే రోజులు ఇవి. తెలుగువారికి పట్టిన ఈ దుర్గతికి, జబ్బుకి మందు లేదేమో అనిపిస్తుంది. అశోక్‌నగర్‌లో శ్రీ సత్యనారాయణస్వామివారి గుడి ఆవరణలో శ్రీ దీక్షితులుగారి పురాణ ప్రవచనం బొంబాయిలో ఉండి నేను వినలేకపోతున్నానే అని బాధగా ఉంది. కనీసం ఇటువంటి కార్యక్రమాలలో పాల్గొంటే తెలుగువారిలో చైతన్యం, భాషాభిమానం కలుగుతుందేమో! శ్రీ దీక్షితులుగారు ఇంకా భాషకు సేవ చెయ్యాలని, ఆయురారోగ్యైశ్వర్యాలతో వర్థిల్లాలని కోరుకుంటున్నాను.

కూనపులి శ్రీరామమూర్తి (బొంబాయి)

వ్యాసాలు


'తిరుపతిని తెలుగువారు వదులుకుంటారా!' 2-9-83 తేది నాటి వారపత్రికలో శ్రీ వి. యస్. అవధానిగారు వివరించిన విధానము [25వ పేజి] చిత్తూరుజిల్లా ప్రజల్నే కాకుండా తెలుగు ప్రజల్ని అందరిని పరోక్షంగా రెచ్చగొట్టేదిగా వుందేమో! సంపాదకులు ఆలోచించగలరు. అయితే అవధానిగారు చెప్పినట్లుగా పూజా విధానం, తదితర విషయాల్లో తమిళాధిక్యత వహించడం వాస్తవం — ...

జి. ఎస్. మూర్తి (పాండిచేరి)

రాజకీయోల్బణం

డా. జయ్‌దుబాషీగారు చెప్పిన రాజకీయోల్బణం అంటే ఏమిటి? మాకు ఎంతగానో ఆకర్షించుకున్నది.

జామి ప్రభాకరరావు (కురుపాం)



ముఖచిత్రం

2-9-83 వారం ముఖచిత్రం మనసుకు ఆహ్లాదాన్ని కలిగించింది. అందమైన కనులతో మా మనసులను ఆకట్టుకుంది సుమలత. "ఏ స్టోరీ ఫర్ ఎడల్ట్స్" కథ కొందరి పెద్దల మనస్సులనైనా మార్చగలదని ఆశిస్తున్నాను.

ఎస్. మనోరమ (పెద్దబొమ్మలాపురం)

* * *

పత్రికమీద నళిని బాగుంది.

ముల్పూరి సుధాకర్ (కొవ్వలి)

దేవతల ముఖచిత్రాలు

లోగడ మీ పత్రిక ఆంధ్రపత్రిక వారపత్రిక అట్టమీద ప్రసిద్ధ ప్రసన్న వెంకటేశ్వరస్వామి వారి ముఖచిత్రము వేసి నావంటి దీనభక్తులకు పరవశము కల్గించియున్నారు. అప్పుడు వెంటనే మీకు లేఖ వ్రాసినాను. ఆ లేఖ తదుపరి ఆంధ్రపత్రిక వారపత్రికలో కూడా వేసిరి. ఇట్టి తరుణమున నా ప్రార్థన పెడచెవినపెట్టి ఇంకా సినిమా తారల ఫోటోలు ముఖచిత్రము వేయుచుండుట నాకెంతో మనస్తాపము కల్గిస్తున్నారు. సినిమా సందర్భముకు ఎన్నో పత్రికలు వుండగా మీరున్ను దీనితో ముడిపడి వుండుట నాకు చాలా విచారము కల్గుచున్నది. భారతదేశమున కాల పరిస్థితి ఎట్లున్న భగవత్ సత్యము ఏనాటికి తరుగులేనిది — గనుక నా ప్రార్థన ఇప్పటికైనా ఆలకించి భగవద్భక్తికి తాము ముందుకు వచ్చి శ్రీరాముడు—కృష్ణుడు—శివుడు— ఆంజనేయుడు —గణపతి — బాలసుబ్రహ్మణ్యస్వామి మొదలైన సత్యదేవతల ఫోటోలు ముద్రించి పరవశము కల్గించ ప్రార్థన.

మారుతీ హనుమాన్ శరణార్థి, రామచంద్ర అప్పారావు (మదరాసు)

150 = 1.50 ?

నేను షాపువాడికి 150 పైసలు (అన్నీ ఒక్క పైసల నాణేలు) తీసుకెళ్ళి ఆంధ్ర సచిత్ర వారపత్రిక ఇమ్మంటే 'ఆ నాణేలు చెల్లవు, తీసుకోను' అన్నాడు. మరి, మీరేమో ఆంధ్ర సచిత్ర వారపత్రిక పైన 150 పైసలు వెల అని వేస్తున్నారాయే! ఇక నుంచి ఇలా వేయండి — వెల 1-50 అని!

సయ్యాదా అతహార్ (నందిగామ)

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :

దేశోద్ధారక కాశీనాథుని

నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితం : 1908

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు :

[1938-1972]

శుక్రవారం : 30-9-'83

రుధిరోద్గారి నామ సం. భాద్రపద బ. అష్టమి

సంపుటము 76 సంచిక 3

సంపాదకుడు :

శివలెంక రాధాకృష్ణ

విడి ప్రతి వెల రు. 1-50

ఆరు మాసాల చందా రు. 42 90

పోస్టులో ఏడాది చందా రు. 85 80

ఆంధ్రపత్రిక కార్యాలయము,


గాంధీనగరం. విజయవాడ-520 003.

విషయానుక్రమణిక

మనలో మాట

ఆంధ్ర సచిత్ర వారపత్రిక వజ్రోత్సవ సంచిక పాఠకుల మన్ననలని అందుకున్నందుకు సంతోషంగా ఉంది. కొన్ని ఎదురుచూడని కారణాలవలన ఆ సంచిక వెలువడటానికి కొంచెం ఆలస్యం అయింది. అనుకున్నన్ని పేజీలు వెయ్యలేకపోయాము. తప్పకుండా వజ్రోత్సవ సంచికలో వేద్దామనుకున్న రచనలు కొన్ని మిగిలిపోయాయి. అంతేకాకుండా, వజ్రోత్సవ సంచికలోనే మేము మనవి చేసుకున్నట్లు, కొన్ని పాత సంచికలు పోయాయి– బొంబాయి నుంచి మదరాసు, మదరాసు నుంచి విజయవాడకి మారినప్పుడు సంపుటాలు పోవటంలో ఆశ్చర్యంలేదు- కొన్ని సంచికలలోని పేజీలు కత్తించి ఉన్నాయి (వాటిని ఎవరో చదవటానికని తీసివేసి ఉండాలి). కొన్ని రచనలని మళ్లీ అచ్చు వేద్దామనుకున్నప్పటికి అవి ఎలాగో పడకుండా ఉండిపోయాయి. రాబోయే సంచికలలో తప్పిపోయినవన్నీ పడగలవు. అప్పటి అమూల్యమైన రచనలని చదివేందుకు ఇప్పటి పాఠకులకి మంచి అవకాశం కలుగుతుంది అప్పుడూ, ఇప్పుడూ కూడా చదివేవారిసంగతి సరేసరి! కాపీరైటు వగయిరాలని దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్నవారి కథలని మాత్రం మళ్లీవేశాము. (పానుగంటి లక్ష్మీనరసింహారావు పంతులుగారి కథని మినహాయిస్తే !) వీలు ఉంటే తగిన ఏర్పాటులు చేసుకుని ఇతరుల కథలని కొన్నిటిని కూడా వెయ్యాలని ఉంది. వజ్రోత్సవ సంచిక వెలువడటానికి తోడ్పడిన వారందరికీ ఇంకొకసారి హృదయపూర్వకంగా మా అభివందనాలని తెలుపుకుంటున్నాము.

లోకం పోకడ :: ఊమెన్



విదేశీ ధనం వస్తే ఒరిగేదేమిటి?

న్యూఢిల్లీ లేఖ



డా॥ జయదుబాషి

ధనం పలుకుతుంది. విదేశీ ధనానికి యాస కూడా ఉంటుంది. స్వరాజపాల్ కానివ్వండి, ప్రణబ్ పీటర్ కానివ్వండి విదేశీ ధనం నిర్గుణమయినది కాదు. అది ఇంత కట్టలు కట్టలుగా వచ్చిపడితే ఏమయినా జరగవచ్చు. దాన్ని తెప్పించుకునేవాళ్లకి ఈ సంగతి తెలిసే ఉంటుంది.

అసలు మనకీ విదేశీ ధనం కావాలా? పార్లమెంటులో మాట్లాడుతూ ప్రణబ్‌ముఖర్జీ మనకి ఈ డబ్బు "కావాలి" అన్నారు. ఎందుకు కావాలి? ధనం (విదేశీ లేదా భారతీయ ధనం) లేకపోతే మనదేశంలో ఆర్థిక ప్రగతి ఉండదా? లేకపోతే, సరిగ్గా పరిపాలించలేనివాళ్లు చెప్పే సాకా ఇది?

ప్రగతి అంటే ఏమిటో తేల్చుకోవాలి. ప్రగతి అంటే 5 — చుక్కల హోటళ్లూ, రంగు టెలివిషన్‌లూ, మెర్సిడీస్ కారులూ అయితే మనకి విదేశీ ధనం కావలసిందే. మనకి విదేశీ ధనం కావలసి రావటమే కాదు విదేశీ ధనానికి మనమూ కావాలి. ప్రగతి అంటే ఇదికాదు — తలమీద చూరూ, రోజుకి రెండు పూటల భోజనం, వంటికి బట్ట అనుకుంటే మనకి బయటినుంచి డబ్బు అక్కరలేదు.

మన దేశంలో అన్నిరకాల వస్తువులూ తయారుచేస్తారు: ఉక్కు, కరెంటు, లారీలు, రైలు వాగన్‌లు, సైకిళ్లు, హెలికాప్టరులు. అవిమేలిరకం సరుకు కాకపోవచ్చుకాని దేనినయినా చెయ్యటం మొదలుపెట్టగానే మేలిరకం సరుకు తయారుకాదు. మనకి ఉత్తమ స్థాయి సరుకు ఎందుకు? మన జనంలో సగంమందికి పయిగా "పేదరికపు రేఖ" కిందనే ఉన్నారు. ఇదంతా నెహ్రూ కుటుంబం 30 సంవత్సరాలు పరిపాలించిన తరువాత. విముక్తి ఎప్పుడు వస్తుందో తెలీదు, పద్ధతి మార్చే తరుణం వచ్చింది. యంత్రాలు కాదు మానవులు ముఖ్యం. విదేశీ ధనం కాదు స్వదేశీ ధనం ముఖ్యం. యంత్రాలకి బయటివాళ్ల డబ్బు అవసరమేమోకాని మనుష్యులకి అక్కరలేదు.

విదేశీ ధనంలో ఎక్కువ శాతం పరిశ్రమలలోకి వెడుతుంది ఇందులో పనిచేసేవాళ్లు ఎవరు? మీలాంటివాళ్లూ, నాలాంటివాళ్లూను. విద్యాభ్యాసం లేక తంటాలు పడేవాళ్లు కాదు. మనం ఎంతో ధనం పెట్టుబడి పెట్టాము, పారిశ్రామికాభివృద్ధి సాధించాము. ఆధునిక సంస్థలని నెలకొల్పాము — కాని నిరుద్యోగ సమస్య తగ్గటంలేదు. మొత్తంమీద పరిశ్రమలలో ఉద్యోగావకాశాలు తగ్గుతున్నాయి. గ్లాక్సో కంపెనీలో 10 సంవత్సరాల కిందకన్నా ఇప్పుడు తక్కువ మంది పని చేస్తున్నారు. హిందూస్తాన్ లీవర్‌ని తీసుకోండి. ఇది బాగా ఎదిగే కంపెనీ. అయినా సరే ఈ సంస్థలో ఉద్యోగాల సంఖ్య అంతగా ఎక్కువ కావటంలేదు.

స్వరాజపాల్, ఆయన లాంటి వాళ్లు తెచ్చే డబ్బు ఇలాంటి కంపెనీలలోకే వెడుతుంది. అది ఎవళ్లకయితే సహాయం చేస్తుందంటారో వాళ్లకి సాయం చెయ్యదు. ఎస్కార్ట్‌స్, డి. పి. ఎమ్. సంస్థలకి బాగా ఆస్తులున్నాయి. వీటికి ఇంకా మూలధనం అవసరం లేదు. వాటికి ఎప్పుడు మూలధనం కావాలిసినా బజారుకెళ్ళి అడిగితే చాలు వచ్చేస్తుంది. విదేశీ ధనం అనేది భరత్ రామ్‌లకీ, నందాలకీ అవసరం లేదు. అది పేదలకి అక్కర కారాదు. అయితే అది ఎవరికి అందుతుంది? ప్రభుత్వానికి, అంతే రాజకీయవాదులకి వాళ్లు దానిని ఎలాగ కర్చుచేస్తారు? తటస్థదేశం సమావేశాల మీద, ఆసియాడ్‌ల మీద, విదేశీయాత్రల మీద కర్చు చేస్తారు. కొంత ప్రభుత్వరంగం అనబడే అగాధంలోకి చేరుకుంటుంది. ఈ ప్రభుత్వరంగం జనానికి తిండి పెట్టాలి కాని నిజంగా జరిగేది ఏమిటంటే జనమే దాన్ని మేపుతున్నారు.


విదేశీ ధనం ఎక్కువగా వస్తే పరిస్థితులు మరింత దిగజారవచ్చు. ఎందుకంటారా? టెరిలిన్ నూలు తయారు చేసే మిల్లులు ఎక్కువ అవుతాయి, పత్తి నూలు తయారు చేసేవి తగ్గుతాయి; 5—చుక్కల హోటళ్లు పెరుగుతాయి. బీదలకి ఇళ్ళు తగ్గుతాయి; విలాస వాహనాల తయారీ పెరుగుతుంది, బస్సుల సంఖ్య తగ్గుతుంది; విదేశాలకి వెళ్లేవారి సంఖ్య అధికం అవుతుంది, గ్రామాల నుంచి జీవనోపాధి కోసం నగరాలకి వచ్చేవారి సంఖ్య క్షీణిస్తుంది. అందుకు నేనింతకిముందే అన్నట్లు డబ్బు పలుకు మోటుగా కూడా ఉంటుంది.

స్వరాజపాల్ తన ధనం తీసుకువచ్చి మనకేమీ సాయం చెయ్యటంలేదు. అసలు అది అతని ధనమేనా? అలాగనేసి ఆయన తనదీ, తన యజమానులకీ సాయం చేసుకుంటున్నాడు. కొన్ని లక్షల పవునులతో వచ్చి కొన్ని వందల కోట్ల కంపెనీలని మింగేద్దామని ఆయన ఆశ. ఇలాగ ప్రపంచంలో ఎక్కడయినా వీలవుతుందా? విదేశాలలో ధనం దాచుకునేవాళ్ల సంఖ్య పెరుగుతోంది. ధనం కూడ పెరుగుతోంది. అందుచేత ధనం విలువ తగ్గుతోంది. ప్రపంచ బాంకు మాజీ అధిపతి రాబర్‌ట్ మెక్‌నమారా లాంటివాళ్ళు పేద దేశాలలో ధనం పెట్టుబడి చెయ్యాలంటారు. వాళ్లని ఇక్కడ పెట్టుబడి చెయ్యనిస్తే వాళ్లే మనకి ఏదయినా ఇవ్వాలి. మనం వాళ్లకి ఎందుకు డబ్బు ఇవ్వాలి?

విదేశీ ధనం వస్తే మంచిదే అంటాను నేను. కాని అది ప్రభుత్వ రంగం, ప్రయివేటు రంగంలోకి వెడితే మనకేమి సుఖం? అక్కడ ఇది ఎవరికి పనికి వస్తుంది? విదేశీ ధనంతో మనం మన జనానికి తిండీ గుడ్డలని ఇప్పించగలగాలి. మీలాంటి, నాలాంటివాళ్లకి ఇంకా సౌకర్యాలు ఎందుకు? స్వరాజపాల్ వ్యవహారం అసలు అర్థం ఇదే. ఆయన కొన్ని షేరులు కొనవచ్చునా లేదా అన్నది ముఖ్యమయిన ప్రశ్న కాదు. భారతదేశం ఎల్లకాలం చిప్ప చేతోపట్టుకుని పాల్ లాంటి అప్రయోజకుల మాటలు వినటమేనా? మనకి ఏది మంచిదో ఏది కాదో ఇటువంటివాళ్లా చెప్పేది? దేశం వదిలి ఇంకో దేశం పౌరులయిపోయిన వాళ్లకి భారతదేశానికి ఏది అవసరమో ఎలాగ తెలుస్తుంది? శ్రీమతి గాంధికి, ప్రణబ్‌ముఖర్జీకి ఏమికావాలో, ఇదొక్కటే వాళ్లకి తెలుసు.

విదేశీధనం ఏమి చెయ్యగలదో చూడాలంటే బ్రెజిల్, మెక్సికోలకి వెళ్లాలి. ఇవి మనకన్నా సంపన్నమయిన దేశాలేకాని కాంచనం మీద కాంక్ష పెరిగి అప్పులు చెయ్యటం ప్రారంభించారు. ఆ దేశాలు దివాలాతీసే స్థితిలో ఉన్నాయి. వాటి ఆర్థికవ్యవస్థలు అయోమయంగా ఉన్నాయి. రియోడి జెనెయిరోలో ఉన్నన్ని మురికివాడలు బొంబాయిలో ఉండవు. ఇక బ్రెజిల్ ఆర్థిక మంత్రిగారు ఏమి చేస్తున్నారంటే అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ బాంకు కార్యాలయాలలో ఇంటర్‌వ్యూలకోసం పడిగాపులు కాస్తున్నారు. మన మంత్రులూ అంతే—వారికి ఆత్మాభిమానం తక్కువ, ఒక డాలరుకోసం ఏమయినా చేస్తారు. కాని మనందరం అటువంటి వాళ్లము కాము కదా? మనకి ఆత్మగౌరవం అంటూ లేదూ? ★

ఆంధ్ర సచిత్ర వారపత్రిక 30—9—83



MCA-TDB-52-TEL

ఆనంద్ విషాదాంతం—

భర్త గొంతు పిసికిన ఇందూ ఆనంద్!

—ప్రధాన సాక్షిగా మారిన నౌకరు

సరిహద్దు భద్రతా దళాల డి. ఐ. జి. శ్రీ జోగిందర్‌సింగ్‌ఆనంద్ జూలై రాత్రి 12–13 లకు చండీఘర్‌లోని తన గృహంలో హత్య చేయబడినట్లు చెప్పబడుతోంది. అతని శవం 'సుఖ్నా' కొలనులో ముంచి వేయబడింది. ఈయన శ్రీమతి మేనక గాంధీకి పినతండ్రి.

నిజానికిది హత్యా, ఆత్మహత్యా? ఎవరు చేశారు? ఎందుకు చేశారు? ఇదంతా ఓ మిస్టరీలా సాగిన కథనం.

ఆనంద్ కేసులో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (చండీఘర్) ఆనంద్ కుటుంబ నౌకరు దర్శన్‌లాల్‌ను అరెస్టు చేసినపుడు అతను హత్యానేరం ఆనంద్ భార్య



యువిక, ఇందు

శ్రీమతి ఇందూ ఆనంద్, కుమారుడు, సుమన్‌జీత్ (నిక్కీ) మేనల్లుడు సందీప్(శాండీ) కలసి చేసినట్లు చెప్పాడు. ఇతను తన స్వహస్తాలతో హిందీలో ఇచ్చిన 44 పేజీల వాఙ్మూలం సెక్షన్ 164 సి.ఆర్.పి.సి. క్రింద సి.బి.ఐ. స్పెషల్ ట్రయల్ జడ్జి కె. సి. లోహియాచే రికార్డు చేయబడింది.

దర్శన్‌లాల్ ఆనంద్ కుటుంబ నౌకరుగా జూలై 8, 1982లో నియమింపబడ్డాడు. అప్పుడు వారు చండీఘర్‌లో ఉండేవారు. దర్శన్‌లాల్ వాళ్ళ కుటుంబ సభ్యులలో ఒకడిలా ఉండేవాడు.

ఈ సం॥ మే నెలలో ఒకసారి ఆనంద్ తన ఇంటికి వచ్చి వెళ్ళాడు. తరువాత ఆయనకు



జె. ఎస్. ఆనంద్

జోధ్‌పూర్‌కు బదిలీ అయ్యింది. పోయిన సం॥ కొన్నిరోజులు ఆనంద్ కుటుంబం చండీఘర్ ఇంటికి తాళంవేసి జోధ్‌పూర్‌లో గడిపివచ్చారు.

జూలై 3, 1983లో ఆనంద్ కుటుంబం చండీఘర్‌కు తిరిగి వచ్చారు. జూలై 8 తారీఖు ఆనంద్ కూడ ఇంటికి తిరిగి వచ్చాడు. జూలై 12 తేదీన తాము అమ్మిన ఇంటి పక్క ఇంటిలో కాక్‌టైల్ పార్టీకి ఆనంద్ కుటుంబ సభ్యులంతా వెళ్ళారు. యువిక, దర్శన్‌లాల్ మాత్రం ఇంటిలోనే ఉండిపోయారు. సుమారు రా. 11 గం.ల ప్రాంతంలో పార్టీకెళ్ళిన వారు ఇల్లు చేరారు. శ్రీమతి ఆనంద్ వంట ఇంటిలోకి వెళ్ళగా ఆనంద్, నిక్కీ, శాండీ తమ తమ గదుల్లోకి వెళ్ళిపోయారు. శ్రీమతి ఆనంద్ అయిదారు నిమిషాల్లో నూడుల్స్ [ఒక విధమైన వంటకం] తయారుచేసి ఆనంద్ వస్తే వడ్డించమని దర్శన్‌లాల్‌కు చెప్పి భర్తను, పిల్లలను పిలవను మేడ మీదకు వెళ్ళింది. అక్కడ ఏమి జరిగిందో గాని భార్య, భర్తలిద్దరు ఇంగ్లీషులో ఘర్షణపడ సాగారు. శ్రీమతి ఇందూ ఆనంద్ చాలా కోపంతో 11 గం. 15 నిమిషాలకు బయటికి వచ్చి తనే కారు నడుపుకుంటూ వెళ్ళిపోయింది ఆమె అటు వెళ్ళిన అయిదు నిమిషాలకు సుమన్‌జీత్ వచ్చి తండ్రి స్టోర్ తాళాలడిగితే, తన తల్లి దగ్గర ఉన్నాయని చెప్పమని దర్శన్‌లాల్‌తో చెప్పి వెళ్ళాడు.

దర్శన్ ఒక మంచంమీద గేటు కనిపించేటట్లుగా కూర్చొని ఉండగా శ్రీమతి ఇందూ వెళ్ళిన ఇరవై నిమిషాలకు ఇంటికి తిరిగి వచ్చి గుమ్మంలో అడుగు పెట్టడమే ఆనంద్ అడ్డగించాడు. శ్రీమతి ఇందూ ఆనంద్ ఆనంద్‌ను ఇంగ్లీషులో బిగ్గరగా కేకలు వేసింది కాని అవి ఏవీ దర్శన్‌కు అర్థం కాలేదు. కొద్ది సేపటికి ఆనంద్ ఇంట్లోంచి బయలుదేరాడు. గేటు దగ్గర యువిక పిలుస్తున్నా తిరిగి చూడకుండా వెళ్ళాడు. అప్పుడు నిక్కీని పిలిచి తండ్రి వెళ్ళిపోతున్న సంగతి చెప్పింది.

నిక్కీ, శాండీ మేడ పైనుంచి పరుగెత్తుకుంటూ వచ్చి ఆనంద్‌ను వెంబడించారు. పది నిమిషాలకు నిక్కీ, శాండీ ఆనంద్ చేతులు చెరొక భుజం మీద వేసుకొని ఇంటికి చేర్చారు. శ్రీమతి ఇందూ ఆనంద్, ఆనంద్‌ను సోఫా దగ్గర చూస్తూనే పెద్దగా పొట్లాడుతూ అతని మెడను తన రెండు చేతులతో పట్టి పిసికేసింది. నిక్కీ, శాండీ తమ భుజాల మీదున్న ఆనంద్ చేతులు వదిలేశారు. ఆనంద్ విరుచుకు పడిపోయాడు.




నిక్కీ

దర్శన్ నీళ్ళు తెచ్చి ఆనంద్ నోటిలో పోయ ప్రయత్నించాడు గాని అవి మింగుడు పడలేదు. శాండీ, నిక్కీ ఆనంద్ పాదాలు రుద్దసాగారు. ఇందూ, ఆనంద్ ప్యాంట్ వదులు చేసి పొట్టపై నొక్కింది. గుండె కొట్టుకుంటూ ఉందా! లేదా! అని చెవి వొగ్గి మరీ వింది. శ్వాస ఉందా! లేదా! అని చూసింది. అప్పటికే ఆయన ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి.

అందరి మొహాలూ ఒక్కసారి పాలిపోయాయి. యువిక ఏడవటం మొదలు పెట్టే సరికి ఇందూ ఆమెను మేడమీదకు పొమ్మనిచెప్పి, నిక్కీ వైపు తిరిగి ''జరిగిందేదో జరిగింది'' అని దర్శన్‌తో నీవు మా కుటుంబ సభ్యులలో

[60 వ పేజీ చూడండి]



"మనం నావెల్టీకోసం అనవసరమయిన రిస్క్ తీసుకుంటున్నామేమో అనిపిస్తోంది కాశ్యప్'' అని, ఆ వేళ అయిదోసారి, నా అనుమానాన్ని వ్యక్తం చేశాను.

మీటర్ వెడల్పు, మూడు మీటర్ల పొడవు ఉన్న మైకాటాప్ వర్క్ టేబిల్‌కి ఒక చివర్న నేను, మరో చివర కాశ్యప్ కూర్చుని ఉన్నాం. టేబిల్ అంతా విడి కాయితాలు, డ్రాయింగ్ పేపర్ ముక్కలు, పెన్సిళ్లు, పెన్నులతో చిందరవందరగా ఉంది. పరిస్థితి ఇట్లా ఉంటేనే సీరియస్‌గా పని చేస్తున్న ఫీలింగ్ కలుగుతుంది కాశ్యప్‌కి. మూడేళ్లుగా అతనితో కలిసి పని చేయటం వల్ల నాకూ అదే అలవాటు అయిపోయింది.

సగం వేసిన స్కెచ్‌ని ముందుంచుకుని, బుర్రలో ఉన్న ఊహలకి రూపాన్ని ఎలా ఇవ్వాలా అని, పెన్సిల్ కొసతో, మెడ మీద జుట్టులో గీకుతూ, ఆలోచనల్లో మునిగిపోయిన కాశ్యప్, నా మాటలకి, ఇహలోకం లోకి వచ్చేడు.

''మై డియర్ మనోరమా! యూ ఆర్ మిస్‌టేకన్. 'నావెల్టీ' కోసం అని ఎవరన్నారు? 'రిజల్ట్స్, ప్రాఫిట్స్'—వే మనకీ, మన క్లయింటికీ కూడా కావలసింది. 'రిస్క్' అంటావా లాభం కోసం చేసే ఏ పని అయినా రిస్క్‌తో కూడుకునే ఉంటుంది, చూస్తుండు; ఈ కాంపెయిన్ ఎంత ఫెంటాస్టిక్ రిజల్ట్స్ ఇస్తుందో! తలచుకుంటేనే ఉత్సాహం వచ్చేస్తోంది నాకు'' అంటూ జేబులోంచి, సిగరెట్ పాకెట్ బయటికి తీసాడు.

ఉత్సాహం కలిగినా, బాధ కలిగినా, సీరియస్‌గా ఆలోచించాల్సి వచ్చినా, సిగరెట్టు కాలుస్తాడు కాశ్యప్ (అంటే ఇవేవీ లేనప్పుడు కాల్చడని అర్థం కాదు!) అతని సహవాసం వల్ల, అయిన రెండో అలవాటు, పూర్తిగా

కూపస్థ మండూకం

సిగరెట్ల పొగతో నిండిన వాతావరణంలో పని చేసుకోవటం.

మారీ అండ్ టోనీ కంపెనీవారి ఎకౌంట్లు మా ఏజెన్సీకి వచ్చిన రోజు బాస్ మమ్మల్నిద్దర్నీ తన గదిలోకి పిలిచి కూచోబెట్టుకుని ప్రత్యేకంగా చెప్పారు. నెల రోజుల లోపున ఈ కంపెనీ ఏడ్ కాంపెయిన్‌కి, అవుట్‌లైన్స్ తయారు చేయండన్నారు. ఆ కంపెనీ గురించి ఆయన సేకరించిన వివరాలున్న ఫైల్‌ని మా హస్తగతం చేశారు.

ఒకరి తర్వాత ఒకరం ఫైలు తిరగేశాము. అకౌంట్ పెద్దదే. న్యూస్ పేపర్స్‌తోబాటు ముఖ్యంగా టి. వి. ని మీడియంగా ఉపయోగించే అవకాశాలు కన్పించాయి.

నిజానికి ఇంతకన్నా పెద్ద ఎకౌంట్స్ కూడా లోగడ ఎన్నో మా కంపెనీకి వచ్చాయి. అయినా ప్రత్యేకంగా ఈ కంపెనీ విషయంలో బాస్ ఎందుకో కొంచం నర్వస్‌గా, అసందిగ్ధంగా ఉన్నట్లు కన్పించారు.

కొంచం ఆలోచిస్తే కారణం తెలిసిపోయింది.

మారీ అండ్ టోనీ కం. కి, సిటీలో అరడజను టెయిలరింగ్, డ్రస్‌మేకర్ షాపులు, డజను బార్బర్ షాపులు ఉన్నాయి.

మా ఏజన్సీ క్లయింట్స్‌లో, కాస్మెటిక్స్ తయారుచేసేవారు, ఫర్నిషర్సు, రేడియో, టి. వి. కంపెనీలు ఇలా ఎన్నో రకాలు ఉన్నారు కానీ, ఇట్లా బార్బర్స్‌కీ, టెయిలర్స్‌కీ ఎప్పుడూ మేం 'ఏడ్ కాంపెయిన్' తయారు చేయలేదు. అంటే ఈ రంగంలో, మాకు ఏమాత్రం అనుభవం లేదన్నమాట.

బహుశా మా బాస్ అసందిగ్ధతకి కారణం ఇదే అయి ఉంటుంది – అనుకున్నాను.

ఒక శుభోదయాన, కాశ్యప్ తన మనసులో ఉన్న ఆలోచన నా ముందుంచాడు. 'రియాలిటీ' కోసం ఇంత దూరం వెళ్ళనక్కరలేదని చాలాసేపు వాదించాను కాశ్యప్‌తో. కానీ నా ఆర్గ్యుమెంట్స్ ఏవీ అతని పట్టుదల ముందు పనిచేయలేదు.

ఆఫీస్ విషయాలు బయట, బయటి విషయాలు ఆఫీస్‌లో, చర్చించటం కాశ్యప్ ఎప్పుడూ చేయడు. ఆఫీస్ దాటి బయటికి వెళితే చాలు, 'నా మాటే తనకి వేదవాక్కు' అన్నట్లుగా ప్రవర్తిస్తాడు. కానీ ఈ నాలుగ్గోడల మధ్య చేరిన తర్వాత ఆ పప్పులేం ఉడకవు. తన మనసులో ఆలోచనల్ని ఎలా నాకు చెబుతాడో, ఆదే విధంగా, నా అభిప్రాయాలని అతనూ శ్రద్ధగా వింటాడు. కానీ ఏ విషయంలో అయినా పట్టుదల పడితే మాత్రం, దాన్ని వదిలించటం నా తరం కాదు.

పోన్లే, ఇతని ఆలోచనల్తో బాస్ ఏకీభవించి నప్పుడు కదా, నేనెందుకు ఇప్పట్నించే దిగులు పడాలి అనుకున్నాను.

'కాంపెయిన్ అవుట్ లైన్స్' తీసుకుని ఇద్దరం ఆయన్ని కలుసుకున్నాం. వివరాలు చూడగానే, ఆయన ఆశ్చర్యానికి అవధుల్లేకుండా పోయాయి.

పరిస్థితి ఇలా ఉంటుందని కాశ్యప్‌కి తెలుసు. తన పాయింట్స్, ఆర్గ్యుమెంట్స్‌తో తయారుగా ఉన్నాడు.

ఈ కాంపెయిన్‌వల్ల బ్రహ్మాండమయిన ఫలితాలు పొందటం తప్పనిసరి అని నమ్మకంగా చెప్పాడు. బాధ్యత తనమీద పూర్తిగా ఉంచుకునేట్లు మాట్లాడాడు.

ఎట్లా అయితేనేం ఆయన్ని 'ఎస్' అనిపించాడు.

ఆ వేళనించి పని మొదపెట్టాము. కాపీ తయారుచేయటం నా పని. దానికి తగినట్లు, అరవయి సెకెండ్ల టి. వి. కమర్షియల్‌లో కనిపించాల్సిన ఫ్రేముల స్కెచెస్ తయారు చేసుకోవటం అతని పని

పూర్తి అయిన వాటిలో ఒక స్కెచ్‌ని, దానికి సరిపోయ్యే కాపీని పోల్చి చూసుకుంటూ, "బాస్ అసలు అప్రూవ్ చేస్తారనుకోలేదు కాశ్యప్" అన్నాను.

"పోన్లే, ఆయనకయినా నా మీద నమ్మకం ఉంది ..."

"ఛ! అది కాదు కాశ్యప్ ... నువ్వసలు నా భయాన్ని అర్థం చేసుకోవటం లేదు" అన్నాను, అస్త్రసన్యాసం చేస్తున్న దానిలా చేతిలో ఉన్న బాల్‌పెన్ కింద పడేసి చేతులు ముడుచుకుని, కూర్చున్నాను.

"విన్నా. నీ భయాన్నీ కూడా అర్థం చేసుకున్నానుగానీ,ఇవాళ్టికి దుకాణం మూసేద్దాం పద యంగ్ లేడీ" అంటూ లేచి, చేతులు రెండూ పైకెత్తి కొద్దిగా ఒళ్ళు విరుచుకుని. కోటు కోసం వెతుక్కుంటున్నాడు కాశ్యప్.

అది కుర్చీ కిందికి వెళ్ళి దాక్కున్నట్లుంది. తీసి అందించాను. అర నిముషంలో టేబిల్ మీదున్న కాయితాలన్నీ సర్ది ఖాళీ ఫైల్లో దూర్చేసి, బ్యాగ్ పుచ్చుకుని కాశ్యప్ వెంట బయటికి నడిచాను.

అవతల ఆఫీసులో మిగతా గదులన్నీ ఖాళీగా ఉన్నాయి. ఏ అరగంట క్రితమో అంతా వెళ్ళిపోయుంటారు.

మధ్యాహ్నం పని హడావిడిలో భోజనం విషయం మర్చిపోయినందుకేమో బాగా ఆకలిగా ఉంది.

అందుకనే, పార్కింగ్ ప్లేస్‌లోంచి స్కూటర్ బయటికి తీస్తూ, "ఊఁ ఏమిటి ప్రోగ్రాం ?" అని కాశ్యప్ అడిగితే, "ముందు ఏదయినా హోటల్‌కి. కడుపులో కాస్త ఇంధనం పడితే అప్పుడు చూడొచ్చు ఏం చేయాల్సింది" అన్నాను.

చెరొక సమోసా, మసాలా దోశ తిని, కాఫీ

తాగిన తర్వాత అడిగాడు కాశ్యప్, "సినిమానా. షికారా ?" అని.

"రోజూ సినిమాలు షికార్లేమిటి ? నన్ను ఇంటి దగ్గర దింపెయ్ కాశ్యప్. నేను అమ్మకు చెప్పలేదు కూడా ఆలస్యం అవుతుందని"

"ఆలస్యం అయినా అమ్మ ఏమీ అనుకోర్లే నుమా ! ఆవిడికి తెలీదా ఏం నువు నావెంట ఉంటావని... అయినా ఈ సరదాలు ఎన్నాళ్ళు ? ఒచ్చే నెలలో మన పెళ్ళి అయిపోతే, ఆ పయిన ఇల్లు, సంసారం, వంట వార్పుల్లో పడిపోతే ఎలాగూ షికార్లు కుదరవు. కనీసం ఈ కొద్ది రోజులయినా ఎన్‌జాయ్ చెయ్యాలి రాణీ" అని చిన్నగా రహస్యం చెబుతున్నట్లుగా అన్నాడు కాశ్యప్.

ఆ మాటలు అంటున్నప్పుడు, నా చూపులకి అతి దగ్గరగా వచ్చిన అతని ముఖంలో కనిపించిన భావం, నన్నేం మాయ చేసిందో గానీ, "సరే పద సినిమాకే వెళదాం..." అన్నాను; మృదువుగా, అతని వేళ్ళ మధ్య నలుగుతున్న నా చేతి ని తప్పించుకుని లేచి అతని వెంట అడుగులు వేశాను.

* * *

అనుకున్న రోజు రానే వచ్చింది. ఆవేళే మారీ అండ్ టోనీకం. వారి టి.వి, కమర్షియల్ షూటింగ్.

సిటీలో మంచి సెంటర్ అయిన, షూలే సర్కిల్‌లో, మారీ అండ్ టోనీ వారి బార్బర్ షాప్ ఒకటి, దానికి అనుకునే టెయిలరింగ్ షాప్ ఉన్నాయి. ఈ రెండు దుకాణాలు అత్యాధునిక మయిన అలంకారాలతో, వీధిన వెళ్ళే వారికి ఆకర్షణీయంగా, ఆహ్వానిస్తున్నట్లుగా కన్పిస్తాయి, ఈ రెండు దుకాణాల్లోనే ఇవాళ షూటింగ్ జరగాలి.

షూటింగ్ పదకొండు గంటలకి. కాశ్యప్ తన మోడల్ కోసం, పాత సిటీ డ్రెయినేజ్ బ్రిడ్జికి అవతల మురికివాడకి తొమ్మిదింటికి బయలుదేరి వెళ్ళాడు.

ఆ మనిషి — అతని పేరు జోగులట. ముప్పయేళ్ళ వయసుంటుంది. ప్రత్యేకించి ఒక పని అంటూ చేసే అలవాటు లేదు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారట. రోజంతా సోమరిగా ఏ ఫుట్‌పాత్ మీదో, చెట్టు నీడనో, గుడిసెలో కుక్కి మంచంలోనో పడుకుని నిద్రపోవటం, రాత్రికి భార్యని తన్ని ఆమెతెచ్చిన కూలి డబ్బులు లాక్కుని, పొట్టనింపుకోవటం, ఇంకా మిగిలితే చుక్కవేసుకోవటం ఇదీ అతని దినచర్య. ఓసిక, తీరిక ఉన్నరోజు, ఏ బస్టాండులోనో, చిన్నదో పెద్దదో ఒక్కటే ఒక జేబు కొట్టటం కూడా కద్దు. ఇవీ జోగులు గురించి కాశ్యప్ సేకరించిన వివరాలు.

"ఈ బ్రతుకేమిటోయ్. ఏదయినా పని చేసుకోరాధా ?" అని కాశ్యప్ అడిగితే, అదో పెద్ద జోక్ అయినట్లు, పకాపకా నవ్వేను, "నాకు పని ఇచ్చే పనికిమాలిన వెధవ ఎవరుంటారు సార్" అన్నాడట.

ఈ కమర్షియల్ కోసం రికార్డు చేసి ఉన్న టేప్ వేసుకుని వింటూ కూర్చున్నాను.

నా ముందర కాశ్యప్ తయారు చేసిన పన్నెండు స్కెచెస్ ఉన్నాయి. మొదటిది, బాగా జుట్టు, గెడ్డం పెరిగి మాసిన బట్టల్లో ఉన్న జోగులు అనే మనిషి. 'మారీ అండ్ టోనీ' వారి బార్బర్ షాపులో ప్రవేశిస్తున్నట్లున్న చిత్రం.

రెండవ దానిలో, 'మారీ అండ్ టోనీ' బార్బర్ జోగులుకి హేర్ కటింగ్, మూడవది షేవింగ్ చేస్తున్నట్లున్న చిత్రాలు.

నాలుగు, అత్యాధునికంగా ఉన్న స్నానాల గదిలో ఇద్దరు అటెండర్లు జోగులుకి స్నానం చేయిస్తున్న దృశ్యం. అయిదు కూడా దాదాపు అలాంటిదే.

చిన్న బెడ్ షీటు సైజులో ఉన్న పెద్ద టర్కిష్ టవలు చుట్ట బెట్టుకుని జోగులు, 'మారీ అండ్ టోనీ' టెయిలర్ షాపులోకి వెళ్ళటం — ఇది ఆరో స్కెచ్.

అతన్ని అలాగే నిలుచోబెట్టి, టెయిలర్ ఒకరు అతని కొలతలు తీయటం. వేరు వేరు పోజుల్లో ఇవే రెండు చిత్రాలున్నాయి.

తొమ్మిదవ చిత్రంలో టెయిలర్ బట్టలు కత్తిరించటం. పదవది, వాటిని ఎలెక్ట్రికల్ స్యూయింగ్ మెషీన్‌లో కుట్టటం.

పదకొండవదాన్లో ఆ బట్టలని జోగులు ధరించటం. చివరిది, కొత్త గెటప్‌తో పూర్తిగా మారిపోయి, వేరే మనిషిలా కనిపిస్తున్న జోగులు క్లోజప్.

"ఇదుగో, ఇతను జోగులు. ఇవాళ ఇతను 'మారీ అండ్ టోనీ' వారి అతిథి. అతన్ని వారెలా సత్కరిస్తారో చూడండి..." టేప్‌లోంచి మాటలు వినిపిస్తున్నాయి.

"ఏమిటీ ఇంకా టేప్ వేసుకుని కూర్చున్నావా ? పద పోదాం" అని హడావిడిగా లోపలికొచ్చాడు కాశ్యప్.

"ఏదీ నీ మోడల్" అన్నాను ఆసక్తిగా. నేను జోగులుని ఇంతదాకా చూడలేదు.

"వచ్చాడు. బయట కార్లో ఉన్నాడుగానీ, నువ్ రెడీయేనా ?"

ఇద్దరం బయలుదేరాము. దార్లో అన్నాడు కాశ్యప్, "ఈ జోగులుగాణ్ణి పట్టుకొచ్చేసరికి తాతలు దిగొచ్చారు తెలుసా ? రాత్రి సారాయి ఎక్కువయిపోయింది కాబోలు కొట్టుదగ్గరే పడి నిద్రపోతున్నాడు. వాణ్ణి నిద్రలేపి, 'రావయ్యా పోదాం' అంటే, 'ఉండు సార్ !' మూతి కడుక్కుని కూస్త తయారయి వస్తాను' అని గునిశాడు. "ఏడ్చినట్లుంది, నువు సింగారం ఏమీ చేసుకోనక్కర్లేదు. నిన్ను తీసుకువెళ్ళేచోట అన్నీ చేస్తారుగానీ పదవోయ్ అని లాక్కొచ్చాను."

బయట ఆఫీసు పనుల కోసం స్టాఫ్ ఉపయోగించుకునే కారు, దాని వెనకాలే, మేనేజర్‌గారి కారు నిలుచుని ఉన్నాయి.

కార్లో ఉన్న. జోగులుని చూడటంలో నిమగ్నం అయి ఉన్న నేను, మేనేజర్‌గారు కార్లో కూర్చుని మా కోసమే ఎదురు చూస్తూండటం గమనించనేలేదు. కాశ్యప్ 'హలో' అని ఆయని విష్ చేసేదాకా.

కారు దగ్గరికి వెళ్ళేక, "నేనూ వస్తున్నా మీతోబాటు. ఎలా పిక్చరైజ్ చేస్తారో



చూస్తాను. నీ కాంపెయిన్ చాలా క్యూరెయస్‌గా ఉందోయ్'' అన్నారు బాస్ కాశ్యప్‌తో.

స్కెచెస్‌లో ఉన్న జోగులు రూపం, కాశ్యప్ ఊహా జీవితమే అనుకున్నాను. కానీ నిజంగా కూడా ఆ బొమ్మల్లో లాగే ఉన్నాడు అతను. కార్లో డ్రయివర్ పక్కన కూర్చుని బీడీ తాగుతున్నవాడల్లా దాన్ని విసిరేసి, తుపుక్కున ఉమ్మేసి, బుద్ధిమంతుడిలా కూర్చున్నాడు, మా రాకని గమనించి.

ఆ మనిషి మెడకిందిదాకా చిందరవందరగా పెరిగిన జుట్టు, ముఖంలో కళ్ళు, ముక్కు తప్ప ఇంకేవీ కన్పించే అవకాశం లేకుండా ఉన్న బవిరి గడ్డం, అప్పుడప్పుడు, మట్టి నిండుకున్న గోళ్ళతో అతను జుట్టులో గీరుకోవటం చూస్తే, ఈ మనిషి బార్బర్ వాడి ముఖం చూసి ఎన్ని సంవత్సరాలయిందో అనిపించక మానదు.

మాసి, దుమ్ముకొట్టుకొని, అక్కడక్కడా చిరుగులుపడ్డ అతని లుంగీ, చొక్కాల అసలు రంగేమిటో చెప్పటం ఎవరి తరమూ కాదు. వాటి నుండీ వస్తున్న వాసన కారంతా నిండిపోయి, నాకు కడుపులో వికారంగా అనిపించింది.

కాశ్యప్ మాత్రం ఇవేమీ పట్టని వాడిలా కళ్ళు మూసుకుని, ఏవో ఆలోచనలు చేస్తూ కూర్చుని ఉన్నాడు. వెంబడి బాస్ వస్తూ ఉండటం అతనికి చిరాకు కలిగించినట్లుంది. ఎందుకంటే ఆయన అక్కడ ఉన్నంతసేపూ, తను సిగరెట్ కాల్చేందుకు వీలుండదు.

కూపస్థ మండూకం

కెమెరాలు, లయిట్లు అన్నీ సిద్ధంగా ఉన్నాయి, మేం వెళ్ళేసరికి. కారు దిగిన తర్వాత, కాశ్యప్ మళ్లీ ఒకసారి జోగులుకి అతను ఏం చేయాల్సిందీ సూచనలిచ్చాడు.

తల వంచుకుని తప్పు చేస్తున్న వాడిలా బెదురుగా బార్బర్‌షాప్, గ్లాస్ తలుపు తోసుకుని, లోపలికి వెళ్ళాడు. అక్కడున్న బార్బర్ ఒకరు అతన్ని సాదరంగా ఆహ్వానించి కూర్చోబెట్టాడు. తర్వాత ఇరవయి నిమిషాల సేపు హేర్ కటింగ్, షేవింగ్ జరిగాయి.

మధ్య మధ్యలో కాశ్యప్ సూచించినప్పుడల్లా కొన్ని క్షణాలు కెమెరాలు, లయిట్లు పని చేస్తున్నాయి.

వెనకాల కొంచెం దూరంలో బాస్ పక్కనే కుర్చీలో కూర్చుని చూస్తున్న నాకు, ఎదురుగా అద్దంలో జోగులు ముఖం కన్పిస్తోంది. చిన్న మీసకట్టు తప్పితే, నున్నగా నీడలు తేలేలా గీసిన గెడ్డం చక్కని క్రాఫ్ కటింగ్‌తో, ఆకర్షణీయంగా ఉంది జోగులు ముఖం.

బాస్ కూడా చాలా ఇంప్రెస్ అయినట్లు కనిపించారు. మైగాడ్ మంచి పర్సనాలిటేనే కాదు, చాలా ఫేర్ కాంప్లెక్షన్. ప్రొఫెషనల్ మోడల్స్‌ని మించేలా ఉన్నాడే'' అని గొణుక్కోవటం నా చెవుల పడింది.

తర్వాత సీన్ స్నానాల గదికి మారింది. ఆ కార్యక్రమం అయేసరికి, టబ్‌లో నీళ్ల రంగే పూర్తిగా మారిపోయింది. బొగ్గును పొడిగా చేసి, అందులో కలిపినట్లు కనిపిస్తోంది.

అక్కడినుండీ, టెయిలర్ షాప్‌లోకి మారేం. నిజానికి జోగులు కొలతలు, అన్నీ ముందే వాళ్ళదగ్గిరున్నాయి. వాటికి సరిపోయేలా బట్టలు కుట్టి కూడా ఉంచారు.

అప్పటికప్పుడు ఫిల్మ్‌కోసం, కొలతలు తీయటం, బట్టలు కత్తిరించటం, వాటిని కుట్టటం, కొన్ని సెకన్లపాటు ఫార్స్‌గా జరిగింది. కెమెరామెన్ తమ పని చేసుకుపోతున్నారు.

చివరకి తయారుగా ఉన్న బట్టలు ధరించాడు జోగులు. దానితో పూర్తిగా అతని అవతారమే మారిపోయింది. గంట క్రితం బార్బర్ షాప్‌లో అడుగు పెట్టిన వ్యక్తికీ, ఇతనికీ పోలికే లేదు.

మనిషి బాగా ఎత్తరి, దానికి తగ్గట్టుగా కొంచం కండలు తిరిగిన శరీరం, పచ్చని శరీర ఛాయ, జోగులుది. తుమ్మెద రెక్కలలాంటి మీసకట్టు, స్టైలుగా దువ్విన ఒత్తయిన జుట్టు, కూలింగ్ గ్లాసెస్, కనీసం వెయ్యి రూపాయలు అయినా ఖరీదు చేసే, ఎగ్జిక్యూటివ్ రకం సూటు, మాచింగ్ టై, షూతో, ఇప్పుడే ప్లేన్ దిగివస్తున్న, సినిమా హీరో లాగానో, పెద్ద వ్యాపారవేత్త లాగానో కనిపిస్తున్నాడు.

''మైగాడ్! ఎంత హేండ్‌సమ్‌గా ఉన్నాడు! నిజంగా కాశ్యప్‌ని అభినందించాల్సిందే'' అంటున్నారు బాస్.

'నిజమే' అనిపించింది నాకు.

షూటింగ్ అయిపోయింది. టెక్నీషియన్స్ సామానులన్నీ పాక్ చేస్తున్నారు.

టెయిలరింగ్ షాప్, హెడ్ టెయిలర్ మాకందరికీ డ్రింక్స్ తెప్పించి, మర్యాద చేస్తున్నాడు.

''బ్రంటే నీదేనోయ్ యంగ్‌మాన్! నీ కాంపెయిన్ సుపర్బ్‌గా ఉంది,'' అని సంతోషంగా కాశ్యప్‌ని మెచ్చుకున్నారు బాస్.

''నాదొక అయిడియా. చూడూ, ఆ మనిషి ఏం చేస్తుంటాడో తెలుసా నీకు ?''

''ప్రత్యేకించి ఇదీ అంటూ ఉద్యోగం లేదు. స్కూలంటే ఎలా ఉంటుందో కూడా అతను ఎప్పుడు చూసి ఉండకపోవచ్చు. ఇంతెందుకు, ఈ దేశంలో ఉన్న లక్షలాది అక్షరాస్య నిరక్షరాస్య నిరుద్యోగుల్లో ఒకడనుకోండి సర్'' అన్నాడు కాశ్యప్.

''మన ఆఫీస్‌లో అటెండర్‌గా ఉద్యోగం ఇద్దాం రమ్మను... అప్పుడప్పుడు మన కాంపెయిన్స్‌కి మోడల్‌గా కూడా పనికొస్తాడు'' అన్నారు బాస్. తన ఆలోచనకి తనే మురిసిపోతున్నవాడిలా కన్పించాడాయన.

స్మృతి

ఒక్కోమారు ఆకాశాన్నంతా దాచుకొన్న
ఆ నీలి కన్నుల్లో ధారలు, వరదలు
మరోమారు ఆ నీలి కన్నుల్లోనే
ఆకాశాన్ని కాల్చే అగ్ని తాపాలు, పరితాపాలు

మరోనాటికే నూరేళ్ళు నిండుతున్నా
శిగ బంధంలో సౌందర్యాన్నతిశయిస్తాయి పూలు
కలకాలం కత్తుల వెతలతో వెళ్ళదీసేకన్నా
స్మృతి మధురమైతే బ్రతుకు ఒక్క క్షణం చాలు.

అవి కన్నులైనా, పువ్వులైనా
దృష్టికీ, సృష్టికీ రమణీయమే

కన్నులు వర్షిస్తే మనుగడ గుడ్డిదవుతుంది
పువ్వులు వత్తలైతే సృష్టి చిన్నబోతుంది.

– డాక్టర్ పి. వి. రమణ

ఆయన ముఖంలో కన్పిస్తున్న ఉత్సాహం కాశ్యప్ ముఖంలో కన్పించలేదు నాకు. ఎందుకూ పనికిరాకుండా. మురికివాడలో, మట్టిలో తాగి దొర్లుతూ పడిఉండే జోగులుకీ, మా ఆఫీస్‌లో నెలకి మూడు వందల జీతంతో ఉద్యోగం ఇవ్వటం నిజంగా బాస్ సహృదయాన్నే చాటుతోంది. దీన్నిబట్టి, జోగులు ఆయన మనసుని ఎంత బాగా ఇంప్రెస్ చేసిందీ అర్థం అయింది.

కానీ కాశ్యప్‌లో ఈ నిర్లిప్తత ఏమిటో నాకు అర్థం కాలేదు. "వై ? ఆర్‌యూ నాట్ హేపీ" అని గుసగుసగా అడిగాను. కాశ్యప్‌ని. అతను నామాట విన్పించుకున్నట్లు లేదు.

'మారీ అండ్ టోనీ' కంపెనీ వారు బహుమతిగా ఇచ్చిన, తెల్లటి పైజమా, లాల్చీ వేసుకుని, జేబులో కాశ్యప్ ఇచ్చిన కొత్త రూపాయి నోట్లలో బయట కూర్చుని ఉన్న జోగులుని పిలుచుకొచ్చారు.

"ఏవోయ్, మా ఆఫీసులో ఉద్యోగం ఇస్తాం చేస్తావా ?"

"ఏంటి సార్. తమాషా చేస్తున్నారా ? నాకేమిటి ఉద్యోగమిస్తారా ?" అని పడి పడి నవ్వేడు జోగులు.

"నిజంగానే జోగులూ. సార్ నీకు ఉద్యోగం ఇస్తామన్నారు. జీతం మూడు వందలిస్తారు. రేపొచ్చి చేరతావా ?" అడిగాడు కాశ్యప్.

"ఓ తప్పకుండా బాబూ. నిజంగా మీ అయ్యగారు దేవుడిలాగున్నాడుగద సార్! చెయ్యెత్తి దండం బెట్టాల్సిందే. పని ఇస్తాం రమ్మంటే ఎందుకు రానూ ? రేపే వచ్చేస్తా. వెళ్ళొస్తా సార్"

అని మేనేజర్‌గారి కాళ్ళమీద పడినంత పనిజేసి, అందరికీ దండాలు బెట్టి, బయలుదేరాడు జోగులు.

* * *

రేపయింది. మరునాడయింది. జోగులు రానేలేదు. మేనేజర్‌గారు అడిగి అడిగి ఊరుకున్నారు.

"నువ్ తెచ్చిన జోగులు బొత్తిగా వింత మనిషిలా ఉన్నాడే, ఈ రోజుల్లో ఉద్యోగం ఇస్తాం రమ్మంటే ముఖం తప్పించే వాళ్ళెవరయినా ఉంటారా ?" అన్నాను కాశ్యప్‌తో.

'మారీ అండ్ టోనీ' టి.వి. కమర్షియల్ తయారయింది. మా ఆఫీస్ స్టూడియోలో, ఫిల్మ్‌ని ప్రొజెక్ట్ చేయించి, చూస్తున్నాం నేనూ, కాశ్యప్.

"ఆవేళ ఆర్‌యూనాట్ హేపీ" అని

ఇవేమన పద్యాలు



మాటలాడనేర్చి మనసు రాజిలచేసి
పరగ ప్రియము జెప్పి బడలకున్న
నౌకరి చేతిసొమ్ము లూరకె వచ్చువా
విశ్వదాభిరామ వినుర వేమ.

అడిగావు కదూ? నాకప్పుడే తెలును. బాస్ ఆఫర్ చేసినా, వాడు రాడని. నేనిచ్చిన డబ్బులన్నీ అయిపోయేదాకా వాడు సారాయి కొట్టు దగ్గరే మకాం వేసుంటాడు. వాడికి ఉద్యోగం చేసే యోగ్యత ఎక్కడుంది ?"

"అంతేనా ?"

"అంతే మరి ... మనం శుభ్రం చేసి, అలంకరించింది వాడి శరీరాన్ని గాని, మనసును కాదుగా ? అది ఎప్పటిలా మట్టికొట్టుకునే ఉంటుంది. దాన్ని శుభ్రం చేసి, మేకప్ చేయగల శక్తి మనకు ఉందనుకోను ... సోమరిపోతును బాగుచేసే శక్తి, వాణ్ణి పుట్టించిన ఆ బ్రహ్మకూడా ఉండదు సుమా !" అని అంటున్న కాశ్యప్ వయిపు అర్థం కాని దానిలా చూస్తూ ఉండిపోయాను. ★

వ్యక్తిగతం



ఫిలిప్పయిన్స్ ప్రతిపక్ష నాయకుడు బెనిగ్నో అక్వినోని ఆయన శత్రువులు దారుణంగా హత్య చేశారు. ఆయన విమానంలో స్వదేశం తిరిగి వచ్చారు. హంతకులు విమానంలోనుంచి ఆయనని బయటికి లాక్కువచ్చి తుపాకీతో కాల్చి చంపేశారు. ఇదంతా అందరి ముందూ జరిగినా హంతకులని ఎవరూ పట్టుకోలేదు. దీని వెనుక రహస్యం ఏమిటి ?



మార్టిన్ లూథర్ కింగ్ ఆగస్టు 1963లో అమెరికా నల్లజాతివారి భవిష్యత్తు బాగుపడగలరన్న ఆశాభావాన్ని వెలిబుచ్చుతూ చేసిన ప్రసంగం చాలా ప్రసిద్ధమయిపోయింది. ఆ ఉపన్యాసం జరిగిన 20ఏళ్ల తర్వాత వాషింగ్‌టన్‌లోని అబ్రహామ్ లింకన్ స్మారక చిహ్నం వద్ద 2 లక్షల మంది అమెరికావారు పోగయి నీగ్రోజాతి స్థితిగతులని గురించి తమ నాయకులు చేసిన ప్రసంగాలని విన్నారు. వచ్చిన వారిలో అధ్యక్షుడు శ్రీ రీగన్ విధానాల పట్ల వ్యతిరేకత బాగా కనపడింది. ఈ సందర్భంలో అమెరికా అధ్యక్ష పదవికి పోటీ చేద్దామనుకుంటున్న జెస్సె జాక్‌సన్ పేరు బాగా ప్రాముఖ్యంలోకి వస్తోంది. జెస్సె లూయిస్ జాన్‌సన్ వయస్సు 41...



సందీప్ (ఉరఫ్ శాండీ) ఆనంద్ ఎవరు ? ఈ మధ్యనే హత్య చెయ్యబడిన డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జె. ఎస్. ఆనంద్ తాలూకు. హత్యకి సంబంధించిన సాక్ష్యం మరుగు పరిచాడన్న ఆరోపణ మీద జోధ్‌పూర్‌లో అరెస్టు అయ్యాడు...

వారఫలం

30–9–1983 శుక్రవారం మొదలు 6–10–1983 గురువారం వరకు

♈ మేషం: సాహిత్యాభిలాషులకు సదవకాశాలు లభిస్తాయి. వ్యవహార రంగంలో కూడా మేలు జరుగనున్నది. కొనుగోలు చేసిన యినుప వస్తువులు అమ్మజూపుతారు. యంత్ర మూలంగా జరుగ దగిన పనులందు జాప్యం జరుగుతుంది. స్త్రీలకు: వృత్తిలో రాణింపు, నటన నాట్య విధానంలో ఆశించిన అవకాశాలు లభిస్తాయి.

♉ వృషభం: వ్యాపారం అనుకొన్న రీతిగా జరిగి పోతుంది. కళా ప్రీతి గలవారికి అనుకూల వాతావరణం సమకూడుతుంది. మీ నిజాయితీకి గుర్తింపు సమకూరుతుంది. వృత్తిలో సదవకాశాలుంటాయి. స్త్రీలకు: యత్న కార్య సిద్ధి, ధనలబ్ధి, గలవారం.

♊ మిధునం: చాల కాలంగా చేతికి అందని ద్రవ్యం ఈవారం అందటం, అవసరాలు తీరటం జరుగుతుంది. విద్యాభివృద్ధిని ఆశించిన వారికి గాని, దూర దేశ ప్రయాణం ఆశించిన వారికి గాని మేలు చేకూర గలవారం. మీ నిజాయితీకి గుర్తింపు కనిపిస్తుంది. స్త్రీలకు: ఆశించిన పనులు నిరాటంకంగా నెరవేరటం, అవసరాలకు ద్రవ్యం అంది రావటం గమనిస్తారు.

♋ కర్కాటకం: అవసరాలకు ధనం అందుతుంది. వ్యవహార సంబంధంగా మీరు చేసిన యత్నాలు ఫలిస్తాయి. అనుకోకుండా యిబ్బందులలో చిక్కుకొన్న వారు యింటికి రానున్నారు. ప్రతిభ రాణించే అవకాశాలున్నాయి. నూతనాంశాలు గ్రహిస్తారు. వాహనమో, విలువ గల వస్తువో కొనుగోలు చేయగలరు. యథావిధిగా జరిగే పనులందు జాప్యం లేదు. స్త్రీలకు: అన్ని విధాలా అనుకూలమే.

♌ సింహం: అధికార రీత్యా ఉన్నత ప్రమాణాలు అందుకో గలరు. ఇతరుల చేత చిక్కిన ధనం ఖండ ఖండాలుగా అందుతుంది. ధనాభావం వలన చాల యిబ్బంది పడుతారు. స్త్రీలకు: ఉన్నత పదవి లభించటమో, ఉన్నదానిలో అభివృద్ధి కనిపించటమో, కార్య విజయమో చెప్పదగిన వారం.

♍ కన్య: మీ ఆలోచనలు ఫలిస్తాయి. యత్న కార్యమందు విజయం చేకూరుతుంది. సన్మాన సత్కారాలందు చాలమంది నిమగ్నులు కాగలరు. సంఘ సేవా పరాయణత్వం గుర్తింపు పందగలదు. అవకాశ వాదులను, స్తోత్ర ప్రియులను దరి జేర్చకండి. స్త్రీలకు: అనుకొన్న పనులు నెరవేరటం, ఆదాయంలో అభివృద్ధి చెప్పదగిన అంశాలు, గ్రహించి, శ్రమించండి.

♎ తుల: సభా కార్యక్రమంలో చాలమందికి స్థానం ఏర్పడుతుంది. అభివృద్ధికార్యక్రమంలో చాలమంది నిమగ్నులు కాగలరు. వృత్తియందు ఆశించిన ప్రమాణాలు అందుకొంటారు. విద్యా రంగ ప్రసిద్ధి కనిపిస్తుంది. నూతనంగా గృహ నిర్మాణ కార్యకలాపమందు కొందరు నిమగ్నులయ్యే గ్రహస్థితి గలదు. స్త్రీలకు: వృత్తిలో అభివృద్ధి గలవారం.

♏ వృశ్చికం: ఇంటి విస్తృద్ధి చేయాలనే ప్రయత్నం కొనసాగుతుంది. కుటుంబానందం గల వారం. వ్యాపారం చేయాలని నూతనంగా ఉబలాటపడే వారికి మేలున్నది. అధికారుల ఆదరణ లభించే మార్గమున్నది. వస్తు వాహనాలు సమకూర్చుకొనుటకు మంచి సమయం. స్త్రీలకు: భూ సమస్య, గృహ సమస్యలు పరిష్కారం కాగలవు.

♐ ధనుస్సు: దూర ప్రాంతాల నుండి బంధు మిత్రులు యింటికి రానున్నారు. సాహిత్యాభిలాషులకు పత్రికా ప్రకటనా వ్యాసంగ నిమగ్నులకు, ఉత్తమ వారం. చాల కాలంగా తనఖా పడి నిలచిన వ్యవహారాలు, ముఖ్యంగా ఆర్థిక విషయంగా ఉంటే సుముఖంగా నెరవేర గలవు. స్త్రీలకు: సుఖ సంతోషాలు, హాయి, ఆనందం, వ్యవహారానుకూలం గలవారం.

♑ మకరం: ప్రతిభ రాణిస్తుంది. మాటకు విలువ పెరుగుతుంది. మీ నిజాయితీ గుర్తింప బడుతుంది. స్థిరాస్తి పెంపకానికి అవకాశ మున్నది. అవసరాలకు అంది పుచ్చుకొన్నట్లు ధనం సమకూడుతుంది. నిశ్చయంగా యత్న కార్య సిద్ధి గలదు. స్త్రీలకు: ప్రయాణానుకూలత, ఉద్యోగాభివృద్ధి గలవారం.

♒ కుంభం: సుఖశాంతులకు, ఆనందానికి, అవకాశం గలదు. భూదాయానికి చేసిన ప్రయత్నాలు అంది పుచ్చుకొన్నట్లు నెరవేర గలవు. వ్యవహారం ఏదయినా పరిష్కరింప బడవలసి ఉన్నా, భూసంపద వృద్ధి పందించుకోవాలన్నా ఈవారం అనుకూలం. స్త్రీలకు: చాలమందికి నిరుత్సాహం, యత్న కార్య విఫలత సంభవం.

♓ మీనం: చాలా ఉత్తమ ఫలదాయక వారం. అన్ని రంగాలలో వృద్ధి కనిపిస్తుంది. సభా గౌరవం దక్కుతుంది. కొందరకు ప్రజా రంగ ప్రసిద్ధి ఏర్పడుతుంది. అధికారుల వలన జరుగ వలసిన పనులుంటే సుసాధకమవుతాయి. పెద్దరికం వస్తుంది. క్రయ విక్రయ లాభం, కుటుంబంలో సుఖ సంతోషాలుంటాయి. వ్యవహార విజయ మున్నది. ఆర్థికంగా మీకు మేలు చేకూరుతుంది. వాహన ప్రాప్తి. స్త్రీలకు: ఉత్సాహం, ఉద్యోగాభివృద్ధి గలవారం.

— విద్వాన్ కోట సత్యరంగయ్య శాస్త్రి ★


"ఈ రోజుల్లో జీవితకాలం మన్నికగల బహుమతి దొరకడమే కష్టంగా ఉంది"
USHA
Best wishes from
USHA
"ఉషాకు నా కృతజ్ఞతలు"
మీ వివాహపు మొదటి వార్షికోత్సవాన్ని కలిపి జరుపుకునేటప్పుడు మీ భార్యకు. పెండ్లి కాబోతున్న కూతురుకు. హుందాగా వృద్ధాప్యాన్ని ఆహ్వానిస్తున్న అమ్మకు. లేదా మీకు ప్రాణప్రదంగా అభిమానించే సోదరికి.
జీవితకాలం మన్నికగలది; నిజంగా ఉపయోగపడేది, ఆతవారికి నిజంగా అవసరమైనది, ఆమెలో ఉన్న ఉత్తమ శక్తి సామర్థ్యాలు వ్యక్తమయ్యేందుకు అవకాశమిచ్చేది ఒక మంచి బహుమతిని ఎంపిక చేయడం చాలా కష్టం.
ఇది కష్టమైన పనే. కాని అసాధ్యం కాదు. ఉషాను ఎంచుకుని చూడండి.
USHA
ఉషా
అద్భుతమైన నాణ్యతకు ప్రతీక
ఉషా నం 1 అయినది
ఎందుచేతనంటే. దాని అద్భుతమైన నాణ్యతను అందరూ మెచ్చుకుంటారు.
ULKA-D-US-712

సీరియల్

జీవన మురళి



కొండముది శ్రీరామచంద్రమూర్తి

11

(గత సంచిక తరువాయి)

పరమేశ్వరం తెలివి తెచ్చుకుని ముక్కుతూ మూలుగుతూ ఎట్లాగో ఇంట్లోకి వచ్చి పడ్డాడు. బహుళంగా దెబ్బలు తగలకపోయినా, తగిలిన ఒక్క దెబ్బా బలంగా తగలడంతో అతను కుదేలైపోయాడు. ఇంట్లో వర్ధనమ్మ లబలబ లాడుతూ అతనికి ఉపచారాలు చేసింది. మురళీకృష్ణ గబగబా డాక్టర్ని తీసుకువచ్చాడు. జీవన అప్పటికప్పుడు వేడివేడి హార్లిక్స్ కలిపి ఇచ్చి, మంచంమీద పరుపువేసి ఆయనను ప్రశాంతంగా పడుకోబెట్టి కాళ్ళు పట్టింది.

డాక్టరొచ్చి భయంలేదని చెప్పి, నొప్పి తెలియకుండా వుండడం కోసమని ఓ ఇంజక్షనిచ్చి, తన దగ్గరున్న ఓ కాప్స్యూల్స్ సీసా కూడా అక్కడపెట్టి, ''అంతగా అవసరమైతే, ఆయన నొప్పంటూ బాధపడితే, ఇదిగో ఈ గొట్టాలు కూడా వేయండి — నాలుగ్గంటలకోటి చొప్పున!'' అంటూ వివరణ చెప్పి వెళ్ళిపోయాడు. హార్లిక్స్ తాగింతర్వాత, ఇంజక్షన్ చేయించుకున్న తర్వాత, తలకు కట్టు కట్టించుకున్న తర్వాత, ఆయనకు పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్లయింది.

అప్పుడు చెప్పాడు ఇంద్రసేన్ ఇంట్లో జరిగిన సంగతులు, తాను డబ్బు సంచీని చేత బట్టుకుని రావడమూ, మహంకాళయ్య తనను సందు మొగదల డ్రాప్‌చేసిన వైనమూ, చీకటీ, చీకట్లో దొంగచాటుగా తగిలిన దెబ్బా, తను అచేతనంగా కిందపడిపోవడమూ, డబ్బుసంచీ పోగొట్టుకోవడమూ ... అంతవరకూ చెప్పి, ''నాకు తగిలినందుకు బాధగా లేదర్రా, ఆ డబ్బు పోయినందుకే విచారంగా వుంది!'' అన్నాడు లోగొంతుకతో.

''ఆ సంచీలో ఎంతుందేమిట్రా డబ్బు ?'' వర్ధనమ్మ అడిగింది.

''తెలీదు !''

''అదేమిట్రా ? తెలీకుండా, డబ్బెట్లా తీసుకువచ్చావూ ?''

''నలుగురూ ఇచ్చారు. అదంతా మూట కట్టారు. దాన్ని నా వొళ్ళో పడేశారు !''

జీవన వున్నట్టుండి అడిగింది ''ఆ డబ్బు మీకిస్తున్నప్పుడు ఎవరెవరు చూశారూ ?''

''ఎందరో వున్నారమ్మా అక్కడ. అందరూ చూశారు. అది పబ్లిక్కు సంగతే కదా ?''

''అది సరే మావయ్యగారూ ! మీరు డబ్బు అందుకుంటుండగా అక్కడున్న వాళ్ళందరూ చూశారు. వాళ్ళందరూ కార్నున్నవాళ్ళు. దాన గుణం వున్నవాళ్ళు, డబ్బు ఇచ్చినవాళ్ళు, వాళ్ళకు ఇంత ఘాతుకం చేయాలని వుంటుందని నేనను కోను. వాళ్ళూ మీరే కలిసి బయల్దేరారు. ఒకరు మీకు కార్లో లిఫ్టుకూడా ఇచ్చారు. అంచేత మీ దగ్గరున్న డబ్బున్న సంగతి మీకన్నా ముందే గాలిలో ప్రయాణంచేసి, అందుకెవరో మనిషి సిద్ధమై అక్కడ మీ కోసం కాపువేసి వుంటాడని నే ననుకోవడం లేదు ! ''

''నువ్వు చెప్పేదేమిటో నాకు సరిగ్గా అర్థం కావడం లేదమ్మా ?'' పరమేశ్వరం అడిగాడు. మురళీకృష్ణ మధ్యలో అందుకున్నాడు. ''ఏంలేదు నాన్న! పెద్దపులి, సాధు గోవుగా మారిందంటే నాకు నమ్మకంలేదు ... పైగా దండోపాయం చేత సంస్కరణ బీజం హృదయంలో నాటుకొంటుందంటే కూడా నాకు నమ్మకం లేదు. ఇంద్రసేన్‌కు మనమంటే అయిష్టం. పైగా కసి. పగబట్టాడు. మనలాంటి వాళ్ళం అవతలివాళ్లకు లొంగిపోవాలంటే ఉన్నవాళ్ల చేతుల్లో వున్న వొకే వొక బలమైన ఆయుధం డబ్బు. మీరు డబ్బుకూ లొంగరు. అంచేత ఈ దోపిడీ చేయించి, ఆ నేరం మీ మీదే వేసి, మీరే అపరాధులని నిరూపించడం వాళ్ల ధ్యేయం ! ''

''అదెట్లా సాధ్యంరా ?'' ఇంకా పరమేశ్వరంలో నమ్మకం కలగడంలేదు.

''ఏముంది నాన్నా! రేపు పదిమందీ మీ దగ్గరకు వస్తారు. ఈ సంగతి తెలిసి సానుభూతి వొలకపోస్తారు. ఆ తర్వాత డబ్బు సంగతి ప్రస్తావన చేస్తారు. మీరేమో పోయిందంటారు. 'మాష్టారూ, వాదనకోసం అంటున్నాను. ఆ డబ్బును మీరే తగిలించుకుని ఆ డబ్బును మీరే ఆట్టే పెట్టేసుకుందామని ఈ పథకం వేశారు — అని నే నంటున్నాను ఎట్లా కాదంటారు ?'' అని ఇంద్రసేన్ అంటాడు. మీరెట్లా మిమ్మల్ని మీరు సమర్ధించుకుంటారు ? ''

''అందరూ నమ్మేద్దూ. ఆ మాట ? '' పరమేశ్వరం గొంతు బలహీనంగా వినిపించింది.

జరిగిన కథ — 8 : ఇంద్రసేన్ పరమేశ్వరంగారిని సర్వీసునుంచి సస్పెండు చేస్తాడు. ఆయన స్కూలులో జరిగిన విషయాలన్నీ కుటుంబ సభ్యులతో చెపుతారు. తన తండ్రికి జరిగిన అవమానం విన్న మురళీకృష్ణ కోపంతో ఇంద్రసేన్ ఇంటికి వెళ్లి, తన తండ్రిని సస్పెండ్ చేయడానికి గల రీజన్స్ చెప్పమని అడుగుతాడు. ఇంద్రసేన్ సరైన కారణాలు చెప్పలేకపోతాడు. నాగలింగం పెట్టిన షరతులు విన్న మురళీకృష్ణ ఆవేశానికి లోనవుతాడు. ఇంద్రసేన్ తన మనుష్యులచేత మురళీకృష్ణను బయటకు గెంటిస్తాడు. అసలు ఇలా జరగటానికి కారణం జీవనే అన్నట్టుగా బామ్మ నిందించగా ఆమె వెళ్లిపోతుండగా బామ్మే జీవనను ఇంటికి తీసుకువస్తుంది. మురళీకృష్ణ, పరమేశ్వరం స్కూల్ స్టాఫ్‌తో కలసి యాజమాన్యంతో ఫైట్ చేయటానికి ప్రయత్నిస్తుంటారు. వీరికి విద్యార్థులు కూడా మద్దతు ప్రకటిస్తారు. పరమేశ్వరంగారు స్కూల్లోకి వెళ్లి ఛార్జి తీసుకుంటారు. పరమేశ్వరంగారిని, ఊళ్లోని మిగతా పెద్దలని తన ఇంటికి ఆహ్వానించి వారితో తాను అభాగ్యుల కళాలయం ఒకటి ప్రారంభించబోతున్నానని దానికై తన ఆస్తిలో నాలుగో భాగం విరాళంగా ఇస్తున్నానని చెపుతాడు ఇంద్రసేన్. మిగతా పెద్దలంతా తమ శక్తికొద్దీ ఇచ్చిన విరాళాల మూటను ఇంద్రసేన్ వద్దంటున్నా వినకుండా దాచమని బలవంతంగా పరమేశ్వరంగారి చేతికిస్తాడు. చీకట్లో ఇంటికి వెళుతున్న పరమేశ్వరంగారిని కొట్టి నాగలింగం విరాళాల మూటను తిరిగి తెచ్చి ఇంద్రసేన్‌కు అప్పగిస్తాడు.

"డబ్బున్న వాడి మాటే అందరూ నమ్ముతారు నాన్నా! మన పెద్ద మనిషి తరహా, అవసరానికి అక్కర రాదు!"

తను చెప్పదలుచుకున్న విషయం మధ్యలో ఆగిపోయి, మాటలు మరో దారి పట్టడం చూసి జీవన కల్పించుకుంటూ అన్నది. "మావయ్యగారూ! నా మాట కూడా వినండి. మీ మీద ఈ అఘాయిత్యం చేసినవాళ్ళ ఎవరో ఎవరో అయివుండరు. ఇంద్రసేన్ మనుష్యులే అని నా అభిప్రాయం."

"నా అభిప్రాయమూ అదే!" మురళీకృష్ణ కూడా వంత పలికాడు.

"ఛా! ఛా! నేన్నమ్మను. అటువంటి అనుమానాలేమీ పెట్టుకోకండి. అతసలో ఎంతో మార్పు వచ్చింది. ఆ సంగతి మీకు తెలీదు. నేనతన్ని చూశాను. అతని మాటలు విన్నాను. అతను స్త్రీలకోసం ఓ సంరక్షణాలయం ప్రారంభించ బోతున్నాడు. అందుగ్గాను తన ఆస్థిలో నాలుగోవంతు రాసి ఇచ్చేస్తున్నాడు. అటువంటి వాడి మనసు ఇంత విషకలుషితంగా వుంటుం దంటే నేన్నమ్మను గాక నమ్మను. మన ఖర్మం చాలక ఆ సమయానికి మన సందులోకి ఎవరో దుర్మార్గుడు వచ్చాడు. వాడి అదృష్టం బావుంది. నేనే వాడికంట బడ్డాను. డబ్బు సంచీ వాడిపాలైంది. దీనికి మీరు రకరకాల వ్యాఖ్యానాలు చేస్తున్నారు."

పరమేశ్వరంతో జీవన, మురళి, వర్ధనమ్మ ఎంతో వాదించబోయారు. కానీ ఆయన వినలేదు. ఇంద్రసేన్‌మీద తనకు సరికొత్తగా ఏర్పడ్డ నమ్మకాన్ని చెదరగొట్టుకోలేదు, పైగా ఇంకా వాళ్ళేదో చెప్పబోతుంటే విసుక్కున్నాడు. "కామెర్ల రోగికి ప్రపంచమంతా పచ్చగానే కనిపిస్తుంది. మీ మనసుల్లో చీకటి వుంది. అందుకనే అవలివాళ్లను నల్లగా ఊహించుకుంటున్నారు. అది తప్పు." అంటూ నీతిబోధ చేశాడు.

మురళీకృష్ణకు తన తండ్రి మౌఢ్యానికి రవంత విసుగు కలిగినా, ఆయన ఉన్నత సంస్కారానికి ఎంతో గౌరవం కూడా కలిగింది.

"పోనీ నాన్నా! ఒక్కపని మాత్రం చేయండి. మీకు దెబ్బతగిలిన సంగతి ఎవరికీ చెప్పొద్దు మనం."

"ఊఁ! చెప్పకపోతే?"

"మిమ్మల్ని ఎవరు పరామర్శించటానికి వస్తారో వాళ్ళకు ఈ సంఘటనతో సంబంధం వున్నట్లు లెక్క!"

"ఎవరికీ తెలియకుండా వుండాలంటే స్కూలుకు సెలవు పెట్టాలి నేను!"

"పెట్టండి!"

అటు తల్లి వొత్తిడీ, ఇటు కొడుకు బలవంతం, మరోవైపు జీవన అభ్యర్థన కలిసి ఆయనచేత స్కూలుకు సెలవు దరఖాస్తు పంపేట్టు చేసినై. తాను అనవసరంగా వూరు వదిలి వెళ్ళవలసి వస్తున్నదనీ, తను వచ్చేవరకూ ఓ వారం రోజులపాటు లెక్కల మాష్టారు గిరీశంగారిని ఇన్‌ఛార్జిగా వుండమనీ వో తాకీదు పంపించాడు.

"అంతేకాదు నాన్నా! మీరు బయటకు రాకూడదు. ఎవరికంటా పడకూడదు. హాయిగా ఇంట్లో లోపల గదుల్లో వుండండి. రెస్టు తీసుకోండి!"

"నాకీ ఖైదు ఏమిటా? వెధవ డబ్బు పోతేపోయింది– సుఖంగా బయట తిరక్కుండా!"

"డబ్బుకోసమే కాదు నాన్నా! మీరు బయట తిరిగితే, ఆ స్కూలుకు వెళ్ళి డ్యూటీ చేసొస్తే, తలక్కట్టుకున్న కట్టు కదులుతుంది. అది మంచిది కాదు. అందుకని!"

"సరేలే!" అంటూ పరమేశ్వరం విధిలేనట్లుగా అంగీకరించాడు.

ఆయనను వాళ్ళు లోపలకు తీసుకువెళ్ళారు. సుభ్రంగా ఓ మంచం వేసి, అందుమీద పరుపు వేసి, చక్కని మెత్తని బూరుగదూది దిండ్లు రెండు అమర్చి పక్క సిద్ధం చేశారు. తలగడ పక్కనే వో స్టూలు వేసి, దానిమీద భారత, భాగవత, రామాయణాలూ, భగవద్గీత, శంకర భాష్యమూ వుంచారు.

"ఈ మంచం దిగవద్దు మీరు!" అన్నది జీవన. "ఏవన్నా అవసరమైతే నన్ను పిలవండి."

బరువుగా, కన్నీళ్ళతో, దుఃఖంతో ప్రారంభమైన ఆ రాత్రి తొలిపొద్దు వెలుగులోకి జారుకుంది. తూరుపు తెలతెలవారుతున్నది. కాకులు కావు కావు మంటున్నాయి. పొలాలకు



జీవన మురళి

పోతున్న పశువుల అంబారావాలు, దూరంగా పరుగెడుతున్న మోటారు వాహనాల చప్పుళ్ళు, మధ్యమధ్యలో వాటి హారన్లు, గాలి కలం బరువుతో తేలివస్తోంది.

జీవన ప్రొద్దున్నే లేచి ఇంటి పనులు పూర్తిచేసి, వర్ధనమ్మకు దేముడి గది పర్ది పెట్టింది. తాను తలంటిపోసుకుంది. కళ్ళకు కాటుక అద్దుకుంది. అమ్మవారి కుంకుమను నొసటన దిద్దుకుంది. క్రిందటి రోజు కొనుక్కున్న కొత్త గాజుల్ని వేసుకుని, అంత వరకూ కట్టకుండా వుంచుకున్న కొత్తచీరను కుచ్చెళ్ళు పోసి అందంగా కట్టుకుని, తలలో వో గులాబీ తురుముకుని, కాలిపట్టాల చిరుగజ్జెలు సన్నసన్నగా సవ్వడి చేస్తుండగా, పళ్ళెంలో కొబ్బరికాయ, తమలపాకులు, పసుపు కుంకుమలు వుంచుకుని మందమందంగా నడుస్తూ పరమేశ్వరం గదిలోకి వచ్చింది.

లక్ష్మీదేవిలా వున్న ఆమె మొహాన్ని చూసి ప్రేమపూర్వకంగా తల పంకించి, "ఏం తల్లీ ?— ప్రొద్దున్నే లేచావ్, నీ పనులు పూర్తిచేసుకున్నావ్, ఎక్కడికో బయలుదేరుతున్నావ్ ?" అన్నాడు.

"దేవాలయానికి మావయ్యాగారూ !" ఆమె పళ్ళెం అవతలపెట్టి, మంచంమీద బారజాపి వున్న ఆయన కాళ్ళకు నమస్కరించింది. "ఆశీర్వదించండి" అన్నది.

"శీఘ్రమేవ వివాహ ప్రాప్తిరస్తు." అన్నాడాయన నవ్వుతూ.

జీవన బుగ్గలు సిగ్గుతో మొగ్గలు తాల్చాయి. ఇవ్వాళ నా పుట్టినరోజండీ !" అన్నది మెల్లగా.

"అట్లాగా, మరి చెప్పావు కాదేం ?" అంటూ "చూడమ్మా ! వంకీన ఆ చొక్కా వుంది. కాస్త తెచ్చిపెట్టు !" అని చొక్కా తెచ్చింతర్వాత చొక్కా జేబులో వున్న పర్సులో నుంచి ఓ యాభై రూపాయల కాయితం తీసి పళ్ళెంలో వుంచి "తీసుకో తల్లీ !" అన్నాడు.

"ఇప్పుడెందుకు మావయ్యగారూ !" అంటూ జీవన కొద్దిగా మొహమాటపడింది,

"సమయానికి ఇంతకన్నా దగ్గర లేకపోయింది. ఏమనుకోకమ్మా !" అని "దేవాలయానికి బయలుదేరావుగా — వెళ్ళిరా ! ఆ మురళీ కృష్ణుడికి సహస్రం చేయించిరామ్మా!" అన్నాడు ఆప్యాయతతో.

"అట్లాగేనండీ !" అని పెద్దగా అని "ఆ మురళీకృష్ణుడేమో గానీయండి, ముందు ఈ మురళీకృష్ణుణ్ణి దర్శనం చేసుకుంటా" అని మనసులో అనుకుని మురళీకృష్ణ గదిలోకి అడుగెట్టింది.

అప్పుడప్పుడే మురళీకృష్ణకు మెళకువ వస్తున్నది. రాత్రి వెలిగించిన అగరవత్తుల పరిమళం ఇంకా గదంతా అలముకునే వుంది. గది

ఉద్యోగుల పార్టీ !

జపానులో టోక్యో సమీపంలో గల కొంతమంది ఉద్యోగులు, వారి బంధువులు కలిసి ఒక కొత్త రాజకీయ పార్టీని స్థాపించనున్నారు. ఈ కొత్త పార్టీ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తుంది. ఓట్సూమా మహిళా విద్యాలయానికి చెందిన ప్రొ॥ షిగరు అవోకని ఈ పార్టీ నాయకుడిగా ఎన్నుకున్నారు. కుటుంబ బడ్జెట్లు అదుపులో ఉండేటట్లు చూడటం ఈ కొత్త పార్టీ లక్ష్యం. పన్నుల మినహాయింపుతో సహా వేరొక పంచసూత్ర ప్రణాళికను రూపొందించారు. రానున్న ఎన్నికలలో వీరు నిలబెట్టే అభ్యర్థులలో ఏడుగురు కంపెనీ ఉద్యోగులు, ఇద్దరు ప్రొఫెసర్లు, ఒక గృహిణి, ఒక మేనేజిమెంటు సలహాదారుడు ఉన్నారు !

మూలన దశావతారాల పటం వెనుక ఓ పిచ్చికల జంట నిద్రపోతున్నది.

అడుగుల చప్పుడు విని మురళీకృష్ణకు మెళకువ వచ్చింది. గజ్జెల చిరుగలగల విని జీవనను గుర్తుపట్టాడు. ప్రొద్దున్నే తన గదిలోకి ఆ అమ్మాయి ఎందుకు వచ్చిందో అతనికి తెలియ లేదు. కళ్ళు తెరిచీ తెరవకుండా తెరిచి కనుకొలకుల నుంచీ ఆమె సుందర విగ్రహాన్ని చూశాడు. పరిపూర్ణమైన యౌవనంలో, మిసమిసలాడుతున్న ఆరోగ్యంతో, ప్రతి అణువు నుంచీ సౌందర్య జ్యోత్స్నను వెదజల్లుతూ ఆమె నడుస్తున్న వెన్నెలలా వుంది. అతనికి మరీ మరీ చూడాలనిపిస్తోంది. ఆమె ఏం చేస్తుందో అన్న ఉత్సుకతతో, తన కోరికను నిగ్రహించుకుని, కళ్ళు తెరిచీ — మూసీ, మూసీ — తెరిచీ ఆమె మీద మనసు వుంచి నిద్ర నటించాడు.

జీవన అతని మంచం దగ్గరగా వచ్చింది. అతని తల దగ్గరకు వచ్చింది. అతని మొహానికి దగ్గరగా తన మొహాన్ని వుంచింది. అతని వేపే అనిమిషంగా కొంతసేపు చూసింది. మెల్లగా అతని ముంగురులు సర్దింది. తర్వాత మళ్ళీ కాళ్ళవైపు నడిచింది. పళ్ళెంలో నుండి ఓ పువ్వు తీసి అతని కాళ్ళపై వుంచింది.

ఝల్లుమంది. అతను సంభ్రమంతో కాళ్ళు రెండూ దగ్గరకు లాక్కున్నాడు.

"అమ్మదొంగా !" అన్నది జీవన రెండడుగులు వెనక్కువేసి. "మేల్కొని వుండీ ...!"

ఆమె మాటను పూర్తి చేయనీయకుండా, అతను మంచంమీద నుండి కిందకు దూకి, జీవనను పట్టుకోబోయాడు, "దూరం, దూరం, నేను మడిగట్టుకున్నాను." అన్నది జీవన మరింత దూరంగా జరుగుతూ.

"ఈ మాలతో సేవ ఏమిటి ?"

"ఇవ్వాళ నా పుట్టిన రోజు. గుడి కెళ్ళొస్తాను. ప్రసాదం తెస్తాను. కృష్ణభగవానులు రెడీగా వుండండి !" ఆమె పళ్ళెం తీసుకుని అక్కడ నుండి పారిపోయింది.

వ్యత్యస్త పాదారవిందంగా, తూర్పు ముఖమై నిలబడిన నీలమేఘశ్యాముని దేవాలయం ఆనందపురానికి సరిగ్గా మధ్యలో వుంది. గుడికి చుట్టూ పెద్దపెద్ద ఎర్రరాళ్ళతో ఎప్పుడో ఇక్ష్వాకులనాడు కట్టిన ఎత్తైన ప్రాకారం వుంది. ప్రాకారం లోపలే సుమారైన పుష్కరిణి వుంది. పుష్కరిణికీ, దేవాలయానికీ మధ్యలో పువ్వుల తోటలున్నాయి, పండ్ల చెట్లున్నాయి, నీడనిచ్చే ముసలి చెట్లున్నాయి, అల్లిమిల్లిగా అల్లుకున్న వాసన తీగలున్నాయి.

జీవన పుష్కరిణిలో కాళ్ళు కడుక్కుని దేవాలయానికి మూడుసార్లు ప్రదక్షిణం చేసిం తర్వాత గర్భగుడిలో దేవుడి ముందు నిలబడింది. ఎంతమంది ఎన్నివందల సంవత్సరాలుగా ఆ నల్లనయ్య ముందు నిలబడి తమ గోడు విన్నవించుకున్నారో, తను ఆర్తిని ప్రస్తావన చేశారో, తమ రక్షణకై చేతులు జోడించారో, తమ శాంతికై కన్నీరు కార్చారో, ఆ భగవంతుడు ఎవరికీ చెప్పడు. పోనీ ఆయన అయినా గుర్తు పెట్టుకున్నాడో, లేదో ఆ కన్నులు తెలపవు, ఆ మురళి రవళించదు, ఆ పాదాలు నర్తించవు. అట్లా అని ఆ గుండెల దొంగ చెప్పడా అంటే చెప్పకుండానూ వుండడు. ఏ అర్ధరాత్రిపూటో, కలల ద్వారాలు తొలగించుకుని దొంగ దొంగగా కన్నుల తలుపుల గుండా గుండెవాకిట నిలబడి మధురామంజులంగా 'నే వచ్చాను, నిన్ను మెచ్చాను' అంటాడు. అభయముద్రలో నిలబడి అద్వైత సిద్ధి కలిగిస్తాడు.

ఇన్ని రకాల భావాలు జీవన మనసులో కలిగాయి మురళీకృష్ణుణ్ని చూడగానే. కళ్ళు మూసుకుని "తండ్రీ ! ఏం చేయదల్చుకున్నావ్ నన్ను ? ఈ అనాఘ్రాత పుష్పాన్ని ఎవరికి అర్పించదల్చుకున్నావ్ ?" అంటూ మూగగా అడిగింది. "కన్నతండ్రే కానివాడు ! మారుటి తల్లే మారుపేరు స్వార్థానికి ! గాలివాలున ఓ దేవాలయంలాంటి ఇంట్లోకి వచ్చాను. ఆ ఇంటి నా స్థానం సుస్థిరం చెయ్యి తండ్రీ ! నాకు ఆశ్రయం ఇచ్చినవారినీ, నన్ను కోరినవారినీ చల్లగా పది కాలాలపాటు కాపాడు తండ్రీ !" ప్రార్థనా వివశమైన హృదయం, సమర్పణా సంకలితమైన కన్నులు, ముకుళించిన లేతచేతులు, ఆమెను చూచిన గుడి పూజారికి ఆనందం కలిగింది.

"ఏమ్మా ! పొద్దున్నే వచ్చావ్, భక్తిగా అర్పించుకుంటున్నావ్, అష్టోత్తరం జరిపించనా ?" అన్నాడు.

"అష్టోత్తరం కాదు, సహస్రం జరిపించండి !"

"అట్లాగేనమ్మా ! పది రూపాయలవుతుంది !"

ఆమె యాభై రూపాయల నోటు పళ్ళెంలో వుంచింది "ఇవిగో, పూలూ, కొబ్బరి కాయలూ... !" పూజారి పూజచేసి, పూలు దైవసన్నిధిన వుంచి, కొబ్బరికాయలు కొట్టే ముందుగా "ఎవరి పేరుమీదనమ్మా ఈ పూజ?" అని అడిగాడు, హారతికి ఏర్పాట్లు పూర్తిచేసుకుంటూ. "గోత్రం చెప్పండి !"

"గోత్రమా ?" జీవన తెల్లబోయింది. తన గోత్రమే తనకు తెలీదు. ఇంక మురళీకృష్ణ గోత్రం తనకేం తెలుసు ? పేర్లు మాత్రం చెప్పి, ఆ పేర్లమీదుగానే పూజ చెయ్యమంది.

పూజారి పువ్వుల్ని దేముడి పాదాలమీద వేస్తూ వెయ్యి పేర్లూ చదివాడు. నివేదన చేస్తూ, హారతి ఇచ్చి పూజ ముగించాడు. కొబ్బరి కాయల్ని జీవనచేత పగలగొట్టించాడు. కొబ్బరి నీటినే తీర్థంలో కల్పి ఇచ్చాడు. ప్రసాదం ఇచ్చిం తర్వాత, "వీలయినప్పుడల్లా వస్తూండండి ! ఈ దేముడి మహాత్మ్యం చాలా గొప్పది. మనసులో అనుకున్నది తప్పక జరుగుతుంది !" అన్నాడు.

ఆమె కాసేపు ఆలయ మంటపంలో కూచుని, ఓ కొబ్బరి ముక్క నోట వేసుకుని లేచి నుంచుంది. ఎదురుగ్గా అల్లంత దూరంలో గులాబీల తోట కన్నుల పండువగా కనిపిస్తున్నది. రంగు రంగుల గులాబీలు, నల్లనివి, తెల్లనివి, ఎర్రనివి, పసుపు పచ్చనివి, సృష్టి వైవిధ్యమంతా ఆ పువ్వుల్లోనే ఉన్నట్టుంది. జీవనకు తెలియకుండానే ఆమె కాళ్ళు ఆ తోటలోకి నడిచాయి. ఆమె ఒక్కొక్క గులాబీనీ పలకరించించింది.

ఎంత చక్కని తోట కనిపించె నేడు
వింత రంగుల హొయలు మురిపించె చూడు

అంటూ పసిబాలికలా, ఆదమరచి పాడుకుంటూ అటూ యిటూ గెంతసాగింది. ఆమె నృత్యం కురంగిలా వుంది. నెమలిలావుంది. కుందేటి అడుగులా వుంది.

ఆమె ఆడి ఆడి గుప్పెడు పూలుకోసుకుంది. గుప్పిట్లోవున్న పూలను వాసన చూసింది. నాలుగు రకాల్ని తలలో తురుముకుంది.

"ఎవురమ్మా నువ్వు ? పూలు కోసినావేటి ? – కొయ్యగూడ్దని తెలీదేటి ?"అన్నాడు అప్పుడే అక్కడికి వచ్చిన తోటమాలి కర్కశ స్వరంతో.

జీవన ఉలిక్కిపడ్డది. "కొయ్యగూడదా ? తెలీదు – నిజంగా తెలీదు !" అన్నది బెరుగ్గా.

"తెలీకపోతే తెలుసుకోవాలి బుల్లెమ్మా – అంతేగాని మనసైంది కదానీ, కన్నుపడింది కదాని, పుటుక్కున పువ్వుల్ని తెంపేడమే ?"


ఆమె తల్లో తురుముకున్న నాలుగు పువ్వుల్నీ తీసేయబోయింది ఆ మాటలువిని.


"వద్దు. వద్దు. తీసేయవద్దు." వెనక నుంచి అన్నాడు ఇంద్రసేన్.

దేవాలయం ముఖద్వారం అవతల నిలబడ్డ తెల్లని గుర్రం వాళ్ళవే కుతూహలంగా చూస్తున్నది.

"పొద్దున్నే హార్స్ రైడింగ్ చేయడం నా కలవాటు. ఇవ్వాళ ఇటుగా వచ్చాను. ఐయామ్ లక్కీ. మీరు కనిపించారు. పెట్టుకోండి ఆ పువ్వుల్ని, కోసుకోండి ఎన్ని కావాలో !"

దొరగారిని చూసిన తోటమాలి గజగజ వణికిపోయాడు. "తప్పైపోనాది. తప్ప





కాయండి దొరా! అమ్మాయిగారు మీ ఇలాకా అనుకోలేదు. ఎవురో అనుకుండా, పూలు కోసు కుంటుంటే కోపం చేసినా!''

''అతని తప్పేంలేదు. అడక్కుండా గుడి తోటలో పూలు కోసుకోవడం నాదే తప్పు!'' అన్నది జీవన, అతన్ని భయపడవద్దన్నట్లుగా.

''ఒకే! మీరంటున్నారు కాబట్టి వాడు తప్పుచేయలేదనే అనుకుంటా. ఈ తోట నాది, ఈ గుడి నాది, అన్నాడు ఇంద్రసేన్ గర్వంగా.

''పొన్లెండి దేవుణ్ని వదిలిపెట్టారు. ఆయన్ని కొల్చుకోవాలనే వచ్చాను.''

''ఆ దేముడూ నా వాడేనండీ! మేమే ఈ దేవాలయానికి వంశ పారంపర్య ధర్మకర్తలం. నిజానికి మీరు పూజలు చేయించింది నా దేముడికే!''

జీవన మూతి విరుస్తూ అన్నది. ''దేముడు మీ వాడేమిటండీ? ఆయన అందరి వాడూనూ, ఒక విధంగా చెప్పాలంటే ఆయన అందరి వాడూ కానే కాడు కూడా! ఎక్కడ ధర్మం వుంటే, ఎక్కడ న్యాయం వుంటే, ఎక్కడ సత్యం వుంటే, ఆ వైపు వాడు!''

ఇంద్రసేన్ చేతమన్న కొరడాను గులాబీ చెట్ల మీద విసిరాడు. అవన్నీ భయంతో పూలను జలజలా రాల్చాయి. ''అతను డబ్బు వైపు వాడు. మీకు తెలీదు!'' అన్నాడు.

ఇద్దరూ కాసేపు మాట మీద మాట అనుకున్నారు. చివరకు ఎవరి నమ్మకం వారిదని

జీవన మురళి

సర్దుకున్నారు. ''కాబట్టే, నా పుట్టినరోజు నాడు, దేవుడికి సహస్రం చేయిద్దామని వచ్చాను!'' అన్నది చివరగా.

''ఐసీ! మీ బర్త్‌డే అన్నమాట ఇవ్వాళ! అయితే కాదనకుండా నేనిచ్చే బహుమతి మీరు తీసుకు తీరాలి! తప్పదు!'' అన్నాడు ఇంద్రసేన్.

''ఎందుకనీ?''

''నా తోటలో పూలు కోసుకున్నారు నన్నడక్కుండా; మరి నేనిచ్చే బహుమతిని తీసుకోటానికి మీకేవిటి అభ్యంతరం?''

ఆమెకు ఒక్కసారి అతను తనను బట్టల షాపులో కలుసుకోవడం, తను మోజుపడ్డ చీరను ఆఫర్ చేయడం జ్ఞాపకం వచ్చింది. నెమలి కంఠం రంగు చీర! తాను కాదనడం కూడా జ్ఞాపకం వచ్చింది. మురళీకృష్ణ తనను మెచ్చుకోవడం జ్ఞాపకం వచ్చింది. ఆమె పెదిమలపై ఒక దరహాస రేఖ మెదిలింది. దానిని అంగీకారంగా తీసుకుని ఇంద్రసేన్ తన కుడిచేతి వ్రేలికి వున్న వజ్రపుటుంగరాన్ని తీసి ఆమె కందించబోయాడు. ''ఇటువంటి పుట్టినరోజులు మరెన్నో మీరు జరుపుకోవాలని మనసారా కోరుకుంటున్నాను!''

ఆమెకు పరమేశ్వరం పొందిన అవమానం కళ్లలో మెదిలింది. మురళీకృష్ణకు జరిగిన అవమానం కళ్లముందు మెదిలింది.

''క్షమించండి. తీసుకోలేను!''

''పువ్వులు తీసుకున్నవాళ్ళు, ఉంగరం తీసుకోలేరా? పువ్వులేం పుణ్యం చేసుకున్నాయ్, ఉంగరమేంపాపం చేసిందీ?'' ఇంద్రసేన్ నవ్వుతున్నాడు. అతని నవ్వు చూస్తే జీవనకు ఒళ్లంతా కంపరం ఎత్తుతోంది.

''తీసుకోండి బుల్లెమ్మగారూ! మా దొర గారికి ఇట్టవ్‌ కారెవరూ, అయినవోళ్లకు అడ్డమే వుండదు!'' తోటమాలి అన్నాడు.

జీవనకు ఆ ఉంగరం తీసుకోవాలనిపించ లేదు. ఇంద్రసేన్ చొరవగా ఆమె చెయ్యి అందుకుని, ఎడమవేలికి ఆ ఉంగరం తొడిగాడు. తొడుగుతూ అన్నాడు –

''దయచేసి కాదనకండి. మిమ్మల్ని చూసిన మొదటి క్షణంలోనే మీమీద నాకెంతో సదభిప్రాయం కలిగింది. ఆ సదభిప్రాయానికీ, మీమీద నాకు గల అభిమానానికీ గుర్తుగా ఈ ఉంగరాన్ని మీ పుట్టినరోజునాడు ఇచ్చే అదృష్టం కలిగింది. తీసుకోరూ? ... ప్లీజ్!''

ఆమె ఎడమచేతి ఉంగరం వ్రేలికి ఆ వజ్రం తెల్లగా మెరుస్తోంది.

ఇంద్రసేన్ అంటున్నాడు. అతని కంఠంలో కొద్దిగా గాద్గద్యం వచ్చింది. ''నా మీద ఇంతటి అయిష్టత మీకు ఎందుకు ఏర్పడిందో నాకు అర్థం కావడం లేదు. మీకో చీరను ప్రెజెంట్ ఇవ్వాలనుకున్నాను. తప్పా? హెడ్‌మాష్టరుగారికి పోయిన ఉద్యోగం తిరిగి ఇచ్చాను. తప్పా? స్త్రీ

సంరక్షణాలయం స్థాపించాలనుకొన్నాను. తప్పా?''

''మురళిగారిని అవమానించి పంపించడం తప్పుకాదా ?''

''ఎవరన్నా మీ ఇంటికి వచ్చి, ఆతిథ్యం అందుకుని, మిమ్మల్ని అవమానిస్తే మీకు ఎట్లా వుంటుంది. మురళిగారు మా ఇంటికి వచ్చి మమ్మల్ని అవమానించాడు. తాను అవమానం పాలయ్యాడు.''

''అవునవును ! ఇంటికి వచ్చిన మనిషికి డబ్బునంచీ ఇచ్చినట్లే ఇచ్చి, మళ్ళీ తల పగల గొట్టించడం కూడా మీ మర్యాదే ?'' జీవన నోరు జారింది, కోపంలో, ఆవేశంలో.

''ఎవరి సంగతి మీరంటున్నది ? కొంపతీసి హెడ్మాష్టరు పరమేశంగారి సంగతి కాదుగదా? ఆయన సెలవు పెట్టారని విన్నాను. ఏ వూరో వెళ్లారని విన్నాను. అది నిజం కాదా ?''

జీవన తన మాటను సర్దుకోడానికి నానా తంటాలూ పడవలసివచ్చింది ''అబ్బెబ్బే! ఆయన సంగతి కాదు. అట్లా చెయ్యటానికి కూడా మీరు వెనుకాడరని !''

''జీవనగారూ !''

జీవన ఉలిక్కిపడింది. ''నా పేరు మీకు తెలుసా ?''

''తెలుసు. ఇష్టమైన వ్యక్తుల వివరాలు తెలుసుకోవడం కష్టం కాదు గదా ? మీరు చుట్టపు చూపుగా మాష్టారి ఇంటికి రాలేదు. కావాలనే వొచ్చారు. మీరు ఈ వూరికి విజిటర్ కాదు, ఇక్కడే వుండిపోతున్నారు. ఎక్కణ్నుండో ఈ వూరికి లేచొచ్చారు, అదే తరలి వచ్చారు. నేను రైట్ కదూ ?''

జీవనకు అతన్ని చూస్తే భయం వేయ సాగింది. నిస్పందేహంగా అతను కాలాంతకుడు. గుట్టుమట్లు లాగగలిగినవాడు. గుట్టు చప్పుడు కాకుండా అక్కడి నుండి తప్పుకుంటే బావుంటుందనిపించింది. ఆ ఉంగరం తీసి మొరటుగా అతని మొహాన విసిరికొడితే మరింకేం చేస్తాడో, ఇంకేం మాట్లాడతాడో అనిపించింది.

''నేను వొస్తాను. నాకు టైమయింది !'' అంటూ అవతలకు నడవబోయింది.

''మరో చిన్న రిక్వెస్ట్ ! వచ్చే ఆదివారం నాడు నా బర్త్‌డే ! మీ ఇంటికివచ్చి మాష్టార్నీ, మురళిగార్నీకూడా ఆహ్వానిస్తాను. మీకు ఇక్కడే ఆహ్వానం అందజేస్తున్నాను. మీరు తప్పకుండా రావాలి. వస్తారుకదూ ?''

''వస్తాను!'' ఆమె పరుగెత్తుతున్నట్లుగా ఆ తోటలోనుంచి, ఆ దేముడి గుళ్ళోంచి, రోడ్డు మీదకు వచ్చింది. కొంతదూరం వెళ్లి వెనక్కు తిరిగి చూస్తే, తెల్లగుర్రం మీద కూచున్న ఇంద్రసేన్, కళ్ళెం చేతబుచ్చుకుని తనవేపే దృష్టి సారించినట్లు జీవనకు కనిపించింది. అతని చూపులు వెనగ్గావచ్చి ఆమెను గుచ్చు తుంటున్నాయ్. ఆమె తన ఇంటిదాకా ఎట్లా నడిచిందో ఆమెకే తెలీదు. గుమ్మం దగ్గరే ఆమెకు మురళీకృష్ణ ఎదురయ్యాడు.

మొహమంతా చిరుచెమటలతో, కళ్ళలో బెదురుతో, ఎగసిపడుతున్న ఎత్తైన వక్షస్థలంతో, రేగిన తలవెంట్రుకలతో, ఆందోళన స్వరూపంగా తన ముందు నిలబడ్డ జీవననుచూసి కంగారుపడి, ఆమె చేతిలోని పళ్ళెంని అందుకుంటూ ''ఏమిటింత ఆలస్యం చేశావ్ ? నేనే వద్దామనుకుంటున్నాను, ఆ రూపం ఏవిటీ ?— ఆ చెమట ఏవిటీ ? ఆ ఆయాసపడడమేవిటీ ? దేముడి గుడికి వెళ్ళొచ్చేతీరేనా ఇది ? సరే, ప్రసాదం ఏదీ ?'' అన్నాడు కొంటెతనమూ, ఆప్యాయతా రంగరించి.

''అక్కడ... అక్కడ... ఇంద్రసేన్ కని పించాడు !'' జీవన అన్నది.

''ఊఁ ! కనిపించి ?''

''బలవంతంగా ఈ ఉంగరం నా వ్రేలికి తొడిగాడు !''

మురళీకృష్ణ ఆ వజ్రపుటుంగరాన్ని చూశాడు. ఉదయపు ఎండలో ధగధగ మెరిసి పోతోంది. ''ఎందుకూ ?''

''నా పుట్టిన రోజు ప్రెజెంటుట !

గుమ్మం దగ్గర మాటలు పెంచడం ఇష్టంలేక మురళీకృష్ణ, జీవనతోకలసి లోపలకు వచ్చాడు. అతని మనసంతా భగభగమండుతోంది.

''అమ్మాయ్ జీవనా ! కాస్త శివకవచం చదివి పోదువుకాని, రా తల్లీ !'' లోపలి నుండి వర్ధనమ్మ పిలుస్తోంది. జీవన వెళ్ళబోయింది.

''ఆ వుంగరం అవతల పారేసి వెళ్ళు !'' మురళీకృష్ణ కఠినంగా అన్నాడు.

జీవన ఇంకా తటపటాయిస్తోంది. చొరవగా తనే తీయబోయాడు. జీవన చెయ్యి వెనక్కు తీసుకుంది.

''ఏం ఇష్టంలేదా ? ఆ ఉంగరాన్ని అవతల పారెయ్యడం ఇష్టంలేదా ?'' మురళీకృష్ణ ఆమె కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అన్నాడు. ఉంగరం వేలికి తొడగడం అంటే అర్థం తెలుసా? ప్రదానం అన్నమాట !! నిన్ను చేసుకోవాలన్న ఉబలాటం అన్నమాట !!''

''తెలుసు !''

''తెల్సీ, ఆ ఉంగరం ఎందుకు వ్రేలికి తొడిగించుకున్నావ్ ?''

''నా గురించిన సంగతులెన్నో ఇంద్రసేన్‌కు తెలుసుగనుక— భయపడ్డాను.''

మురళీకృష్ణ ఆమె చేతనున్న పళ్ళాన్ని అవతల పెట్టాడు. ఆమె బుజాలమీద చేతులు వేశాడు. ''నేనున్నాను. భయంలేదు!'' అన్నాడు. ''ఈ ఇంట్లో పూచిక పుల్ల కూడా వాడికి భయపడదు.''

''వచ్చే ఆదివారం నాడు అతని పుట్టిన రోజట. మనందర్నీ పిలుస్తాట్ట ! గుళ్ళో తోటలో నాతో అన్నాడు.'' ఇంకా ఆమె గొంతులో వణుకు తగ్గలేదు.

''డోన్ట్ వర్రీ ! పిలవనీ ! ఆ పార్టీకి వెళ్దాం తప్పకుండా మనం ! అక్కడ ఉంగరాన్ని నలుగురిముందూ అతని మొహాన కొడుతున్నావ్, సరేనా ? అంతవరకూ ఈ ఉంగరాన్ని తీసి భద్రంగా అవతల పెట్టు.''


ఆమె అతను చెప్పినట్లే చేసింది. వర్ధనమ్మతో కలిసి మెలమెల్లగా ఒక్కటొక్కటే ఇంటి పనులు చేసుకుపోతున్నకొద్దీ, ఆమెకు ప్రొద్దుటి అనుభవం వెనుకకు తగ్గింది. కాఫీల వేళకు మామూలు మనిషి అయింది. మళ్ళీ నవ్వుతూ, తుళ్ళుతూ తిరగసాగింది.

''బామ్మా! ఇవ్వాళ మనింట్లో ఈ పాపాయి పుట్టింది. బారసాల చేయవూ ?'' అన్నాడు మురళీకృష్ణ. ''ఉయ్యాల తెప్పించనా కాసేపు ఊపుదాం !''

''ఉయ్యాల కాదురా; క్యాండిల్స్, కేకూ తెప్పించు. హాపీ బర్త్‌డే టూ యూ అంటూ పాట పాడదాం !'' అంటూ లోపలగదిలో నుంచి పరమేశ్వరం కేకలేశాడు.

''కేకుల సంగతి తరువాత, ఆకలేస్తోంది. ముందు భోజనాలకు లేవండి!'' అంటూ వాళ్లను వంట ఇంట్లోకి నడిపించింది జీవన.

(ఇంకా వుంది)





డాక్టర్ సలహాలు

డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

ఎస్. జి. ఆర్. – కణితి

మా తమ్ముని వయస్సు 12 సంవత్సరములు. చిన్నతనములో ఫిట్సు వచ్చేవి. మధ్యలో కొన్ని రోజులు తగ్గినది. మరలా ఇప్పుడు తరచు వస్తున్నది. ఏ మందు వాడినా ప్రయోజనము కన్పించలేదు. ఎక్కువగా ఆయాసము వచ్చినా, బాగా పైత్యము చేసినా ఈ ఫిట్సు వస్తున్నాయి. ఫిట్సు వచ్చిన వెంటనే డాక్టరు దగ్గరకు తీసుకొని వెడితే మత్తు ఇంజక్షన్ ఇస్తున్నారు. ఇప్పుడు వాంతులు గూడా అవుతున్నాయి. పైత్యం పెరగగానే ఫిట్సు వచ్చే అవకాశం వున్నదా ? అసలు ఇవి తగ్గే అవకాశం వున్నదా ?

★ మీరు మీ తమ్ముని నిపుణులైన న్యూరాలజిస్టులకి చూపించవలసి ఉంటుంది. మెదడులో "ట్యూమర్" పెరగటంవల్ల ఇలా జరిగే అవకాశం ఉంటుంది. ఈ రోగం ఉన్నదీ లేనిదీ వైద్యులు కొన్ని ప్రత్యేక పరీక్షలు చేసి నిర్ణయిస్తారు.

పి. హెచ్. ఎన్. ఆర్ – సత్తెనపల్లి

వంశపారంపర్యంగా వచ్చే మెల్లకన్ను, పిల్లికళ్ళు, రాగి జుట్టు మొదలగు వాటినుండి విముక్తి పొందుటకు వైద్యరీత్యా ఏమైనా పదుపాయములు కలవా ?

★ మేరేజ్ కౌన్సెలింగ్, జెనెటిక్ కౌన్సెలింగ్‌ల ద్వారా తమ జీవిత భాగస్వాములను ఎన్నుకోవటంవల్ల ఈ లక్షణాలనుంచి విముక్తి పొందే అవకాశం ఉంది.

కె.కె.ఎం. – సికింద్రాబాద్

నాకు 23 సం॥లు. పొత్తి కడుపు ఎడమ వైపున నెప్పిగా ఉంటుంది. నాలిక రోజు కి మూడుసార్లు క్లీన్ చేసుకోవలసి ఉంటుంది. ఇది ఏమైనా ఇన్‌ఫెక్షనా ?

★ మల పరీక్ష మూలంగా అమీబియాసిస్ ఉన్నదీ లేనిదీ తీర్మానించుకోవలసి ఉంటుంది. ఆహారంలో పులుపు, కారం తగ్గించి నిర్ణీత టైము ప్రకారం ఆహారాన్ని తీసుకోవలసి ఉంటుంది. చిరుతిళ్ళు మానటం మంచిది.

ఎమ్. కె.ఎమ్.జి. – రాజమండ్రి

నాకు 'పేరాఫైమోసిస్' వున్నది. ఇది ఎలా ఏర్పడుతుంది ? దీనివలన కలిగే నష్టాలేమిటి ? నేను వివాహమునకు అర్హుడనా ? దీనికి నివారణ ఏమిటి ? మానసికంగా చాలా బాధ పడుతున్నాను.

★ పురుషాంగంమీద ఉన్న తోలు వెనక్కి వెళ్ళి, బిగుసుకుపోయి, యధాస్థానానికి రావటానికి వీలులేక వాచిపోవటాన్ని పేరాఫైమోసిస్ అని అంటారు. దీనికి సున్తీ చేయించుకోవటం శ్రేష్టమైన చికిత్స. వివాహానికి తప్పక అర్హులే!

పి. ఎస్. ఆర్. – తుమ్మపాలెం

టి. బి. పూర్తిగా తగ్గుతుందా ? తగ్గాలంటే ఏమి జాగ్రత్తలు తీసుకోవాలి ?

★ క్రమబద్ధంగా 18 నెలలపాటు వైద్యులు నిర్ణయించిన మందులను క్రమం తప్పకుండా తీసుకోవటంవల్ల పూర్తిగా తగ్గిపోతుంది. స్ట్రెప్టోమైసిన్, ఐ. ఎన్. హెచ్, పి. ఎ. ఎస్; థై అసిటజోన్ అనే మందులలో ఏ రెండింటినైనా వాడటం అవసరం.

ఆరు నెలల కొకసారి పరీక్ష చేయించుకోవటం, కుటుంబంలోని సభ్యులను పరీక్షింపచేయటం, క్రమబద్ధంగా ఆహారం తీసుకోవటం మాత్రమే తీసుకోతగిన జాగ్రత్తలు.

యన్. వి. పి. – వీరవల్లి

ఇన్‌ఫీరియారిటి కాంప్లెక్స్ అంటే ఏమిటి? ఇది ఎలా వస్తుంది ? దీనికి నివారణ ఏమిటి ?

★ ఎదుటివారు గొప్పవారనీ, తాము అన్నివిధాలా వారిముందు తీసికట్టనీ ఆత్మన్యూనత చేసుకోవటమే ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ అని అంటారు. మానసిక ఆందోళన, వ్యక్తిగత అలవాట్లు, శరీర నిర్మాణం దీనికి ముఖ్యకారణాలవుతాయి. ఎదుటివారి వాక్చాతుర్యం కూడా ఒక కారణం అవుతుంది.

సైకియాట్రిస్టు సలహా పొందటం, వాతావరణ మార్పులు, మంచి స్నేహితుల ఎంపిక మొదలయినవాటివల్ల ఫలితం ఉంటుంది. ★

వనితలకు మనవి

కొత్తరకం వంటలు
క్లుప్తంగా రాసి పంపితే
త్వరగా పరిశీలించ వీలవుతుంది. —సం.



ఇనుప తెరలు

పాలడుగు వెంకటేశ్వర

కొల్లి వీర వెంకట సత్యశివ సుందర రామా రావుది భారీ విగ్రహం. అతని ఆస్తి పాస్తులూ, ఆ చుట్టు ప్రక్కల వూళ్లల్లో అతనికిగల పలుకుబడీ, పరపతీ కూడా సామాన్య మయినవి కావు; అతను ఎమ్మెల్యేగా పోటీచేసి రెండుసార్లు గెలిచాడు. మూడోసారి వోడి పోయాడు. అయితే సహకార బ్యాంకులోనూ, పంచాయితీ సమితిలోనూ కొన్ని—సంవత్సరాలుగా — కొన్ని పదుల సంవత్సరాల నుండీ — అతను నిర్వహిస్తూ వచ్చిన పదవులకి ఏ నాడూ ఢోకా లేకుండా వుండింది. అతని మాటా, నడవడీ గంభీరంగా వుంటాయి. అతని నిజాయితీ, స్వార్థ రాహిత్యమూ, మాట కోసం ప్రాణం ఇవ్వటాని కయినా సిద్ధపడే అతని తత్వమూ, స్నేహం కోసం ఏమయినా త్యాగం చేయగల సాహస ప్రవృత్తీ అతన్ని ఆ ప్రాంతంలో పెద్దమనిషిగా, ప్రజల మనిషిగా, ప్రజానాయకుడిగా నిలిపి వుంచాయి. అతనికి విద్యాలయాలన్నా, భావి భారత పౌరుల్ని తీర్చిదిద్దే వుపాధ్యాయులన్నా, రెప రెప లాడే పైరుల్తో, కళకళలాడే తోపుల్తో, వాగుల్తో, డొంకల్తో, పచ్చ పచ్చగా వుండే పల్లె పట్టులన్నా, ఆ పట్టుల వుండే జనాలన్నా భక్తి, గౌరవం, ప్రాణసమానం. అందుకే — నిస్సంతు అయిన రామారావు, చేతికి ఎముక లేకుండా దానధర్మాలు చేస్తాడు. ఆ రోజు వానపాముల హైస్కూలు హెడ్మాస్టరు సుబ్రమణ్యంగారు పని గట్టుకుని వచ్చి, స్కూలు వార్షికోత్సవానికి వచ్చి, పిల్లల్ని ఆశీర్వదించి, బహుమతీ ప్రదానం చేయమన్నప్పుడు రామారావు ఎంతో సంతోషంగా ఆ ఆహ్వానాన్ని అంగీకరించాడు. వార్షికోత్సవ సభ ముగిసాక, బహుమతి ప్రదానోత్సవమప్పుడు, బుల్లినిక్కరూ, పొట్టిచేతుల చొక్కా వేసుకుని పరీక్షల్లోనూ, అన్ని ఆటపాటల్లోనూ ప్రథము డుగా వచ్చి బహుమతులు అందుకుంటూ వున్న, ఒక కుర్రాడ్ని చూసి రామారావుకి ముచ్చట వేసింది. ఎర్రగా బొద్దుగా బూరి బుగ్గల్తో ముద్దుగా వున్న ఆ కుర్రాడ్ని చూసి అతనిలో వాత్సల్యం పెల్లుబికింది. వాడికి గొప్ప భవిష్యత్తు వుందనిపించింది.

ప్రక్కనే కూర్చుని వున్న సుబ్రమణ్యంగార్ని అడిగాడు, రామారావు ఆప్యాయంగా.

'ఎవరి కుర్రాడండీ, ఈ అబ్బాయి ?'

'ఈ వూరేలెండి. చాకులాంటి కుర్రాడు ! అన్నిట్లోనూ ఫస్టే !'

'అవునవును.' తల వూపాడు రామారావు.

ఆ తర్వాత ఏదో మాటల సందర్భంలో ఆ విషయం మరుగయింది. రామారావు ఇంటి పట్టున వుండే వేళలు చాలా తక్కువ. ఎప్పుడూ ఏదో వ్యవహారాల గురించి బందరో, బెజవాడో, హైదరాబాదో తిరుగుతూ వుంటాడు. అతని వ్యవసాయపు పన్లను అన్నింట్నీ అతని బావమరిది చూసుకుంటూ వుండటంతో, ఆ విషయంలో అతనికి చింత లేకుండా వుండింది.

గంభీరంగా అవుపించే సాగర గర్భంలో నిరంతరం సుడిగుండాలు ఏర్పడుతూ వుండే అవకాశాలూ వున్నాయి. రామారావు జీవితంలో ఎప్పుడూ ఏ విషయంలోనూ ఒడిదుడుకులు లేవుగాని, ఒక్క రామనాథం విషయంలోనే అతను ఎదురు దెబ్బ తిన్నాడు.

ఆనాడు, సున్నితంగా, షోకుగా పెళ్లిపీటల మీద కూర్చున్న రామనాథం, పెళ్లికూతురు సీత వంక దొంగ చూపులు చూడటం గమనించి, ఒక దశాబ్దం క్రిందట, చిరునవ్వులు నవ్వుకుని, పచ్చగా వ్రేలాడుతున్న మామిడి తోరణాల్ని, చూపుల్తో పలకరించి మేలమాడిన రామారావు— ఆ తర్వాత ఆ దంపతుల సంసారంలో చెలరేగే పెనుతుపానులు, తనను కూడా వూపివేస్తాయని వూహించలేదు.

కుందనపు బొమ్మలాగా, ఎన్నో మధురోహ లతో, పచ్చ పచ్చని జీవితాన్ని వూహించుకుని కాపురానికి వెళ్లిన సీత ఆర్నెల్ల తర్వాత పండక్కని పుట్టిల్లు చేరగా, ఎముకలు పొడుచుకుని వచ్చిన సీత అవతారాన్ని చూసి, పుట్టింట్లో అందరూ గోల పెట్టారు.

'ఏవిఃటే ? ఏమిటిలా అయిపోయావ్ ? అయ్యో ?!'

'అసలేం జరిగిందే, నా తల్లీ ?'

'ఆ కళ్ళేమిటే ? కళ దప్పి అలా లోతుకు పోయాయీ ?!' — అంటూ శరపరంగా గుప్పించిన ప్రశ్నలకి జీవంలేని హాసమే సమాధాన

ఇనుప తెరలు

మయ్యింది గాని, పెదవిని దాటి మాట బయటికి రాలేదుగాని, వంట్లో బాగాలేదని సీత మంచం ఎక్కగా, డాక్టర్ని తీసుకొచ్చి చూపిస్తే, ఆయన పరీక్షలు చేసి, సుఖవ్యాధి అని చెప్పి, మందులు ఇచ్చాడు. ఆ సంగతి రహస్యంగా రామారావుకి మాత్రమే చెప్పాడు.

అది రామారావు గుండెలమీద పడిన మొదటి సమ్మెట దెబ్బ.

రెణ్నెల్లు వుంచుకుని, కూతురి జబ్బులు నయంచేయించి, పెళ్ళాన్ని తీసుకెళ్ళటానికని, రామనాథంరాగా, మళ్ళీ సీతని అత్తారింటికి పంపించేటప్పుడు రామారావుని ప్రక్కకి పిలిచి గొల్లుమని ఏడ్చింది ముసలావిడ. ఈ రెండ్నెల్లలో కూతురు గురించి దిగులుతో ఆమె చిక్కి సగ మయింది.

'బావా ! సీత మాకు ఒక్కగా నొక్క ఆడపడుచు. అమ్మాయిని అల్లారు ముద్దుగా పెంచుకుని —నీకు వప్పగించాము. జాగ్రత్తగా చూసుకో.' అని రామారావు హితవు చెప్పగా, రామనాథం భ్రుకుటి ముడివేసి, గంభీరంగా సీత వంక చూసేడు.

ఒక సంవత్సరం తిరిగి — ముసలావిడ ఆ దిగుల్తోనే పోయింది —

కడుపయి, పుట్టింటికివచ్చి, పిల్లాడి తల్లి అయ్యేసరికి, సీత రూపు పూర్తిగా మారి పోయింది. ఏడాదికే వసంతం పారిపోయి గ్రీష్మం కాపురం పెట్టింది సీత జీవితంలో.

ఆ తర్వాత - కష్టాల పరంపరలు సీత జీవితాన్ని చుట్టుముట్టాయని, వాళ్ళూ వీళ్ళూ తెలిసినవాళ్ళూ, పరిచయస్తులూ చేప్పినా,నమ్మని రామారావు, విశ్వాసం వదులుకోని రామారావు...

ఆ పాతికెకరాలు సుక్షేత్రమయిన మాగాణీ, యాభయి ఎకరాల మెరకపొలమూ, విస్తారమైన తోటలూ, తోపులూ, మిద్దెలూ, మేడలూ, ఒకటొకటిగా, రామనాథం దుర్వ్యసనాలకోసం కరిగి హారతి కర్పూరం అయిపోయి, జబ్బులూ, అనారోగ్యమూ, వ్యసనాలూ మిగుల్చుకుని వూరి బయట పూరిపాకలోకి, రామనాథం సంసారం మార్చేసరికి —

ఇన్నాళ్ళూ తను వినిన విషయాన్ని నమ్మ నందుకూ, చేతులు పూర్తిగా కాలకముందే ఏదో ఒక జాగ్రత్త పడనందుకూ తననితాను తిట్టు కున్నాడు, రామారావు.

అంత జరిగినా రామానాథానికి ఇంకా బుద్ధి రాలేదేమనే రామారావు ఆశ్చర్యపడ్డాడు. బాధ పడ్డాడు. కుమిలిపోయాడు. క్రుంగిపోయాడు.

వళ్ళు, జబ్బులతో పుచ్చిపోయినా,కుటుంబం ఆర్థికంగా క్రుంగిపోయినా, పరువు ప్రతిష్ఠలు బజార్లో మంట గలిసిపోయినా, రామనాథం ఇంకా మారనందుకు దుగ్ధపడ్డాడు. రామారావు : గిజగిజలాడి పోయాడు.

అతనికి నయానా భయానా పెద్ద మనుషులన్న నలుగురితోనూ చెప్పించాడు. అయిందేదో అయింది – ఇకనయినా, బుద్ధిగా ఇంటిపట్టున వుండి, పెళ్ళాం పిల్లల్ని ప్రేమగా చూసుకోవలసిందని, మంచిని మప్పించాలని ప్రయత్నించాడు. చివరికి నోరు విడిచి, పనిగట్టుకుని వాళ్ళింటికివెళ్ళి, తనూ చెప్పి,వప్పించబోయాడు, రామనాధాన్ని.

కాని –

రామారావు ప్రయత్నాలన్నీ బూడిదలో పోసిన పన్నీరే అయింది. .

ఒకసారి ఆ వూర్నించి ఒక పెద్దమనిషి వచ్చి – లబలబలాడి – బాధపడి –

'రామారావుగారూ ! మీరయినా ఆ సీతమ్మని రక్షించలేరా ?' అని పనిగట్టుకుని అడిగాడు.

'ఏమయిందండీ ?' ఆదుర్దాగా అడిగాడు రామారావు, బాధగా తలవంచుకుని.

'ఏం చెప్పమంటారు బాబూ ! ఆ రాక్షసుడు రోజూ తాగివచ్చి, సీతమ్మతల్లిని కొడుతున్నాడు. ఆ తల్లి నోరు విప్పి ఎవరికీ చెప్పకోదుగానీ, ఆమె వంట్లో విరగని ఎముకే లేదు. ఎప్పుడూ లేంది, ఈ మధ్యన బజారు ముండల్నితెచ్చి, ఇంట్లో పెట్టి 'ఆ తల్లి'ని నానా హింసలూబెడ్తూ, ఆమె చేతనే వాళ్ళకి, నానా వూడిగాలూ చేయిస్తున్నట్లు మా వూళ్లో చెప్పకుంటున్నారు. ఇదేంటయ్యా అని ఎవరో వూరుకోలేనివాళ్ళు అడగ్గా – నా ఇష్టం, మీరెవ్వర్రా నాకు చెప్పటానికి – అని వాళ్ళని బూతులు తిట్టాడు. ఇట్లాగే ఎన్నాళ్ళోసాగదు బాబూ ! వాడు ఆ తల్లిని 'చంపేస్తాడు.' అని గోలబెట్టాడు. బాధపడి కన్నీరు పెట్టాడు.

'అయితే,ఏం చెయ్యాలంటారు?'మనసులో మధనపడిపోతూ, రామారావు అడిగాడు. అతని గుండె చెరువయింది. 'ఏం చెయ్యాలని అలాగ అడుగుతారేమిటండీ బాబు! మీరువచ్చి ఆ తల్లినీ పిల్లడినీ తీసుకొచ్చేయండి, బాబూ. సీతమ్మ దిక్కులేన్దయిపోయింది. కన్నవారుగూడా ఆమెను వదిలేసారా ? అని నలుగురూ అనుకుంటూ వున్నారు. ఆ మాటలు వినలేకనే నేను ఇట్లా మీ దగ్గరకి పరుగెత్తుకు వచ్చాను.' అని సెలవు తీసుకుని ఆ పెద్దమనిషి వెళ్ళిపోయాడు.

ఈ ప్రపంచంలో కొన్ని కొన్ని బ్రతుకులు శాపగ్రస్తమై, భయంకరమైన మంటల్లో, ఎందుకు చిక్కుకుంటాయో కారణాలు అంతుబట్టవు. పీడనకీ, వేదనకీ, హింసకీ, దవుర్జన్యానికీ, కొన్ని ఆడబ్రతుకులు గురవటానికి – ఈ వ్యవస్థలో వుండిన ఒక ప్రబలమయిన లొసుగే కారణం అన్పించుతుంది. ఉన్మాదులూ, వ్యసన లోలురూ, దవుర్జన్య విషయాసక్తులూ–అయిన కొందరు 'మగ జంతువులు,' కొన్ని శతాబ్దాల నుంచీ కూడా, అలా నిర్విఘ్నంగానే ఆడదానికి అన్యాయం చేయటానికి కారణం, ఈ పద్ధతులు, వార్ని వివాహానికి అనర్హులుగా ప్రకటించి అవసరమయిన నిషేధాల్ని అమలు జరపకపోవటమే నన్పిస్తుంది. ''ఏ చోట స్త్రీ కన్నీరొలికి నేలమీద పడుతుందో, అచ్చట అశుభం, అనర్థం, దరిద్రం, క్షామం గజ్జలు కట్టుకుని నాట్యం చేస్తాయ''న్న నానుడి ఆ కారణంగానే వచ్చి వుండాలి.

రామనాధం ఇలా ఎందుకయి పోయాడు?

సీత బ్రతుకు అలాగ ఎందుకయిందీ ? అందులో ఆమె నేర మేమిటి ?

అయ్యో ! అని జాలిపడతారు, మనసున్న వాళ్ళు.

కర్మ – అని చిటికె వేసి తేల్చి పారేస్తారు కర్మ సిద్ధాంత వాదులు. ఎందుకంటే – ఆ రామనాధంగాడికి బుద్ధిలేకనే, డొక్కచించి డోలు కట్టేవాడు లేకనే, వాడు అలాగ కల్లు దాగిన కోతిలాగా పిచ్చివేషాలు వేస్తున్నాడంటారు – ఇంకొందరు.

ఒక వారం రోజులపాటు మధనపడి, రక్త సంబంధం, బంధాలువేసి లాగగా, లాగగా, ఏదో ఒకటి చెయ్యాలని నిశ్చయించుకుని – ఒక రోజు మలిసంజె వేళ రామారావు ఆ వూరికి, ఆ ఇంటికి వెళ్ళేసరికి —

అసహ్యంగా, దరిద్రంగా, ఒంటరిగా వూరి వెలుపల వున్నా ఆ పాకలో – జారిపోయిన మలక మంచంమీద ఒక బజారు మనిషి కూర్చుని, ఇకిలిస్తూ వినోదిస్తూ వుండగా —

తాగి ఎర్రనయిన కళ్ళతో, రేగిన దుబ్బు జుత్తుతో, మాసిన బట్టలతో, అసహ్యంగా, దరిద్రంగా భయంకరంగా, రాక్షసుడిలాగా చెలరేగిన, రామనాథం చేతుల్లో చావు దెబ్బలు తింటూ, ఆ బాధకి మెలిదిరిగిపోతూ, యమయాతన పడిపోతూ, వుంది సీత !

అది చూసి, రామారావు మొహం కన్నీటితో తడిసిపోయింది. అతని మనస్సులో సముద్రాలు వుప్పొంగాయి. అతని గుండెలు బాధతో మెలిదిరిగి పోయాయి.

'సీతా !' ఆర్ద్రంగా, గాద్గదికంగా, శోకమూర్తి వలె పిలిచాడు రామారావు.

ఆ పిలుపుకి, ఆ బజారు మనిషి కంగారుగా లేచి నిల్చుంది. సీతని వదిలివేసి కణకణమండే కళ్ళతో, రామారావుని కాల్చేసేలా చూసాడు రామనాధం. తడబడుతూ వున్న మాటలతో, 'ఎవడ్రా నువ్వు ?' అని అడిగాడు, ఆ వచ్చిందెవరో పోల్చుకోలేక.

'ఎందుకు వచ్చావ్‌రా, నా ఇంటికి ?'— అన్నాడు రామనాధం మళ్ళీ,బొంగురు గొంతుకతో. 'నా పెళ్ళాం కోసం వచ్చావట్రా ?' అంటూ బూతులు . తిట్టి, తూలుకుంటూ వచ్చి రామారావుని చొక్కా పట్టుకుని అటూ ఇటూ బలంగా వూపాడు.

ఆ తర్వాత —

పటపట పది గుద్దులు పడ్డాయి. ఛళ్‌ఛళ్‌న చంపలు పేలిపోయాయి. ధన్‌ధన్‌మని పిడుగుల్లాగ దెబ్బలు పడ్డాయి.


ఆ దెబ్బలకి – నెత్తురు కక్కుకుని, లుంగిలు చుట్టుకుని క్రింద పడిపోయాడు రామనాథం. అది చూసి, ఆ బజారు మనిషి పారిపోయింది, భయపడి.


'సీతా ! రా, పోదాం,' అన్నాడు రామారావు.

'నేను రాను.' రోషంతో అంది సీత.

'ఈ నరకంలో నువ్వు వుండలేవు. వీడు నిన్ను చంపేస్తాడు రా.'

'చంపితే చంపనీ. అతనికాహక్కు వుంది. నేనిక్కడే వుంటాను.'





'సీతా ! నిన్ను తీసుకు వెడదామని వచ్చాను. రా, వెడదాం.'

'రాను. నా భర్తని ఇంత దారుణంగా కొట్టిన నువ్వు ఆయనకి శత్రువ్వి ! నాకూ శత్రువ్వే. అసలు ఆయన వంటిమీద చేతులు వేయటానికి నీకా అధికారం ఎవరిచ్చారు ?'

'నిన్ను హింసించటానికి అతనికేం హక్కుంది ?'

'అతను నా భర్త. నామీద అతనికి సర్వ హక్కులూ వున్నాయి.'

'అలాగా ! ఇదే నీ నిర్ణయమయితే, ఇక నాకు చెల్లెలు లేదనుకుంటాను.' కోపంగా అన్నాడు రామారావు.

ఇనుప తెరలు

'నిరభ్యంతరంగా అనుకో.'

'విషయం చాలా దూరం వెళ్తుంది ! సీతా, నా మాట విను. అన్యాయమైపోకు' బ్రతిమాలాడు.

'వెళ్ళనీ. తక్షణం నువ్వు ఇక్కడ్నించి వెళ్ళిపో, నా సంసారం విషయాల్లో ఇతరులు జోక్యం కలిగించుకోవటం నా కిష్టం లేదు. రాక్షసుడా వెళ్ళిపో' కఠినంగా అంది సీత, ఏడుస్తూనే.

గిర్రున వెనుదిరిగి వచ్చేశాడు రామారావు. వస్తూ వస్తూ కసిదీరా కాండ్రించి వుమ్మేసి వచ్చాడు.

అంతే !

ఆ తర్వాత రెండేళ్ళకి రామనాథం గుండె నొప్పివచ్చి చచ్చిపోయాడని తెల్సింది. రామారావు వెళ్ళలేదు. సీత ఆ వూళ్ళోనే వుంటూ వుందని తెల్సినా, వేరేపనిమీద ఆ వూరు వెళ్ళినా, అటు వయిపు తొంగిచూడలేదు రామారావు. తనకు చెల్లెలు లేదనుకుని, మనసులో ఇనుపతెరని, అతను ఆనాడే దించివేశాడు.

పడక కుర్చీలో కూర్చుని ఆ కుర్రాడి కోసం ఎదురుచూస్తూ కూర్చున్న రామారావు మనస్సులో అప్రయత్నంగానే ఆ సంఘటనలన్నీ కదిలాయి. సీత కొడుక్కూకూడా ఆ వయసే వుంటుంది. ఆ కుర్రాడు సీత కొడుకయితే ? ఏమో ! కావచ్చు. కాకపోవచ్చుకూడా.

ఆ క్రితం రోజు సాయంత్రం సుబ్రమణ్యం గారువచ్చి, ఆ పిల్లడి గురించి మాట్లాడి వెళ్ళిపోయారు. 'ఆ రోజు అన్ని బహుమతులు అందుకున్న ఆ కుర్రాడు చాలా కష్టపడి చదువుతాడట. కాని ఆ పిల్లవాడు చాలా పేదవాడట. పరీక్షల ఫీజు కట్టటానికి రేపే ఆఖరిరోజుట. ఆ పిల్లాడు అంతవరకూ ఫీజు చెల్లించలేదట. ఆ కుర్రాడి తల్లి జబ్బుతో మంచంమీద వుందట. అతనికి నా అన్నవాళ్ళెవరూ లేరట. 'రేపటిలోగా ఫీజు కట్టకపోతే ఆ అబ్బాయి అన్యాయమయి పోతాడు. బాబూ ! ఎందరికో ఉదారంగా సహాయం చేసిన మీరు ఈ కుర్రవాడికీ చేయూత నిస్తారన్న ఆశతో ఇదంతా మీకు చెప్పాను' అన్నారు సుబ్రమణ్యంగారు బాధగా.

'ఫర్లేదు మాష్టారూ. ఆ బాబుని రేపు సాయంత్రం నా దగ్గరకు పంపించండి. అవసరమైన సహాయం చేద్దాం' అని చెప్పి పంపించిన, రామారావుకి పన్లన్నీ మానుకుని, తను పనిగట్టుకుని, ఆ కుర్రాడి కోసం ఎదురుచూస్తూ కూర్చోవటం ఆశ్చర్యం కల్గించకపోలేదు.

గేటు దగ్గర చప్పుడయింది.

బుల్లి నిక్కరూ, పొట్టిచేతుల చారల చొక్కా, నున్నగా పాపిటతీసి దువ్విన క్రాపూ ! ఆ కుర్రాడు అక్కడనుంచుని వున్నాడు. అతనే !

'రా, బాబూ !'

ఆ బుడ్డాడు దగ్గరికి వచ్చి నిలబడ్డాడు.

'కూర్చో !'

కూర్చున్నాడు.

నవుకర్ని పిల్చి, అమ్మగార్ని పిలుచుకు రమ్మని చెప్పాడు, రామారావు. "ఏమిటండీ పిలిచారట !" అంటూ వచ్చి కూర్చున్న రజని, ఆ కుర్రాడ్ని చూసి ముచ్చటపడిపోయి 'ఎవరండీ, బాబు ?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది. బిస్కెట్లు తెప్పించి ఇచ్చింది.

'నేనూ అడగాలా. వుండు అడుగుతాను' – అని చిర్నవ్వునవ్వాడు రామారావు.

'హెడ్మాష్టరు సుబ్రమణ్యంగారు పంపించారాబాబూ, నిన్నూ ?'

ధర్మపథం : బులుసు వేంకట రమణయ్య



ఉపదేశంలోని పద్ధతులు

మన శ్రేయస్సు కోరేవారు సదుపదేశం చెయ్యడం పరిపాటి. వారు మంచిని బోధిస్తూ, చెడ్డనుండి మన బుద్ధిని మళ్లించడానికి ప్రయత్నిస్తారు. మన వాఙ్మయం చేసే పని కూడా ఇదే! అయితే ఆ ఉపదేశమార్గాలు విభిన్నంగా ఉంటాయి. తప్పు పనులు చేస్తున్న వాణ్ణి ఆ పనుల నుండి మళ్లించడానికి కొందరు కఠినంగా చెప్తారు. కొందరు మృదువుగా చెప్తారు. మృదువుగా చెప్పిన ఉపదేశంవల్లనే ఎక్కువ ప్రయోజనం వుంటుంది.

సాహిత్య శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం ఉపదేశం మూడు విధాలు – ప్రభు సమ్మితం, మిత్ర సమ్మితం, కాంత సమ్మితం అని. వేదాలు ప్రభువు మాదిరిగా శాసిస్తాయి. అవి చెప్పినట్లు నడుచుకోవాలి. ప్రభువు ఆజ్ఞ అలాంటిదే : 'ఎందుకు ఇలా చెయ్యాలి ?' అని ప్రశ్నించడానికి వీలులేదు. ప్రభు శాసనం ప్రజల మేలు కొరకు ఉద్దేశించబడినట్లే, వేదాలు కూడా మన మేలుకే శాసిస్తాయని గ్రహించాలి. ఇతిహాస పురాణాలు మిత్రసమ్మితాలు. మిత్రుడు ''ఈ విధంగా నడుచుకుంటే మేలు కలుగుతుంది. ఇలా నడుచుకుంటే కీడు కలుగుతుంది. మంచిగా నడచుకున్న ఫలానా వాళ్ళు మేలు పొందారు. చెడు ప్రవర్తన గల ఫలానా వాళ్లందరూ చెడిపోయారు. ఆపదలకు గురి అయ్యారు'' అని మంచిగా చెప్తాడు. ఇతిహాస పురాణాలు ఆ విధంగానే నీతులను బోధిస్తాయి — కాని ఆజ్ఞాపించవు. అధికారాన్ని చూపవు. అందువల్ల వేదాలు చేసే ఉపదేశం కంటె పురాణాదుల ఉపదేశం కొంత సున్నితంగా ఉంటుంది. కావ్యం కాంతా సమ్మితమైనది. దీనివల్ల జరిగే ఉపదేశం చాలా సున్నితంగా ఉంటుంది. యువతి ''ఇలా చెయ్యాలి; ఇలా చెయ్యకూడదు; ఈ పని జరగాలి; ఇది జరగకూడదు'' అని మాటలతో చెప్పకుండా, తన చేష్టల మూలంగాను, హావభావాల మూలంగాను తెలియజేస్తుంది. కావ్యం కూడా ఆ మాదిరిగానే హితాహితాలను వాక్యాల మూలంగా తెలియజేయకుండా వ్యంగం వల్లనే తెలియజేస్తుంది. దానిని మనం ఊహించుకోవాలి. అంటే ఇతరులచేత చెప్పించుకోకుండా మంచి చెడ్డలు మనమే గ్రహించి సరియైన మార్గంలో ప్రవర్తించాలన్నమాట. పయి మూడు పద్ధతులలోనూ ఈ చివరి పద్ధతి చాలా మెరుగైనది. సున్నితంగా చేసిన హితోపదేశమే తల కెక్కుతుంది. కఠినంగా చేసినది తల కెక్కదు. ''ఇతరులు నాకు చెప్పాలా ?'' అని కూడా తోచవచ్చు. అందువల్ల మనం చేసే ఉపదేశం ఎంత సున్నితంగా ఉంటే అంత మంచిది. దానివల్ల తప్పక ప్రయోజనం ఉంటుంది. ★

అవునన్నట్టు తలాడించాడు కుర్రాడు.

'మీదేవూరు ?'

'వానపాముల.'

'మీ నాన్నగారు లేరా ?'

'లేరండి.'

'అమ్మ.'

'అమ్మకి జబ్బండి.'

'పాపం ! అలాగా ! మీ అమ్మగారి పేరు ఏమిటి నాన్నా ?'

'సీతమ్మ.'

రామారావు గుండెల్లో పిడుగులు పడ్డాయి. రజని ఆత్రంగా చూసింది.

'మీ నాన్న పేరేంటి ?'

'సూరపనేని రామనాథంగారు.'

ఇక అనుమానం లేదు. తను వూహించినది నిజమయింది. వాడేవీడు ! 'నువ్వు పరీక్ష ఫీజు కట్టలేదా ?'

'ఉహు !' తల అడ్డంగా వూపాడువాడు.

ముచ్చటపడిన రామారావుకి గుండెల్లో వాత్సల్యఝరులు పొంగాయి. అనురాగ సముద్రాలుప్పొంగాయి. బంధాలు పెనవేసుకొనబోయాయి. వీడు, ఈ పచ్చిమిరపకాయ, ఈ చిన్న వెధవ, తన మేనల్లుడా !

'ఈ పరీక్షే కాదు. ఇంకా పెద్ద పెద్ద చదువులూ చదివిస్తాను. నిన్ను గొప్పవాణ్ణి చేస్తాను. నా దగ్గరుండి చదువుకుంటావా ?'— అని అడిగాడు రామారావు, వాత్సల్యంగా.

'అమ్మ... ?'

'అమ్మ రాదులే. తను అక్కడ్నే వుంటుంది. కావాలంటే డబ్బు ఇద్దాం. ఏం ? నువ్వు మరి, మాతో వుంటావా ?'

'ఉహూ' అని స్థిరంగా తల వూపి, లేచి నిలబడి, వెనక్కితిరిగి, పరుగు పరుగున, బాణం లాగా దూసుకుని పారిపోయాడు ఆ పిల్లడు. ఆ హఠాత్సంఘటనకి — నిశ్చేష్టుడై చూస్తూ వుండిపోయాడు, రామారావు.

రజని కుతూహలంగా అతన్నే గమనిస్తూ వుంది. రామారావు కళ్ళు మూసుకున్నాడు. కాసేపట్లో రామారావు కళ్ళనుంచి ధారలుగా కన్నీరు కారి చారికలు కట్టింది.

'రజనీ ! అంతా విన్నావుగదా ! నువ్వూ చూసావుగదా ?'

అవునన్నట్లు తల వూపింది రజని.

'ఇప్పుడు నేనేం చెయ్యాలి ! నిర్ణయం నీకే వదిలేసాను.' అన్నాడు రామారావు.

'అయితే నేను చెప్పినట్లు వింటారా ? అలాగే చేస్తారా ?'

తల పైకీ కిందికీ వూపాడు రామారావు.

'గతంలో అయిందేదో అయిపోయింది. పంతాలూ పట్టింపులకు పోయి, గుండెల్లో ఒకపక్క కుమిలిపోతూనే, కఠినమయిన ''ఇనుప తెరల్ని'' దించుకుని, భేషజం నిల్పుకోవటానికి ప్రయత్నించటం, మనసున్న మనిషి చేయదగిన పనిగాదు. అందువలన, లేచి మొహం కడుక్కోండి. మనం ఇప్పుడే కార్లో ఆ వూరు వెళ్ళి సీత వదిన్నీ, పిల్లడినీ తీసుకువద్దాం. వదిన మనది అయినప్పుడు పిల్లడు మనవాడు కాకపోతాడా ?'

'నిజమే సుమా !'

'మరి లేచి తయారవండి. క్విక్.'

తేలికయిన మనస్సుతో, ఉషారుగా లేచాడు, రామారావు. ★

సీరియల్

మూగ ముత్యాలు

యలమంచిలి ఝాన్సీలక్ష్మి

జరిగినకథ – 9: సలీంకు సారథిపట్లగల ఆరాధనను మనస్సులోనే మెచ్చుకొంటుంది శశిరేఖ. సారథి శశిరేఖతో విసిగి ఆమెను వదిలేసి సీత దగ్గరకు వెళతాడు. సీత భర్త శ్రీనివాస్ అని తెలుసుకుంటాడు. శశిరేఖను చూడాలంటుంది సీత. తను విజయకు తగనని సోమయాజులు గారితో అంటాడు సారథి. మనిషికి మనస్సు ముఖ్యం కానీ, కులం ప్రధానం కాదని చెపుతాడు సోమయాజులు. సోమయాజులుగారికి పక్షవాతం వస్తుంది. విజయను, రాజ్యంను ఆయన దగ్గరకు తీసుకెళతాడు సారథి. సోమయాజులుగారికి సలీంను పరిచయం చేస్తాడు. సీత సారథి ఇంటికి వచ్చి అక్కడ శశిరేఖను చూస్తుంది. శ్రీనివాస్‌కన్నా మంచివాడిని తెచ్చి పెళ్లి చేస్తానని సారథి శశిరేఖకు చెప్పబోగా ఆమె అతని మాట వినకుండా అతనితో ఘర్షణ పడుతుంది. మెల్ల మెల్లగా విజయ మనస్సును సారథి ఆకట్టుకొంటుంటాడు. సారథి తీసుకు వచ్చిన కుర్రాడు తనకు నచ్చలేదని చెబుతుంది విజయ. విజయ నూతి దగ్గర కాలు జారి పడగా కాలు ఫ్రాక్చరవుతుంది. విజయ మాటల వలన ఆమె మనసులో తనకు స్థానం ఉందని సారథికి స్పష్టంగా తెలిసిపోతుంది.

(గత సంచిక తరువాయి)

సారథి హైదరాబాదు చేరగానే లెటరు వ్రాసాడు. విజయ కాలు ఎలా వుందో వ్రాయమని అడిగాడందులో.

"వుత్తరం వ్రాయి తల్లీ!" అన్నారు సోమయాజులుగారు.

"నా కంత ఓపిక లేదు తాతయ్యా! మీరే వ్రాయండి!" అన్నది.

"అయినా ఆయనకి మనం యింక గుర్తుండము తాతయ్యా! ఏదో వచ్చి వెళ్లిన వేడికి రాశారు!"

"నీ కోపం తగ్గిన తరువాత చూద్దాం లేమ్మా!"

"ఇదుగో! తాతయ్యా! మళ్ళీ! ఆ మాట అనకు! నా కసలు కోపమే రాలేదని గుర్తుంచుకో!"

"మరెందుకమ్మా కళ్ళలా ఎర్రబడి పోయాయి? నీ ముఖం ఎలా ముడుచుకు పోయిందో అద్దంలో చూసుకున్నావా?"

"చూడను! చూడదలచుకోలేదు!"

"సరేలే! యుద్ధం మానేద్దాం! నేనూ లేవలేను! నువ్వూ పరుగెత్తలేవు!" సోమయాజులుగారి పరిహాసోక్తికి నవ్విందామె.

"లేకపోతే ఏమిటి తాతయ్యా! నేనసలే యీ నొప్పితో చచ్చిపోతూంటే వుత్తరం రాస్తావా? అద్దంలో ముఖం చూసుకున్నావా! అని లక్ష ప్రశ్నలు వేస్తావూ?" లోలోన రగుల్తూన్న బాధతోపాటు, కాలినొప్పి ఆమె కళ్ళల్లో నీటిని తెప్పించింది.

సోమయాజులుగారు మాట్లాడలేదాపైన.

విజయ కూడా మౌనం వహించింది! ఆమె మనస్సుకి నచ్చజెప్పలేక సతమతమై పోతోందని గ్రహించారాయన.

ఆ తరువాత సారథి దగ్గర నుంచి లెటరే రాలేదు చాలా రోజుల వరకు. రాజ్యం వ్రాసింది! ఓ సారి సారథి వచ్చాడని! తనని వాళ్ల యింటికి ఆహ్వానించాడనీ! కానీ తీరిక లేక వెళ్లలేక పోయాననీ వ్రాసింది.

ఓసారీ వచ్చి తాతగారినీ, విజయనీ చూసి వెళ్లింది.

"సారథి కన్పించలేదా మ్మా!" సోమయాజులుగారు ప్రశ్నించారు రాజ్యాన్ని.

"ఒక్కసారే కన్పించారు తాతయ్యా! కాలేజీ తరపున అజంతా, ఎల్లోరాలు వెడుతున్నానని చెప్పారు. వాళ్లింటికి వెళ్లలేక పోయానప్పట్లో! మరోసారి వెళ్దామనుకొంటే అడ్రసు గుర్తు రాలేదు!" అన్నదామె.

విజయ అతని గురించి అక్షరమైనా అడగలేదు. రెండు నెలలు గడిచిపోయిన తరువాత ఓనాడు వచ్చాడు సారథి. విజయ వరండాలో నిలబడి వుందపుడు. గేటుతీసిలోనికి వస్తూన్న అతన్ని చూడగానే ఆమె గుండెల్లో ఆనందం నిండిపోయింది. కానీ ఆ ఆనందాన్ని, లోలోన లేచి పడుతూన్న వుద్వేగాన్ని బలవంతాన అణచి పెట్టి వేసింది.

"నమస్కారం! గుర్తున్నామా లెక్చరరు గారికి? ఏమిటిలా చిక్కిపోయారు? ఎవరి కోసమైనా దిగులు పడుతోందా మీ మనస్సు? వస్తారని అనుకోలేదు!" మనస్సుకి అనురాగం తీయని సందడిని సృష్టిస్తోంది.

"ఏమౌతుందీ మనస్సుకి! ఈ మహాశయుణ్ణి చూడగానే యిలా పులకించి పోతుందేమిటీ?" ఆమె మనస్సుపైన కోపం తెచ్చుకుంది.

"నీ కోపం నన్ను భయపెట్టేసింది విజయా! నెల రోజులపైన పడక పెట్టేశానా భయంతో! టైఫాయిడ్ అని పేరు పెట్టాడు డాక్టరు! సలీమ్ నాకో అంగరక్షకుడై పోయాడిన్నాళ్ళూ! ఎక్కడికీ కదలనివ్వనన్నాడు! తాతయ్య ఎలా వున్నారు? నీ కాలు పూర్తిగా నయమైపోయిందిగదూ?" అతడు ఎప్పటిలా 'మీరు' అనకపోవడం గమనించిందామె మనస్సు. ఆ పైన అతడు ఎంతో చనువుగా, ప్రేమగా పలకరించడం మరింత ఆనందాన్ని కలుగజేసిందామెకు. కానీ అతడు సన్నబడి పోయాడని ఎంతగానో విలవిలలాడి పోయిందామె మనస్సు.

"తాతయ్యా! ఎవరొచ్చారో చెప్పండి!" విజయ వుత్సాహాన్ని పట్టలేక తాతగారి దగ్గరికి వెళ్ళింది.

"బావున్నారా తాతయ్యా!" సారథి నవ్వుతూ పలకరించాడు.

"ఇలా వున్నానాయనా! నువ్వేమిటిలా చిక్కిపోయావు బాబూ?"

సోమయాజులు గారతడి భుజంపైన చేయి వేసి వాత్సల్యంగా చూస్తూ అడిగారు.

"ఈయనగారు అజంతా ఎల్లోరా తిరిగి వచ్చి, టైఫాయిడ్‌తో మంచం ఎక్కారట తాతయ్యా! అయినా మనకి కబురూ కాకరకాయా లేదు!" విజయ నిష్ఠూరంగా అన్నది.

"అనవసరంగా మిమ్మల్ని కంగారు పెట్టినట్లు అవుతుందని వ్రాయలేదు తాతయ్యా! ఇదుగోండి! మీకోసం కృష్ణుని విగ్రహం తీసుకున్నాను! పాలరాతి విగ్రహాలక్కడ ఎంతో అందమైనవి వున్నాయి! ఈ విగ్రహం చూడగానే మీరు గుర్తుకు వచ్చారు! తీసుకోకుండా వుండలేకపోయాను!"

సారథి చక్కని పాలరాతి విగ్రహాన్ని తీసి తాతగారికి అందించాడు.

"బావుంది! ఏ రాతిలో వున్నా యీ వెన్న

దొంగ అందంగానే మెరిసిపోతాడయ్యా !'' సోమయాజులుగారు ఆ విగ్రహాన్ని చూస్తుండి పోయారు. విజయ కూడా మెచ్చుకుంది ! సారథీ, సోమయాజులుగారు కబుర్లలో పడి పోయారా తరువాత !

''తాతయ్యో ! ఆయన్ని భోజనానికి పంపించు! నీ ఆకలి చల్లారింది గనుక కబుర్లలో పడిపోయావ్ ! పాపం ప్రయాణము చేసి వచ్చా రాయన !'' విజయ హెచ్చరించింది. సారథి లేచి వెళ్ళాడు.

''ఇన్ని కూరలెందుకు విజయా ? అన్నం కూడా తీసెయ్యాలి ! ఇంత తినలేను !'' అన్నా డతడు.

''అందుకె యిలా తయారయ్యారు ! మీ రేమీ ఆడపిల్లలు గాదులెండి ! నాజూకు పోకుండా కడుపునిండా తినండి ! గాలికి ఎగిరి పోయే ట్టున్నారు ! ఇలాగే తినని వుపవాసాలు చేసి వుంటారు?''

''నువ్వెన్నయినా అను ! నేను తినలేను ! ఏ మాత్రం ఎక్కువ తిన్నా యీ మధ్యన కడుపులో నొప్పి వస్తోంది. డాక్టరు కూడా తగ్గించి తినమన్నాడు !''

''సరే ! మీ యిష్టం !'' విజయకి అతడిని చూస్తున్న కొలది జాలి వేయసాగింది !

అస్వస్థతతో పాటు మరేదో బాధ అతడిని బాగా కృశింపచేసిందని గ్రహించి నిట్టూర్చింది.

భోజనం చేసిన తరువాత పళ్ళరసం తెచ్చి యిచ్చింది.

''మళ్ళీ యిదేమిటి విజయా !''

''బత్తాయి రసం ! రోజూ వాడితే మంచిది మీకు ! కాదనకండి !''

''పళ్ళు చాలా ప్రియం హైద్రాబాదులో ! కొనలేం !'' అతడు త్రాగి గ్లాసు యిస్తూ అన్నాడు.

విజయ వెళ్ళబోతున్నదల్లా ఆగిపోయింది.

''డాక్టరు మిమ్మల్ని పళ్ళరసం తీసుకోమని చెప్పలేదా ?''

''డాక్టరు చెబితే మనకంత శక్తి వుండొద్దూ ?'' ఆమె మనస్సు ఆర్ద్రమై పోయింది.

''మీ శశిరేఖ ఏం చేస్తోంది ? సీత ఏలూరు వెళ్ళిందా ?'' ఆమె కావాలనే మాటని మార్చి వేసింది.

''శశిరేఖ సీతతో పోట్లాడి వెళ్ళిపోయిందో రోజున ! ఢిల్లీ వెళ్ళిందంట ఆఫీసు పనిమీద, యింకా రాలేదు !''

''సీతతోనా ? ఎందుకూ ?''

''ఏమో మరి ! నేను హాస్పిటల్లో వున్నాను! సలీమ్ వచ్చి చెప్పాడు ! వాడు వెళ్ళేసరికే కోపంతో సూట్‌కేస్ పట్టుకొని వెళ్ళిపోయిం దంట. సీత నడిగితే ''పిచ్చిదన్నయ్యా ! నన్ను సినిమాకి రమ్మంది ! రానన్నాను ! నాతో రావడానికి నీకు నామోషీలే ! నేను నీ అంతటి గొప్పదాన్ని కాదుగదా మరీ ! అని పోట్లాడి వెళ్ళిపోయింది' అని చెప్పిందట.''

''మరి మీరు వెళ్ళి తీసుకురాకపోయారా?''

''ఢిల్లీ వెళ్ళి రావడానికి...డబ్బు కావద్దూ!



వెళ్ళినా వస్తూందని నమ్మకం ఏమిటి ? రేఖ కూడా కోపంలో నీలాగే మనుష్యుల్ని అనేస్తుంది!'' సారధి లోలోన దుఃఖం పైన పరిహాసం వెదజల్లాడు.

''మీరు మరీను ! కోపంలో మిమ్మల్ని ఎప్పుడైనా అన్నానా? తాతయ్యని మ్రింగేశానా?''

''మీరు మమ్మల్ని మర్చిపోయారనుకున్నాను !'' ఆమె అన్నది మళ్ళీ.

''సలీమ్‌తో కబురు పంపించాలనుకున్నాను! కానీ...''

''విజయకెందుకు చెప్పాలీ కబురు ? మీకేమౌతుంది. అనుకొని ఆగిపోయారుగదూ ? మీ హృదయం చాలా కఠినం !''

అతడామెనే చూస్తుండిపోయాడు మౌనంగా.

''ఏమిటలా చూస్తున్నారు ? మీకు మాట్లాడ్డానిక్కూడా ఓపికలేదని నేనే మాట్లాడేస్తున్నానులెండి !''

''నాకు నువ్వు మాట్లాడుతూ వుంటే మౌనంగా వినాలనిపిస్తుంది విజయా !'' విజయ మనస్సులో తీయని అనురాగం త్రుళ్ళిపడిందా ప్రశంస వినగానే.

''ఏమిటింతగా పొగిడేస్తున్నారు ?''

''నాకు పొగడడం రాదసలు ! విజయా ! నేనేం చెప్పినా యిలా కాదంటావెందుకూ ?''

''నాక్కాస్త పిచ్చి వుంది! మీ అమ్మగారు చెప్పలేదా ?''

''చెప్పింది ! అందుకే చూడాలని వచ్చానా రోజున డబ్బు తీసుకుని ! కానీ నువ్వు కంటికి కన్పించను పొమ్మన్నావు !''

''మీరంటే అప్పట్లో నాకు మహా కోపం!''

''ఇప్పుడు మాత్రం లేదంటావా ?''

''ఇప్పుడా ?! ఎందుకూ ? మీరు తాతయ్య ప్రాణస్నేహితులైపోయారుగా ! మిమ్మల్ని చిన్న మెత్తు మాట అననివ్వడు తాతయ్య !''

''ఎందుకిలా దిగులుగా కన్పిస్తున్నారీసారి?'' ఆమె అన్నది మళ్ళీ !

''ఈ జీవితం అంటే విసుగ్గా వుంది విజయా !''

''మీరేమీ అనుకోనంటే ఓ మాట చెబుతాను !''

''చెప్పు ! ఆ విసుగును భరించలేకే యిలా పారిపోయి వచ్చేశానసలు !''

''మీరు ... పెళ్ళి గురించి ఆలోచించరా అసలు ?''

నవ్వాడతడు దిగులుగా.

''నన్నెవరు చేసుకొంటారు ?''

''మా వూళ్ళో అందమైన ఆడపిల్లలు వున్నారు ! అడగమంటారా ?''

''వద్దు !'' అన్నాడతడు గంభీరంగా.

''ఏం ? భీష్ముడిలాగే వుండిపోతారా ?''

''అంత గొప్పవాణ్ణి కాదు నేను ! ...శశిరేఖ యిక్కడికి వస్తానని సలీమ్‌కి వ్రాసిందట ! వచ్చిందేమోనని వచ్చాను ! బహుశా యీ రోజో రేపో వస్తుందేమో !'' అతడు గుండెల్లో రగులుతూన్న దిగులుని వెల్లడించాడు.

''మా యింటికి వస్తానన్నదా? ఎందుకో?''

''నీతో మాట్లాడాలట '' సారధి బయటకు చూస్తూ అన్నాడు.

''నాతోనా? ఏంవుంది? మాట్లాడ్డానికి?''

''ఏమో మరి ! నా కెలా తెలుస్తుంది ? రేఖ వున్నట్టుండి యిలాంటి పిచ్చి పనులు చేస్తోందీమధ్య ! తనకేమాత్రమూ పరిచయమూ లేని వాళ్ళ దగ్గరకెళ్ళి నా గురించి ఏమేమో అడిగిందట !''

''రేఖ మీ స్వంత చెల్లెలు కాదా ? ''

''అదేంగాదు ! అమ్మ నన్ను పెద్దనాన్న గారికి పిల్లలు లేరని దత్తు యిచ్చింది ! సీతా నాకు చెల్లెలే ! కానీ పెదనాన్నగారమ్మాయి ! రేఖ నా స్వంత చెల్లెలు !'' అతడు తన తల్లిని గురించి చెప్పకుండా ఆపివేసాడు.

''రేఖని రానివ్వండి ! మా యింట్లోనే వుండిపోయేట్టు చేస్తాను !''

''వుండదు ! ఇలాంటి పల్లెటూళ్ళంటే రేఖకి అసహ్యం ! ''

అతనికి లోలోన భయంగా వుంది. రేఖ వచ్చి తల్లి గురించి చెప్పేవేస్తుందేమోనని. తండ్రిని తూలనాడి, తనని కూడా తిట్టిపోస్తుందేమోనని అనుమానంగా వుంది. అందుకే వచ్చాడా కబురు వినగానే

ఆ రాత్రి మంచినీళ్ళ కూజా పెట్టటానికి వచ్చిన విజయ అతనింకా నిద్రబోలేదని గమనించింది ! అతడు తలక్రింద చేయి పెట్టుకుని యింటి పైకప్పుకేసి చూస్తూ ఏదో ఆలోచనలో మునిగివున్నాడు.

''ఏమిటి? రేఖ వచ్చేవరకూ నిద్రపోదలచుకోలేదా ?''

''వూ ! అబ్బే ! అదేంలేదు !'' అతడు కళ్ళు మూసుకున్నాడు అలసిపోయినట్లు.

''ఏమిటీయన బాధ ? రేఖ వస్తే కొంపలు మునిగిపోతాయా ?'' విజయ తనను తానే ప్రశ్నించుకుంది.

''ఈ పల్లెటూళ్ళో బ్రతకటం ఎంత హాయిగా వుంటుందో ?''

''మరెందుకలా పారిపోయారు మొన్న ?''

''ఏం చేయనిక్కడ? సీత ఏమైపోతుంది?''

''శ్రీనివాస్ ఏమయ్యాడు ? సీత... జీవితంకి ఏమైనా సమస్య లున్నాయా ?''

''శ్రీనివాస్ ఎలాంటివాడో నీకు తెలియదా?''

''మంచివాడు కాడని తెలుసులెండి ! సీతని సరిగా చూడడంలేదా ?''

''శశిరేఖని ప్రేమించాడాయన ! సీతకి తెలుసు ! అయినా రేఖపైన జాలితో మనస్సు ముక్కలు ముక్కలైపోతున్నా నిశ్శబ్దంగా భరిస్తోంది ! శశిరేఖకి... శ్రీనివాస్‌ని పెళ్ళి చేసుకోవాలన్న వూహ వున్నట్లుంది ! సీత జీవశ్ఛవంలా బ్రతుకుతుంది. తన కళ్ళముందే భర్త ప్రక్కన శశిరేఖ కూర్చుని హాయిగా నవ్వుతూంటే గుండెల్ని గుప్పిట్లో పెట్టుకుని — మనిషిలా నటిస్తోంది ! రేఖకి 'సీత' భర్త శ్రీనివాస్ అని తెలియదు !''

అతని దిగులు అర్థమైపోయిందామెకి.

ఎలా అతన్ని ఓదార్చాలో అర్థంగాలేదామెకు.


''మీ మనస్సునీ సమస్య కోసివేస్తుందని తెలియక మిమ్మల్ని ఎన్నెన్నో అన్నాను ! క్షమించండి !''


''నేను రావడంవలన నీకేమైనా యిబ్బందిగా వుందా ? విజయా ? ఇది పల్లెటూరు ! నా మూలాన అనవసరంగా మళ్ళీ నీపైన లేనిపోని అభాండాల్ని రుద్దరు గదా ! అందుకే రావద్దనుకున్నాను. ఉత్తరం వ్రాస్తే నువ్వు తప్పకుండా వస్తావు ! మళ్ళీ నా మనస్సు నా మాట వినదు ! నన్నక్కడికి లాక్కు వస్తుంది ! అందుకే వ్రాయలేదు ! కానీ యీ రేఖ నన్ను మళ్ళీ యిక్కడికి రప్పించింది ! తాతయ్య ఏమనుకుంటున్నారో !''

''మీలా నేను పిచ్చిగా ఆలోచించనులెండి ! మీకా భయం అక్కర్లేదు ! ఎవరో అడుగుతారని మిమ్మల్ని వెళ్ళగొట్టనులెండి ! తాతయ్య ఎప్పుడో చెప్పేశారు ! 'మా మనుమడు' అని ! మళ్ళీ ఏమైవునించి అని అడక్కండి ! నాకు

గ్లాకోమా వ్యాధికి లేసర్ చికిత్స

గ్లాకోమా అనేది ఒక కండ్ల వ్యాధి. పశ్చిమ జర్మనీలోని హోంబర్గ్ ఆసుపత్రిలో రేసర్ కిరణాలతో దీనికి చికిత్సచేస్తున్నారు. ప్రతి పదిమంది రోగులలో, తొమ్మిది మందికి ఈ చికిత్స విజయవంతం అవుతున్నట్లు సెయింట్ జార్జ్ హాస్పటల్‌కు చెందిన డా. మార్టిన్‌గోర్న్ తెలియచేశారు. లేసర్ కిరణాల వ్యాసం ఒక మిల్లీమీటరులో ఇరవయ్యోవంతు ఉంటుంది. వీటిని సెకనులో పదోవంతుసేపు వ్యాధిగ్రస్థమయిన కంటిపై ప్రసరింపచేస్తారు. కంటిలోని పీడనం తగ్గి కన్ను సహజ స్థితికి వస్తుంది. కొన్ని కేసుల్లో మాత్రం ఆ తరువాత బొట్లమందుకూడా ఉపయోగించాల్సి ఉంటుంది. ఈ లేసర్ చికిత్స చిన్న పిల్లలకు, వృద్ధులకు మరింత ఉపయోగకరమైనది. వీరు కంటి ఆపరేషన్లను తట్టుకోలేరు. అంధత్వం రావటానికి గల కారణాలలో గ్లాకోమా ముఖ్యమైనది.





మాత్రం 'సారథి'గారు అంతే! నిజం చెప్పాలంటే మీరు నాకు మంచి స్నేహితులు."

మరునాడు కూడా రాలేదు శశిరేఖ! సారథి మనస్సున కాస్త శాంతి ఏర్పడింది!

"ఇక వెళ్తాను విజయా!" అన్నాడావేళ!

"రావడం మీ యిష్టం! కానీ వెళ్ళటానికి నా యిష్టం కావాలని గుర్తుంచుకోండి!" విజయ అతనిలోని నిరుత్సాహాన్ని పోగొట్టాలని మనస్సు విప్పి చెప్పింది.

"నన్ను వెళ్ళనీ! ఇక్కడికి రాకుండా వుండడానికి నేనెంత బ్రహ్మ ప్రయత్నం చేశానో నీకు చెప్పలేను! వెళ్ళడానికి మనస్సు ఒప్పుకోదు! అందుకే పోయినసారి నీకు కోపం తెప్పించి వెళ్ళిపోయాను! ఆ కోపంలో నువ్వు నా ఎదుటకే రాలేదు! వస్తే! వెళ్ళడానికి వీల్లేదు! అనేదానివి! వెళ్ళలేక నీ మాటకి కట్టుబడి పోయేవాణ్ణి! అందుకే నువ్వు నా ఎదుటికి రాక ముందే వెళ్ళిపోయాను! మొన్న టైఫాయిడ్ వచ్చినపుడు...ఓ రాత్రి బాగా ప్రమాదమైంది! సీత ఏడుస్తూ కూర్చుంది! టెంపరేచర్ బాగా పెరిగిపోయింది! సతీష్ డాక్టర్ కోసం పరుగెత్తాడు! నాకు భయం వేసింది! ఒక్కసారి నిన్ను చూడాలన్పించింది! నిన్ను చూడకమునుపే ప్రాణం పోతుందేమోనని వణికిపోయాను!"

సారథి మరో వైపుకు తిరిగి కళ్ళు తుడుచుకున్నాడు.

విజయ పసిపిల్లలా వెక్కి వెక్కి ఏడ్చింది!

"ఇక చెప్పకండి! నా గుండెలు పగిలిపోతాయి!" ఏడుస్తూనే అన్నదామె.

"నువ్వు నాకింత సన్నిహితంగా ఎపుడొచ్చావో నాకే తెలియదు! నేను నీకెంత దూరంగా వుండాలనుకొన్నానో అంత చేరువయ్యాను!"

కన్నీటి తెరల్లోనుంచి చూస్తుంటే విజయకి, సారథి మరింత ఆత్మీయుడన్పించింది.

"నేను... నీకేమీ కానని తెలిసీ నా మనస్సిలా నన్నెందుకు వేధిస్తుందో... నా కర్మం కావడం లేదు విజయా! నన్ను వెళ్ళనివ్వు! 'సారథి' అన్న మనిషే నీ స్మృతుల్లోకి... రాకుండా చూడు!" అతడామె చేతి నందుకుని ప్రార్థిస్తున్నట్లు కన్నీటితో అర్థించాడు. ఆమె చేతిపైన అశ్రుబిందువులు రాలిపడ్డాయి! అతడు మృదువుగా రుమాలుతో అద్ది వెంటనే వెళ్ళిపోయాడు.

విజయ కన్నీటిని వత్తుకుంటూ అతడినే చూస్తుండిపోయింది.

భగవాన్! ఎంతగా కోరుకుంటోంది అతడిని నా మనస్సు?

ఈ అనురాగం నన్ను పిచ్చిదాన్ని చేసివేస్తోంది! సారథీ! ఒక్కసారి మళ్ళీ రాలేవా? నా గుండెల్లో యిన్నాళ్ళా ఆశల్ని నింపుకున్నాను. నా ప్రేమ మిమ్మల్ని నావాణ్ణి చేస్తుందని మురిసిపోయాను! కానీ యిలా... మీరింత హఠాత్తుగా నన్నింత దుఃఖానికి బలిచేసి వెళ్ళిపోతున్నారని నేనూహించవేలేదు.

విజయ మనస్సులో దుఃఖం సముద్రంలా విరుచుకుపడసాగింది.

* * *

"సీతా! రేఖ వచ్చిందా?" సారథి యింటికి వెళ్ళగానే అడిగిన ప్రశ్న అది.

"ఏం? వచ్చింది? ఏం కావాలి?" రేఖ బయటకు వచ్చింది.

సారథి భారం తీరిపోయినట్లు నిట్టూర్చాడు.

"సీత లేదా?"

"ఏం నాతో మాట్లాడితే పాపం వస్తుందా? ఏమిటసలు మీరంతా? నాతో మాట్లాడరు? 'రేఖా' ఈ పని చెయ్యి అని అడగరు? నేను మీ కులంలో మనిషిని కాదనా?" రేఖ విరుచుకు పడింది.

సారథి చెప్పులు విడిచి కాళ్ళూ చేతులు కడుక్కోవడానికి వెళ్ళాడు.

"నీకు జ్వరం వచ్చిందని నా కెందుకు రాయలేదు?"

రేఖ ప్రశ్నలతనికి వింతగా తోచాయి. ఆమె మరో మనిషిలా వుందతనికి.

"నువ్వు ఢిల్లీ వెళ్తున్నానని నాతో ఎందుకు చెప్పలేదు?" సారథి వింత స్వరంతో ప్రశ్నించాడు.

"చెప్పితే నువ్వు వెళ్ళనీయవని!"

"ఇంట్లో నుంచి వెళ్ళిపోవడమెందుకు?"

"సీత శ్రీనివాస్‌తో సినిమాకి రానన్నది! ఏం! అతనంత చెడ్డవాడా? అంటే నేనూ చెడ్డదాన్ననేగా ఆమె చెప్పడం!"

"శ్రీనివాస్ మంచివాడు గాదు! నాకు తెలుసు! సీత ... అలా వెళ్ళే మనిషి గాదు!"

"అంటే ఆమెగారు పతివ్రతా శిరోమణి! నేను బజారు మనిషి నన్నమాట! ఆమె నీకు ప్రియమైన చెల్లెలు ... నేను ఏమీ గాను!"

"ఎందుక్కాదు! నీకో అన్న వున్నాడని చెప్పినా నువ్వు విన్పించుకున్నావా? బహుశా నేను బతికి వున్నట్లు నీకు గుర్తులేదేమో!" సారథి గొంతు కఠినంగా ధ్వనించింది.

ఒక్క క్షణం నోటమాట రాలేదామెకి.

"శ్రీనివాస్ కూడా వచ్చాడా?"

"వచ్చాడు! వచ్చేనెల పదిహేనో తారీఖున మా పెళ్ళి!"

సారథి వులిక్కిపడ్డాడు. అతనికి గుండెలు కొట్టుకోవడం ఆగిపోయినట్లన్పించింది!

"అమ్మా! సీతా! అయిపోయిందమ్మా! ఈ రేఖ ... నీ గుండెల్ని చీల్చివేసింది!" తల వంచుకుని కూర్చుండిపోయాడతడు నిలబడడానికి ఓపిక లేనట్లు.

"ఏం నీ కిష్టం లేదా?"

"ఎందుకిష్టంలేదు?! మీ క్రొత్త కాపురానికి కావలసిన ఏర్పాట్ల గురించి ఆలోచిస్తున్నాను!"

"అదేమీకాదు! నీకు ఏడుపు వస్తోంది!" రేఖ పెద్దగా అరచింది.

"నేనంత నీచుణ్ణి గాదు!"

"మరెందుకలా కళ్ళు తుడుచుకుంటున్నావు?"

"ఆనందం భరించలేకపోతున్నా నీమధ్య!"

"అబద్ధం! నీక్కావలసింది సీత క్షేమం! సీత సుఃఖ దుఃఖాలు! ఆమె వెళ్ళిపోయిందని ఏడుస్తున్నావు! సీతకి శ్రీనివాస్ లాంటి భర్త దొరకలేదని యీర్ష్యపడిపోతున్నావు!" రేఖ అతని గుండెల్ని చీల్చి వేయసాగింది మాటలతో.

''మీరంతా స్వార్థపరులు ! నన్ను చూసి యీర్ష్యతో కుళ్ళిపోతున్నారు. సీత మరీ ఏడుస్తోంది నా అదృష్టం చూసి !''

సారధి ఏడవలేక నవ్వాడీసారి.

''సీత నీ కోసం ఎంత విలువైన దాన్ని పోగొట్టుకుందో నీకు చెప్పినా అర్థం కాదు ! నేను ఎంత స్వార్థపరుడ్నో వెళ్ళి విజయనడుగు ! అమ్మా రేఖా ! నువ్వు యికనైనా జీవితంలో స్థిరపడు ! శ్రీనివాస్‌తో నీ జీవితాన్ని ముడి వేసుకో ! అర్థంలేని స్నేహాల్నీ, అలవాట్లనీ మానెయ్ ! నీకు నేనంటే యిష్టం లేకపోతే చెప్పెయ్ ! నీ పెళ్ళికాగానే దూరంగా వెళ్ళి పోతాను !'' సారధి శాంతంగా నచ్చజెప్పాడామెకి.

''మంచిది ! నాక్కావలసిందీ అదే ! నువ్వు దూరంగా వెళ్ళిపోయాకే పెళ్ళి జేసుకుంటాను !''

''భయపడకు ! వెళ్ళిపోతాన్లే !''

సారధి కోపాన్ని అణచుకున్నాడీసారి.

మరునాటి వుదయం సారధి లేచేసరికి బాగా ప్రొద్దెక్కింది. రేఖ లేచి వంట చేసింది. అతనికి సంతోషంగానూ వుంది, విచారంగానూ వుంది.

''ఈ వంట ఎందుకు చేసిందో ? మళ్ళీ ఏ తుఫానో వస్తుంది !'' అనుకున్నాడు. వరండాలో ఎవరో మాట్లాడుతున్నట్లు విన్పించింది ! లేచి వెళ్ళాడు. ఆషా వచ్చింది ! శ్రీనివాస్‌కూడా వున్నాడక్కడ. రేఖలోపల వుంది.

శ్రీనివాస్ ఆషని చూస్తూ ఏదో అంటున్నాడు. అతని చూపుల్లో మెరుస్తున్న కోరికని చూసి సారధికి వళ్ళు మండిపోయింది.

''ఆషా ! లోపలికి రా !''

''లేచావా అన్నయ్యా !'' అంటూ ఆషా లోపలికి వచ్చింది.

''ఎవరు రేఖా యీ అమ్మాయి ?'' శ్రీనివాస్ రేఖని అడుగుతున్నాడు.

సారధికి వాళ్ళ మాటలు విన్పిస్తున్నాయి స్పష్టంగా.

''ఏం ? నా కంటే అందంగా వుందా ?'' అది రేఖ గొంతు.

''అదేంగాదు ! మంచి బ్యూటీ ! మనతో వస్తుందేమో అడగరాదూ ?''

''ఆ అమ్మాయికి నీలాగా తాగి పిచ్చి గంతులు వేయడం రాదు !'' రేఖ అతని ఆశని త్రుంచి వేసింది క్షణంలో.

''సలీమ్‌కి తెలిస్తే నిన్ను జైల్లో వేయిస్తాడు ! ఆ అమ్మాయి గురించి మరోసారి అడక్కు !''

''ఓహో ! ఈ అమ్మాయి ఆ సలీమ్‌కి కాబోయే .... డార్లింగన్నమాట ! అదృష్టవంతుడు !''

''ముందిక్కడనుంచి వెళ్ళు ! నేను సాయంత్రం వస్తానని చెప్పానుగా ! సీతని తీసుకు రావాలనుకొన్నాను !''

''అరే ! సీతెందుకు డార్లింగ్ ! మన మధ్యన !''

''సీత పేరెత్తగానే యిలా హడలిపోతావెందుకు ?''

''నాన్సెన్స్ ! అదేంగాదు డియర్ ! మన మధ్యన మరొకరెందుకని అలా అన్నాను !'' శ్రీనివాస్ తడబాటుని సర్దుకున్నాడు.

''నీకు లక్షసార్లు చెప్పాను ! నీ బుద్ధి మార్చుకోకపోతే జైల్లో వేయిస్తానని !'' రేఖ బెదిరిస్తోంది.

''నువ్వు నన్ను జైల్లో వేయించలేవు డియర్ !''

''నా కలాంటి పిరికితనం లేదు శ్రీనివాస్ ! నాకు కోపంవస్తే 'నా' 'నీ' అన్న భేదం కన్పించదు ! ఊసరవెల్లిలా రంగులు మార్చుకునే వాళ్ళంటే నాకు వళ్ళు మంట !'' రేఖకి కోపం వచ్చిందని గ్రహించాడు. కానీ ఎందుకో తెలియ లేదతనికి ! ఎంతో ఆలోచించాడు. 'ఈ రేఖ అర్థంగాదు' అని గొణిగాడు చివరలో.

''ఆషా యిప్పుడే విరిసిన గులాబీ పువ్వు ! కానీ దానిచుట్టూ ముళ్ళున్నాయి ! నాలాగా గాలిలో పెట్టిన దీపం గాదని గుర్తుంచుకో !'' రేఖకి ఇంకా కోపం తగ్గనందుకు అతనికి ఆశ్చర్యం వేసింది. కానీ ఆషా సౌందర్యం అతని మనస్సుని నిషాలా చుట్టేస్తోంది.

''అందాన్ని గుర్తించి మెచ్చుకోవడం కూడా ఓ కళే రేఖా ! ఐ లైక్ హర్ బ్యూటీ !''

''స్టుపిడ్! నీలో కళాత్మకమైన వూహాలా! నేన్నమ్మను– నీలాంటి వాళ్ళకి 'కళ' అందదు ! జంతువుల కోవకి చెందిన మనుషులకి కళ అర్థంగాదు !''

''ఎందుకింత కోపం నాపైన ?''

''నీ కెందుకింత వ్యామోహం ఆడ వాళ్ళంటే ?''

శ్రీనివాస్ కంగారు పడ్డాడీసారి ! వెంటనే సమాధానం చెప్పలేక పోయాడు. ఎప్పటికో అన్నాడు.

''నాకు నీ తర్వాతే ఎవరైనా !''

''నాకు తెలుసు ! నీకు నా తరువాత చాలా మందున్నారని ! అంతేగాదు ! నీ కింతకుముందు కూడా చాలా మంది ఆడపిల్లలతో స్నేహ సంబంధాలున్నాయని కూడా గుర్తుంది !''

''ఆఫీసరన్న తరువాత అలాంటి స్నేహాలు తప్పవు రేఖా !''


''కానీ మనిషికి శీలం ముఖ్యం అని తెలుసుకున్న ఆఫీసరుకి అలాంటి స్నేహాలుండవు మిస్టర్ శ్రీనివాస్ !''


''సరే ! ఒప్పుకుంటున్నాన్లే డియర్ ! నీ భయం నా కర్థమైంది! నేను నిన్ను పోగొట్టుకో లేను ! అంత ధైర్యం నాకు లేదసలు! నాకు...''


''నీ గురించి చెప్పకిక !'' రేఖ లేచి నిలబడింది. అతడిని వెళ్ళిపొమ్మని శాసించింది. నిశ్చేష్టుడయ్యాడతడు. అతనితో మరో మాట మాట్లాడకుండా లేచి వెళ్ళిపోయింది.

(ఇంకా వుంది)






విజంస్
Vijay
A seal for quality
Vijay
అసోసియేటెడ్ మార్కెటింగ్ ఏజన్సీస్,
4-4-340/బి, బ్యాంక్ స్ట్రీట్. హైదరాబాదు-500 001.
ఫోన్: 58142/45895



మోహన్‌బాబు, శారద, శ్రీవల్లి 'కాళయముడు'లో



'పోలీసు వెంకటస్వామి'

'మేమెందుకు చిత్ర నిర్మాణ రంగంలో ప్రవేశించాం ?"

'ఖైదీ" చిత్ర నిర్మాత వివరణ

''ఎంతో కాలంగా పలు చిత్రాలకు ఫైనాన్షియర్స్‌గా ఆర్థిక సహకారాన్ని ఎందరో నిర్మాతలకు అందజేశాం. క్రమక్రమంగా పరిస్థితులు అస్తవ్యస్తంగా తయారై, పెట్టిన డబ్బు ఎప్పుడు తిరిగొస్తుందో తెలియని అయోమయ స్థితి ఏర్పడింది. దాంతో మేమే ఎందుకు చిత్ర నిర్మాణానికి పూనుకోకూడదు — అన్న తలంపు కలిగింది. వెంటనే రంగంలోకి దూకాం. మొట్టమొదట మా 'సంయుక్త మూవీస్' బానర్‌ను బాగా ఎస్టాబ్లిష్ చేసుకోవాలి. అందుకు చక్కని కథ ప్రధానం. ఆ తర్వాత నిర్మాతల కష్టసుఖాలు తెలిసి, మా ఆశయానికి తగ్గ డైరెక్టర్ దొరకాలి. అదృష్టవశాత్తు అన్నీ మేమనుకున్నట్లే సమకూరాయి. చిరంజీవికిది కాస్ట్లీ పిక్చర్. తతిమ్మా నటీనటులూ, సాంకేతిక నిపుణులూ అందరూ కూడా ఒక చక్కని చిత్రాన్ని రూపొందించాలనే తపనతో మాతో ఎంతో సహకరించారు. ఎంత డబ్బు ఖర్చయినా వెనుకాడక క్వాలిటీమీదే దృష్టి నిలిపాం. శక్తివంచన లేకుండా చేసిన మా కృషికి అశేష ప్రజాదరణ తప్పక లభించి తీరుతుందని రషస్ చూసినప్పుడు మాకు అనిపించింది. ఇలా ప్రతి చిత్రం వెరైటీగా ఉండేలా ఏడాదికి కనీసం రెండు చిత్రాలయినా తీయాలని మా సంకల్పం. మా తదుపరి చిత్రాన్ని మరింత భారీగా మల్టీ స్టారర్ పిక్చర్‌గా తీయాలని ప్లాన్ చేస్తున్నాం. దీనికి కూడా కోదండరామిరెడ్డిగారే దర్శకుడు,'' అని ''ఖైదీ'' చిత్రాన్ని సమర్పించే డాక్టర్ తిరుపతిరెడ్డి తెలియజేశారు.

ఇష్టాగోష్టిలో డైరెక్టర్ ఎ. కోదండరామిరెడ్డి ''ఇది ఫక్తు క్రయిమ్ చిత్రం కాదు. ఎన్నో మలుపుల గల రసవత్తరమైన కథ. మంచి సెంటిమెంట్ కూడా ఉంది,'' అన్నారు.

కవిత 'చండీ – చాముండీ'లో




సినిమా

జయసుధ, విజయ





నరి, అల్లు రామలింగయ్య



'దేవి – శ్రీదేవి'లో మురళీమోహన్, రాధిక

విశేషాలు

-జి. వి. జి.

ంతి 'ధర్మాత్ముడు'లో



ఇతివృత్తం గురించి రచయితలు పరుచూరి సోదరులు టూకీగా చెప్తూ, "ఖైదీ – అంటే నేరం చేసిన మనిషనే కాదు. ప్రతి వ్యక్తీ ఎప్పుడూ ఏదో ఒక వలయానికి బందీ అవుతాడు. పుట్టబోయే ముందు తల్లి గర్భంలో నవమాసాల బందీ అయితే, చిట్టచివరన స్మశానానికి తీసుకెళ్ళ బోయేముందు రెండు కాళ్ళు బొటనవేళ్ళూ కట్టేస్తారు. ఇలా జీవితంలో ఎందరో ఎన్నోసార్లు ఎన్నోవిధాల బందీలు అవుతూంటారు. ఒక్క ముక్కలో మేం చెప్పిన ఈ కథాంశం వెనుక ఎంతో సస్పెన్స్ ఉంది," అన్నారు.

చివరన నిర్మాత కె. ధనుంజయరెడ్డి "ఆఖరి షెడ్యూల్ చిత్తూరు దగ్గర తలకోనలో జరిగింది. నాగిన్ – బాణీ పాటొకటి మా పిక్చర్‌లో హైలైట్ అనుకుంటున్నాము. సెప్టెంబర్‌లో డబ్బింగ్, రీరికార్డింగ్ పూర్తిచేసి, విజయదశమినాడు విడుదల చేస్తాం," అన్నారు.


ఈ చిత్రంలో తెరముందు చిరంజీవి, మాధవి, రంగనాథ్, రావు గోపాలరావు, నూతన్‌ప్రసాద్, శివప్రసాద్, రాళ్ళపల్లి, వేలు, సుమలత, సంగీత, నవనటి సంయుక్త – తెరవెనుక పరుచూరి సోదరులు, వేటూరి, చక్రవర్తి, వి. ఎస్. ఆర్. స్వామి. భాస్కరరాజు, కె. వెంకటేశ్వరరావు, ధర్మరాజు, రాధారెడ్డి, ఎ. కోదండరామిరెడి కృషి చేశారు.


"రాణి మాలినీదేవి"

"టైటిల్‌రోల్ జయసుధ నిర్వహిస్తుంది. అక్టోబర్, నవంబర్‌లలో షూటింగ్ ప్లాన్ చేశాం," అన్నారు దాసరి నారాయణరావు. ఈయన స్క్రీన్‌ప్లే, మాటలు సమకూర్చి, ట

కీలకపాత్ర నిర్వహిస్తూ తారకప్రభు పతాకంలో నిర్మించే పై చిత్రానికి ఈయన శిష్యుడు రమణబాబు దర్శకుడు. సుజాత, శరత్‌బాబు, నూతన్‌ప్రసాద్, గొల్లపూడి, అల్లు రామలింగయ్య, సూర్యకాంతం ఇతర ముఖ్య పాత్రలు. దాసరి పద్మ సమర్పించే ఈ చిత్రానికి గొల్లపూడి కథకుడు.

'ఖైదీ' చిరంజీవి





'ఖైదీ'లో చిరంజీవి, మాధవి

కృష్ణంరాజుతో జి. ఆర్. కె. రాజు చిత్రం

"మక్కైయూర్ మకుటియాన్ — అనే తమిళ చిత్రం సూపర్‌హిట్ అని తెలిసి చూశాను. వెంటనే రైట్స్ కొనేశాను. ఆ తమిళ చిత్రాన్ని డైరెక్టు చేసిన రాజశేఖర్‌నే బుక్ చేశాను," అన్నారు నిర్మాత జి. ఆర్. కె. రాజు. ఈయన ఆగస్టు 10న షూటింగ్ ప్రారంభించిన విశ్వచిత్ర సినీ ఎంటర్ ప్రైసెస్ తాజా చిత్రంలో కృష్ణంరాజు, రాధిక, శరత్ బాబు, సత్యనారాయణ, ప్రభ, నూతన్ ప్రసాద్, అల్లు రామలింగయ్య, నరసింహరాజు, జయమాలిని, స్మిత, ప్రసాద్ బాబు పాల్గొంటున్నారు. సత్యానంద్ సంభాషణలు, చక్రవర్తి సంగీతం, కుదరవల్లి నాగేశ్వరరావు శిల్పం, రంగా ఛాయ, వెంకటరత్నం కూర్పు, చక్రవర్తి సహాదర్శకత్వం, రాజా సహ కార దర్శకత్వంలో నాగేశ్వరరావు నిర్వహణ బాధ్యతలు వహిస్తున్నారు. "పాటలను ఊటీలో అక్టోబర్‌లో పిక్చరైజ్ చేస్తాం," అని నిర్మాత తెలియజేశారు.

సినిమా విశేషాలు

-జి. వి. జి.

ఎ. కోదండరామిరెడ్డి దర్శకత్వంలో

"చిరంజీవి సరసన రాధ తొలిసారిగా నాయికగా నటిస్తుంది," అన్నారు ఎ. కోదండరామిరెడ్డి. ఈయన దర్శకత్వం వెహిస్తే శ్రీ రాజ్యలక్ష్మి ఆర్ట్ పిక్చర్స్ కొత్త చిత్రంలో సత్యనారాయణ, రావుగోపాలరావు, అల్లు రామలింగయ్య, వేలు, వీరభద్రరావు ఆదిగాగల వారు పాల్గొంటారు. సత్యానంద్ సంభాషణలు,

మిద్దె రామారావు కొత్త చిత్రం

చక్రవర్తి సంగీతం, వెంకట్ ఛాయ, సాయికుమార్ శిల్పం, డి. వెంకటరత్నం కూర్పు, ఎస్. వెంకటేశ్వరరావు ప్రొడక్షన్, శరత్ సహ దర్శకత్వంతో కె. ఎల్. ఎస్. శాస్త్రి నిర్మాణ సారథి. "సెప్టెంబర్ 18 నుండి 25, అక్టోబర్ 20 నుండి నవంబర్ 10 వరకు జరిగే రెండు షెడ్యూల్స్‌తో షూటింగ్ పూర్తయిపోతుంది," అన్నారు నిర్మాత మిద్దె రామారావు.



'కాలయముడు'లో శ్రీపల్లవి



నరేష్, పూర్ణిమ 'అగ్ని సమాధి'లో

"రైలు దోపిడి"

''దాదాపు 170 చిత్రాలకు కథలను సమకూర్చిన ప్రముఖ తమిళ రచయిత వియత్నాం వీడు సుందరం మాకు యాక్షన్‌తోపాటు సెంటిమెంట్‌ను మేళవించిన రసవత్తరమైన కథను ఇచ్చారు,'' అన్నారు పాత్రికేయుడు గోటేటి శ్రీరామారావు. ఈయన సమర్పించే గోటేటి ప్రొడక్షన్స్‌వారి పై చిత్రం షూటింగ్ ఆగస్టు 19న ప్రారంభమై 28వ తేదీ వరకు మొదటి షెడ్యూల్ జరిగింది. ప్రభ, భానుచందర్, విజయలలిత, జీవా, మోదుకూరి సత్యం ప్రభృతులు పాల్గొంటున్నారు. పేరాల సంభాషణలు, ఎ. ఎ. రాజ్ సంగీతం, రంగా ఛాయ, బి. చలం శిల్పం, నాయుని మహేశ్వరరావు కూర్పు, ఎస్. పి. రంగారావు సహకారదర్శకత్వం, జి. వి. రావు నిర్మాణ సారథ్యంలో జి. సత్యవతి, జి. నారాయణరావు నిర్మాతలు. ''సెప్టెంబర్ 1 నుంచి 15 వరకు రెండవ షెడ్యూల్, అక్టోబర్‌లో చివరి షెడ్యూల్ జరుగుతాయి,'' అని స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు వహించే కె. ఎస్. రెడ్డి తెలిపారు.

విడుదలకు సిద్ధమవుతోన్న "ధర్మాత్ముడు"

'పూర్వార్థ భాగంలో రెబల్ హీరోగా కనిపించే కృష్ణంరాజు, ద్వితీయార్థంలో వలచి వలపించుకున్న ప్రియుడుగా, ఓ ఆడపిల్ల తండ్రిగా, సంఘంలో పరువు ప్రతిష్ట, బరువు బాధ్యతలున్న పెద్దమనిషిగా ఎంతో గంభీరంగా కనిపిస్తారు. అలాగే నాయిక జయసుధ ప్రథమార్థంలో కలలుగనే కన్నెపిల్లగా, తర్వాత మంచి మనసున్న మనిషికి మనసిచ్చి, అతనికి అర్ధాంగి అయి, ఏ బరువూ బాధ్యతలూ లేకుండా తిరిగే అతన్ని ఓ ప్రయోజకుడిగా, ఓ సంస్థ అధినేతగా, సంఘంలో పెద్దమనిషిగా ఎదగడానికి స్ఫూర్తిగా, ఓ ఆడపిల్లకు తల్లిగా, తన కళ్లెదుటే అల్లుడు తన కూతుర్ని హింసిస్తూ— భర్తను అవమానిస్తుంటే చూసి భరించలేని ఆడదిగా ఒక సరికొత్త పాత్రలో కనిపిస్తుంది,'' అన్నారు సారథి. ఈ హాస్య నటుని సారథ్యంలో కథకుడు డా॥ ప్రభాకరరెడ్డి సమర్పించే శ్రీ భ్రమరాంబిక ఫిలిమ్స్ ''ధర్మాత్ముడు'' లో విజయశాంతి, గుమ్మడి, ప్రసాద్‌బాబు, రాజేష్, కాకినాడ శ్యామల, ప్రభాకరరెడ్డి ఇతర పాత్రధారులు. మద్దిపట్ల సూరి సంభాషణలు, గోపి గీతాలు, సత్యం సంగీతం, సత్తిబాబు ఛాయ, బి. ఎన్. కృష్ణ శిల్పంతో కోగంటి కేశవరావు నిర్మించిన ఈ చిత్రానికి బి. భాస్కరరావు స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు వహించారు.



భార్గవ్ ఆర్ట్ ప్రొడక్షన్ 'ముక్కు పుడక' నిర్మాత. శ్రీ ఎస్. గోపాలరెడ్డిని విజయవాడలో లక్ష్మీ ఫిలింస్‌వారు అభినందిస్తున్న దృశ్యం.

'మంత్రిగారి వియ్యంకుడు' సుధాకర్, పూర్ణిమాజయరామ్






''భోళాశంకరుడు''లో సుజాత. సుమలత

కృష్ణ హీరోగా "బంగారు కాపురం'

''సూపర్ స్టార్ కృష్ణ సరసన సూపర్ హీరోయిన్ జయసుధ, ఆలిండియా ఫేవ: హీరోయిన్ జయప్రద తొలిసారిగా నటిస్తున్నారు. ఇదివరకు 'ధైర్యవంతుడు' తీయాలనుకున్నాం ఇప్పుడు కథ మారింది. 'బంగారు కాపురం' అని పెట్టాం. జనవరి నుంచి షూటింగ్,' అన్నారు కోగంటి విశ్వేశ్వరరావు. ఈయన శ్రీ పంచవటి చిత్రాలయ బానర్‌లో నిర్మించే చిత్రానికి పి. చంద్రశేఖరరెడ్డి కథ, స్క్రీన్‌ప్లే సమకూర్చి, దర్శకత్వం వహిస్తారు. సత్యానంద్ జె. వి. రామవులు, లక్ష్మణ్‌గోరే, మన్నె రాధాకృష్ణ, కె. రామసూరి ప్రభృత సాంకేతిక వర్గం.



కృష్ణ సమర్పించే "రక్తసంబంధం"

''సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్‌లలో ప్రతినెలా 21 వ తేదీ నుంచి 30 వ తేదీవరకు షూటింగ్. దీంతో చిత్రం పూర్తయిపోతుంది,'' అన్నారు విజయనిర్మల, ఈమె దర్శకత్వంలో కృష్ణ ప్రధాన పాత్ర ధరిస్తూ, సమర్పించే రవికళామందిర్ వారి పై చిత్రంలో రాధ, జయంతి, సత్యనారాయణ, గిరిబాబు, సుదర్శన్, వేలు, వీరభద్రరావు ఇతర ముఖ్య భూమికలు నిర్వహిస్తారు. సత్యానంద్, చక్రవర్తి, వి. ఎస్. ఆర్. స్వామి, ఆదుర్తి హరనాథ్, ఆర్. పద్మనాభం ప్రభృత సాంకేతిక వర్గంతో ఎం.ఎస్. సాయిప్రసాద్, ఎ. భాస్కర్ నిర్మాతలు.

"రారాజు"గా కృష్ణంరాజు

''మదుమలై అడవుల్లో సెప్టెంబర్, నెలల్లో చివరి రెండు షెడ్యూల్స్ జరుగుతాయి,'' అన్నారు వడ్డే శోభనాద్రి. ఈయువ నిర్మాతగా వడ్డే కిశోర్ సమర్పించే విజయ మాధవి పిక్చర్స్ ''రారాజు'' చిత్రం తొలి షెడ్యూల్ ఆగస్టు 18 నుంచి 31 వరకు మద్రాసులో జరిగింది. కృష్ణంరాజు సరసన శ్రీ పల్లవి నాయిక. శారద, జగ్గయ్య,ప్రభాకరరెడ్డి, రావుగోపాలరావు, నూతన్‌ప్రసాద్, శివకృష్ణ తక్కిన నటవర్గం. పరుచూరి సోదరులు, జె. వి. రాఘవులు, ఎస్. వెంకటరత్నం, భాస్కరరాజు, జి. జి. కృష్ణారావు ప్రభృత సాంకేతికవర్గంతో వడ్డే రమేష్ నిర్వహణలో తయారయ్యే ఈ చిత్రానికి జి. రామ మోహనరావు దర్శకుడు.



రంగనాథ్, మోహన్‌బాబు 'నాంపల్లి నాగు'

" చిన్నికృష్ణుడు "


''పౌరాణిక చిత్రాన్ని సెప్టెంబర్ లో ప్రారంభిస్తున్నాను,'' అన్నారు భానోదయా ఫిలింస్ అధినేత మాధవయ్య. శరత్ బాబు, గుమ్మడి, రమాప్రభ ఆదిగాగలవారు పాల్గొనే ''చిన్నకృష్ణుడు''చిత్రానికి సముద్రాల మాటలు, ఆత్రేయ పాటలు రాస్తున్నారు. సత్యం సంగీతం, భాస్కరరావు ఛాయ, సి. హెచ్. ఇ. ప్రసాద్, ప్రకాశరావు శిల్పం నిర్వహిస్తారు. శ్రీనివాస్ దర్శకుడు.



సినిమా

"దోపిడి దొంగలు"

"ముప్ఫై ఏళ్ళకు పైగా మాడరన్ థియేటర్స్ వగైరా ప్రముఖ తమిళ సంస్థలకు కథలు సమకూరుస్తున్న సుప్రసిద్ధ తమిళ రచయిత ఎ. ఎల్. నారాయణన్ రాసిన అత్యద్భుతమైన కథ ఆధారంగా కాశీ విశ్వనాధ్ సంభాషణలు రాశారు," అన్నారు ఎస్. ఎస్. మూవిటోన్ పతాకంపై చిత్రాన్ని నిర్మించే డి. అప్పారావు. ఆగస్టు 19న పాటలరికార్డింగ్‌తో ప్రారంభోత్సవం జరిగింది. మురళీమోహన్, నూతన్‌ప్రసాద్. పద్మనాభం, నాగేష్, రావి కొండలరావు, రాళ్ళపల్లి, మాడా, సారధి, చిట్టిబాబు, సత్తిబాబు, రాధిక, ఝాన్సి, మమత, నవనటులు సత్యనారాయణ, ఎన్. చంద్ర, భానుచందర్ పాత్రధారులు. రాజన్ — నాగేంద్ర స్వరకల్పనలో వేటూరి గీతాలు రాశారు. బి. జనార్ధనరావు ఛాయ, ఎస్. దిలీప్‌సింగ్ శిల్పం, కె. గోవిందస్వామి కూర్పు, వి. ప్రభాకర్ నిర్వహణ. సతీష్ సహకార దర్శకత్వంతో దొడ్డి సూర్యకుమారి, కొండ్రోతు బంగారయ్య సమర్పించే ఈ చిత్రానికి శాంతి వెంకటేశ్వరరావు స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు వహిస్తున్నారు.



జగ్గయ్య, శోభన్‌బాబు 'జగన్'లో

కె. ఎస్. రామిరెడ్డి దర్శకత్వంలో ఎస్. కృష్ణంరాజు చిత్రం "జడగంటలు"

"అమెరికా వెళ్ళిన ఓ భారతీయ యువకుడు అక్కడి పాశ్చాత్య ప్రభావం తన మీద పడకుండా స్వదేశానికి తిరిగి వస్తాడు. పల్లెటూరిలో పెరిగిన ఓ యువతి విదేశీ నాగరికతకు అలవడిపోతుంది. దీంతో దంపతులైన వీరిరువురూ ఉత్తర దక్షిణ ధ్రువాలవుతారు. ఆడంబరంగా జీవిస్తూ పరిధికి మించకుండా ఆలోచించడమా, నిరాడంబరంగా జీవిస్తూ ఉన్నతంగా ఆలోచించడమా? ఈ విశిష్టమైన ఇతివృత్తంతో వెలిచెర్ల సత్యనారాయణగారు రాసిన మినీ కథ నన్నెంతో ఆకర్షించింది. ఆ మినీ కథకు నేను సినీ కథను తయారు చేశాను. తొలుత ఫస్ట్ షెడ్యూల్‌ను గోదావరీ తీర ప్రాంతాలలో ప్లాన్ చేశాం. మా యూనిట్ అంతా రాజమండ్రి చేరేసరికి కుంభవృష్టి వల్ల వరదలు... విపరీతంగా ఖర్చయినా అందరం సురక్షితంగా తిరిగి వచ్చేశాం. సిటీ బాక్‌గ్రౌండ్‌లో చిత్రీకరించాల్సిన సన్నివేశాలన్నీ మద్రాసులో తీసేశాక, అటుపైన విలేజ్ బాక్‌గ్రౌండ్‌లో తీయాల్సిన సన్నివేశాలు తాపీగా గోదావరి ప్రాంతంలోనే షూట్ చేస్తాం," అన్నారు నవత ఆర్ట్స్ పతాకంలో "జడగంటలు" చిత్రాన్ని నిర్మిస్తున్న ఎస్. కృష్ణంరాజు. సురేష్, విజయశాంతి, రంగనాథ్, శుభలేఖ సుధాకర్, రాళ్ళపల్లి, హేమసుందర్, వేలు, మదన్‌మోహన్, అప్పారావు, సుత్తిబాబు, ప్రభ, అన్నపూర్ణ, తాతినేని రాజేశ్వరి, లలిత పాల్గొంటున్నారు. రాజశ్రీ సంభాషణలకర్త. వేటూరి గీతాలకు పుహళేంది స్వరకల్పన చేశారు. ఆర్. కె. రాజు ఛాయ, సూరపనేని కళాధర్ శిల్పం, గౌతంరాజు కూర్పు, శివసుబ్రహ్మణ్యం నృత్యాలతో కె. ఎస్. రామిరెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి ఎస్. అచ్యుతరామరాజు నిర్మాణ సారధి.

'చండీ—చాముండి'లో విజయలలిత



'లంకె బిందెలు'లో





శివకృష్ణ, రాజేశ్వరి 'నేటి భారతం'లో

తెలుగు డైరెక్టర్ల హిందీ చిత్రాలు

★ దాసరి నారాయణరావు : దిలీప్‌కుమార్‌తో ''ఎం. ఎల్. ఎ. ఏడుకొండలు'', రాజేష్‌ఖన్నా, జయసుధ, జయప్రదలతో ''మేఘ సందేశం'', దిలీప్‌కుమార్, సంజీవ్‌కుమార్‌లతో ''బహాదూరావు బాటసారి'' చిత్రాలు తయారవుతాయి.

★ విజయనిర్మల : జితేంద్రతో ''అమాయకుడు కాదు అసాధ్యుడు'' చిత్రాన్ని శశిరేఖా మూవీస్‌వారు హిందీలో నిర్మిస్తారు. సంగీతం : బప్పీలహరి.

★ పి. సాంబశివరావు : సంజయ్ హీరోగా ''ఎర్రమల్లెలు'' చిత్రాన్ని హిందీలో డాక్టర్ టి. కె. ఎం. ఛటర్జీ నిర్మిస్తారు.

★ బాపు : జితేంద్ర, శ్రీదేవి, అమ్జాద్‌ఖాన్, కాదర్‌ఖాన్, దేవెన్‌వర్మలతో ''మంత్రిగారి వియ్యంకుడు'' చిత్రాన్ని ప్రశాంతి క్రియేషన్స్ అధినేత వి. వి. శాస్త్రి నిర్మిస్తారు. అక్టోబర్‌లో షూటింగ్ ప్రారంభమవుతుంది.

జయసుధ, వేలు



షూటింగ్ కేన్సిల్ అయితే?

సుహాసిని

''అమితాబ్, ఋషికపూర్, దిలీప్‌కుమార్‌లు నటించిన చిత్రాలేవైనా ప్రదర్శింపబడుతూంటే, థియేటర్‌లకు వెళ్లి చూస్తాను. లేదా, కొత్తగా వచ్చిన ఆంగ్ల నవలలు చదువుకుంటూంటాను.''

కె. ఆర్. విజయ

''అభిమానుల దగ్గర్నుంచి వచ్చే ఉత్తరాలకు స్వయంగా జవాబులిస్తూంటాను. ఆ పని అయిపోతే, నే చూడని తమిళ చిత్రాల ప్రింట్‌లు తెప్పించి, మా బంగళాలోని మినీ ఎ.సి. థియేటర్‌లో వేసి చూసుకుంటూంటాను.''

జయమాలిని

''దేవాలయాలకు వెళ్తూంటాను. ఎక్కువగా మాంగాడు అమ్మగారి కోవెలలో కనిపిస్తూంటాను. లేదా, ఇతర ఊళ్ళల్లో నాట్య ప్రదర్శనలు ఇస్తూంటాను.''

మాధవి

''బాగా రిలాక్స్ అవుతాను. ఆంగ్ల నవలలు చదివి, వాటిని మా ఇంట్లోని వారికి చెప్తూంటాను. ఒక్కోసారి హైదరాబాద్‌కు వెళ్తూన్నూంటాను కూడా.''

సులక్షణ

''మా అంటే నడిపే డాన్స్ స్కూల్‌లో కూచిపూడి నృత్యం నేర్పిస్తూంటాను. ఒక్కోసారి పాత సినిమా సాంగ్ సీక్వెన్స్‌లను విడియోలో వేసి చూసుకుంటూంటాను.''

స్వప్న

''మా తమ్ముడికి హోమ్ వర్క్ చేసి పెడుతూ, పాఠాలు నేర్పిస్తూంటాను. వాడి బట్టలకు ఇస్త్రీ చేస్తూంటాను. మరీ బోర్ కొడితే, స్నేహితురాండ్రను పిలిపించుకొని, వాళ్ళతో కబుర్లు చెబుతూ, కాలక్షేపం చేస్తాను.''

సుమలత

''ఏదో కోరికను మనసులో అనుకొని, అది నెరవేరాలని గుడి ప్రాకారాలు చుడ్తూంటాను. అభిమానుల దగ్గర్నుంచి వచ్చే ఉత్తరాలకు జవాబులు రాస్తూంటాను.''

సిల్క్ స్మిత

''ఇంటి పనులలో అమ్మకు సాయపడుతూంటాను. పూలమొక్కలకు నీళ్ళు పోయడమంటే నాకెంతో ఆనందం. శ్రీప్రియ నాకు ప్రీతితో ఇచ్చిన పామేరియన్ కుక్కతో ఆడుకుంటూంటాను.''

"దొంగల రాజ్యం"

''కథానాయకుడు — చిత్రం తర్వాత రచయిత భమిడిపాటి రాధాకృష్ణ, నేను కలిసి ఈ సోషల్ సెటైర్ చిత్రానికి పని చేస్తున్నాం,'' అన్నారు. కథకుడు, దర్శక నిర్మాత కె. హేమాంబరధరరావు. నవంబర్‌లో షూటింగ్ ప్రారంభమయ్యే నవీన్ ఆర్ట్ ప్రొడక్షన్స్ ''దొంగల రాజ్యం'' చిత్రంలో మాదాల రంగారావు ప్రధాన పాత్రధారి. చక్రవర్తి సంగీత దర్శకుడు. ఆర్. రామారావు ఛాయాగ్రాహకుడు. ★

మధ్యతరగతి మరో మందహాసం

పాలగిరి వేణు

స్టేషన్లో రైలాగింది ...

కోలాహలంగా జనం ... ఎక్కడాలు... దిగడాలు...కదలికలూను. ఆ 'కంపార్ట్మెంట్' లోంచి, ప్లాట్ఫారమ్మీద రెండు చేతుల్లోను బరువులతో దిగేసరికి సగం ప్రాణం పోయినట్లయింది. ఒక చేతిలో తాటాకుబుట్ట అందులో అత్తగారు ఎంతో ఆప్యాయతగా యిచ్చిన ఆవకాయ జాడి, ఇంకో చేతిలో సంచి అందులో మా అమ్మగారు అనురాగంతో పంపిన మినప సున్నుండలు ప్లస్ తదితర నా సామాన్లూను... రెండూ బరువుగానే వున్నాయి ... ఆప్యాయత అనురాగం కల్పివున్నాయి మరి.

బ్రిడ్జి దాటి టికెట్ కలెక్టరు చేతిలో టికెట్ వుంచి స్టేషన్లోంచి బయట పడ్డాను.

రిక్షావాళ్ల, ఆటోవాళ్ల నన్ను చుట్టేశారు ఊపిరి సలపనీయడంలేదు.

"అయ్యా!"

"బాబూ!"

"సార్!!!" ఎక్కడికెళ్ళాలంటూ గోల చేసేస్తున్నారు, సామాన్లు అందుకొని, కొంచెం ముందుకు నడిచాను ... అక్కడయితే కిరాయి ఎక్కువ అడుగుతారు ... అందుకని! అయినా ఒకరు నా వెంటబడ్డారు. ఒవిరిగడ్డాన్ని బరుకుతున్నాడు నొసటన విబూధి మధ్యలో ఎర్రటి కుంకుమబొట్టు అయినా నోట్లో చుట్ట వెలుగుతోందీ.

"ఎక్కడికెళ్ళాలండీ పంతులుగారూ ..."

"గాంధీనగరం మూడో రోడ్డు... నాకేం రిక్షావద్దు...నడవగలను...

"భలేవారండీ! చేతుల్లో అంత బరువుంచుకుని నడవగలరటండీ ... ఓ రెండు రూపాయలివ్వండి చాలు ... రెండు నిముషాల్లో ఇంటిదగ్గర చేరుస్తాను."

అమ్మో! రెండు రూపాయలే!! ఓపూట కూరలు గడుస్తాయి ... ఓ రోజుకు పాలు ... పెరుగు...ఊహూ! మధ్యతరగతి... అందులోను సామాన్యుని 'బడ్జెట్' సణుగుడు...లాభంలేదు... అయినా ఎన్నిసార్లు స్టేషన్నుండి యింటికి నడవలేదు? కాని యీసారి చేతుల్లో బరువెక్కువుంది మరి...అందులోను ఎండ మరింతవిరగకాస్తోంది.

"పోనీ! ఓ రూపాయిస్తా!" తెగించి అడిగాను.

నిరసనగా నావైపు చూశాడు.

"ఇంకో అర్ధరూపాయి వేసుకోండి"

లాభం లేదన్నట్లు సామాన్లు చేతుల్లోకి తీసుకుని ముందుకు నడిచాను ... ఎండకు కాగిన "తారురోడ్డు" సలసల మంటోంది.

"పావలా."

"ఊ హూ!" అంటూ నడుస్తూనే వున్నాను ... పది నిముషాల నడకతో యిల్లు చేరుకోవచ్చు.

రిక్షావాడు వచ్చేవాడేమో గాని యింతలో యింకో శాల్తి తగిలింది. 'నీట్'గా వున్నాడు ... చేతిలో అందమైన "బ్రీఫ్‌కేస్"... గాంధీనగరం సెంటర్ కన్నాడు. రిక్షావాడు మూడురూపాయలన్నాడు ... "ఓకే!" అంటూ భుజాలెగరేస్తూ రిక్షాలో కూచున్నాడు ... గజ్జెల చప్పుడు చేసుకుంటూ రిక్షా కదిలింది ... పోనీలే! అదృష్టవంతుడు...నాసిరకం బేరం తప్పింది... వెళ్ళేటప్పుడు రిక్షావాడు నన్నుచూసిన చూపు మాత్రల కొంచెం బాధాకరంగా వుంది...

ఇంతలో యింకో రిక్షా...

"గాంధీనగరం మూడో రోడ్డు ... ఒక్క రూపాయిస్తా...వస్తే...రా!... లేకపోతే..."

"వెళ్ళు!" నంటూ యింకో మాటకు అవకాశం యివ్వకుండా పారిపోయాడు ఆ రిక్షావాడు. నడుస్తున్నాను ... ఏకధాటిగా ... ఇల్లు చేరుకోవడమే ఏకైకగమ్యం. ఎండ దంచేస్తోంది. మధ్యాహ్నం రెండు గంటలు. వేడిగాలి...ఒళ్ళంతా చెమట పోస్తోంది. 'రోడ్డు' నిర్మానుష్యంగా వుంది. పది అడుగులేసేసరికి కొంచెం చేతులు లాగినట్లాయ్యాయి. రోడ్డు ప్రక్కన నిలబడి సంచి, బుట్ట నేలమీద ఆన్చి...రెండే రెండు నిముషాలు ... విశ్రాంతి ...; మళ్ళీ నడక ... చేతుల్లోకి బరువు మార్చి ...ఇంకో అరఫర్లాంగు నడిచాను ... చేతులు బాగా లాగుతున్నాయి. జబ్బలు మరీను. ఒళ్ళంతా తడిసిపోతోంది చెమటతో...అయినా యింకెంత దూరముందని... గాంధీనగర్ సెంటర్ దాటితే మూడో మలుపు... అనవసరంగా రూపాయి ఖర్చయ్యేది. ఆ రూపాయకు పావుకిలో వంకాయలొచ్చేవి...లేపోతే అరకెజీ పుచ్చు బెండకాయలొచ్చేవి. రూపాయి ఖర్చుకాకుండా బిగ్గట్టేశాను...అదేంటి! ...దాహమవుతుంది. నాలిక పిడచగట్టుకపోతోంది ... గొంతుక ఎండిపోయింది. అడుగు ముందుకు వేయలేకపోయాను ... అలసిపోయినట్లనిపించింది.

ఓ అబ్బాయి 'సోడా బండి' తోసుకుంటూ వస్తున్నాడు ... బండి దగ్గరకొచ్చింది,

"ఓ సోడా!" అంతకన్నా గొంతులోంచి బయటకు వూడిపడలేదు.

"మామూలు సోడాలేదు ... నిమ్మకాయ సోడావుంది. యిమ్మంటారా?"

ఇమ్మని సైగచేశాను. సీసాలో గ్యాసున్నట్లు లేదు. అయినా కొట్టేటప్పుడు మాత్రం పెద్ద చప్పుడు చేయించాడు ఆ సోడా కుర్రాడు. సోడా... జిగురుగా ... అసహ్యంగా ... నోరంతా చేదుగా వుంది. నిమ్మకాయ బదులు ... 'సిట్రిక్ ఆసిడ్' వాడుండాలి.

"అర్ధరూపాయివ్వండి ..."

"అదేంటి! ముప్పైయేగా ..."

"స్పెషల్ సోడాండి బాబూ! బరంపురం నిమ్మకాయల రసం ... ఏమనుకున్నారో! యింకోటి యియ్యమంటారటండీ!"

"నీళ్ళు మాత్రం కృష్ణవేనా! లేకపోతే గోదారినుండి తెప్పించావా?"

నేనడిగేది వాడికి అర్థం అయినట్లులేదు. నేను వద్దనక పోతే యింకో కాయ కొట్టేట్టుగా వున్నాడు. జేబులోంచి చిల్లర తీసిచ్చాను.

"అదేంటండీ! మళ్ళీ ముప్పై ఇచ్చారు. ఏభై పైసలు తగ్గదండీ ... బరంపురం నిమ్మకాయలండీ బాబూ ... ఇరవై పైసలివ్వండి. మాడు మండుతోంది."

తప్పలేదు. ఇరవై పైసలిచ్చాను. బండివాడు ఏదో హుషారుగా పాడుకుంటూ వేగంగా వెళ్ళిపోయాడు. ఈ సోడా దాహం తీర్చలేదు మరింత దాహం పెచ్చింది. శుభ్రంగా యింటికెళ్ళుంటే ఏ మజ్జిగతోనో దాహం తీరేది. అర్థరూపాయి మిగిలేది. మళ్ళీ నడక ... బరువుల మార్పు...కాగిన రోడ్డువేడి పైకి తంతోంది... ఓ గజ్జి కుక్క సిమెంటు పీపా ప్రక్కన కూలబడి నాలిక వేలాడేసి జొల్లు కారుస్తోంది. చెమటకు తడిసి, ఒంటికి అతుక్కుపోయింది. ప్యాంటు సంగతి చెప్పనవసరం లేదు ... అరచేతులు ఎర్రబారి వాతలు పడుతున్నాయి ... వెన్నుపూసలోంచి వేడి... తలమీదనుండి చెమటకారి నుదుటిమీదుగా జారి కళ్ళల్లో బడుతోంది. భుజంతోనే తుడుచుకున్నాను... ఇంకెంత దూరం? ఓ రెండు ఫర్లాంగులు... కాళ్ళు నరాలు కదులుతున్నట్లుంది... చేతులు మరీ నొప్పెట్టున్నాయి. దాహం... మళ్ళీ దాహం... నోరెండిపోతోంది... ఏదైనా రిక్షా వస్తే బావుణ్ణు... ఎంతో అంత పారేసి యిల్లు చేరుకోవచ్చు... అదిగో రిక్షా వచ్చేసింది... ఎక్కడి

కళ్ళలో చెప్పాను. ''రెండు రూపాయలివ్వండి...'' ఎంతో తాపీగా అడిగాడు... నాకు కోపం తన్నుకు వచ్చింది. ''వెళ్ళెళ్ళు'' అంటూ కసురుకున్నాను. రిక్షావాడు నామీద కోపంగా ''రిక్షా ఎక్కిన ముఖమేనా'' అన్నట్లూ చూస్తూ కదిలిపోయాడు. ఒక్కసారిగా అత్తగారిమీద, అమ్మమీద కోపం వువ్వెత్తున వచ్చింది. ఏంటో ఆవకాయ... మినప సున్నుండలు... యివి తినలేకపోతే చస్తామా ? ఏంటి ? ? మురిక్కాల్వలో గిరాటేసి పోతే బావుణ్ను...హాయిగా నడిచి వెళ్ళిపోవచ్చు... అయినా అత్తగారు ఎంతో ఆప్యాయతతో... అమ్మ ఎంతో అనురాగంతో... పోనీలే ! బరువయితే అయ్యింది.. ఇంకెంతసేపు... అదిగో కనపడేదే 'సెంటర్'... అది దాటితే మూడో మలుపు... మొగదాల్లోనే యిల్లు... అదేంటి దాహం... మళ్ళీ మొదలు... పిడచగట్టుకు పోతోంది నాలుక...తడి ఆరిపోయింది కంఠంలో... తూలి పడుతున్నట్లు అడుగులేస్తూ 'సెంటర్' చేరుకున్నాను. సెంటర్లో వున్న టీకొట్టు మూయబడివుంది. పక్కనే బడ్డీకొట్టు... ఎండలో వ్యాపారం లేక జోగుతున్నాడు కొట్లో వున్న ఓ ముసలతను.

''మంచినీళ్ళున్నాయా !''

నన్ను కళ్ళు తెరిచి చూశాడు ఆ కొట్టాయనే... మళ్ళీ మూసుకున్నాడు.

చిన్నగా దగ్గాను.

''ఇక్కడ మంచినీళ్ళుండవు... సోడాలుంటాయి'' అంటూ కళ్ళు తెరిచాడు.

''సోడా తాగుతాను... మంచినీళ్ళు కూడ తాగుతాను ''

''సోడాయే తాగు... మంచినీళ్ళు లేవు.''

''తప్పదా !''

''తప్పదు.''

''అయితే సోడాయిూయి...గ్యాసుండాలి...'' అంటూ కాళ్ళ సందున వుంచుకున్న పంచీని సరిచేసుకోవట కోసం కిందకు వంగాను.

''ఇదిగో... త్వరగా తాగు... గ్యాసు పోతుంది...'' అంటూ 'బిస్లెరీ సోడా' అందించాడు కొట్టుబాబు...

''ఇదేంటి ! నాకు గోలీ సోడా కావాలి...'' అంటూ తిరిగి సీసాను అతడికి యివ్వాయ బోయాను...

''అదేంటి ! 'ఓపెన్' చేసిన సీసాను నేనేం చేసుకోవాలి ?''

''నీ యిష్టం...''

''నా యిష్టమెలా అవుతుంది...—అయినా నీవు గోలి సోడా కావాలని అడగలేదుగా... సోడా యిమ్మన్నావ్ ? ఉన్న సోడా యిచ్చాను అంతే ! తాగేసేయి...లేపోతే ఝామ్మని గ్యాసుపోతుంది.''

''నాకొద్దు... గోలీ సోడాయే కావాలి ... ఈ సోడా నా ఒంటికి పడదు...''


''అదంతా నాకు తెలియదు... ఈ సోడా నీవు తాగాల్సిందే... మాంచి బేరమే !''

''మాంచి బేరం అవునో కాదో నాకు తెలియదుకాని ఈ సోడా మాత్రం నాకొద్దు...'' అంటూ సీసా బల్లమీద పెట్టేశాను. ''వద్దంటే ఎలాగండీ సామీ !'' అంటూ కొట్టుబాబు బాధ పడిపోతున్నాడు.

''పెద్ద రాద్ధాంతమెందుకండీ పంతులు గారూ ! సోడాకోసం...!! ఏదో గోలీసోడా అనుకునే తాగేయండి కళ్ళు మూసుకుని ... మీరు తాగకపోతే నాకిచ్చేయండి...నే తాగేస్తాను...కాని పైసలు మాత్రం మీరిచ్చుకోవాలి...'' అంటూ ఓ మధ్యవర్తి మీసాల్ని మెలేసుకుంటూ ముందు కొచ్చాడు...

''మంచిమాట చెప్పావ్ ! పోతురాజూ !'' అంటూ కొట్టుబాబు హుషారుగా నవ్వాడు.

వీడెవ్వడా పోతురాజు...? యమధర్మరాజు గారిలాగా... ! వేషం కూడా అలాగే వుంది. బలవంతాన్నైనా నాతో తాగించేసి, లేపోతే తనే తాగేసి డబ్బులు ముక్కుగుద్ది నా దగ్గర వసూలు చేసేలా వున్నాడు ...... ఆపసోపాలు పడుతూ సీసాను నోటిదగ్గరకు లాక్కొని గడగడతాగేశాను. ఒట్టి నీళ్ళలా వుంది. ఏలాంటి పొంగులేదు ... గ్యాసు...సీసాలోంచి మాయమయిపోయిన రాక్షసుడిలా వుంది. అవును పోట్లాటలో సరిపోయింది. లేకపోతే 'గ్యాసు' వుండేది ...డబ్బుకు తగ్గట్టు



మీ అభిప్రాయం చెప్పండి

తుఫానుల గూర్చి రేడియోలో చేయబడే హెచ్చరికలు మీరు వింటూనే ఉంటారు. తుఫాను బీభత్సం మీలో కొందరికి అనుభవంలోకి వచ్చి ఉంటుంది. మేము చేసే హెచ్చరికలు ప్రజలకు ఎంతవరకూ అవగాహన అవుతున్నాయో, ఎంతవరకూ ఉపయోగకరంగా ఉంటున్నాయో, వాటిని మెరుగుపర్చవలసిన అవసరమేమైనా ఉన్నదేమోనని తెలుసుకోవడం కోసం ఈ క్రింద యిచ్చిన ప్రశ్నావళి రూపొందించబడింది. దీనికి జవాబులిచ్చి మాతో సహకరించవలసిందిగా ఆంధ్ర ప్రజానీకాన్ని ముఖ్యంగా తీరప్రాంత ప్రజలను కోరుతున్నాము. జవాబులు ఒక కార్డుమీద వ్రాసి అక్టోబరు 5వ తేదీలోగా మాకు అందేటట్లు పంపవలెను. మీరు జవాబులు పంపవలసిన ఎడ్రస్సు : **A. V. R. K. RAO, N. H. A. C. Mausam Bhavan, Lodi Road, New Delhi-110003.**

మీ పేరు, వయస్సు, వృత్తి కూడ అందులో తెలుపవలెను. పేరు రాయడం యిష్టం లేనిచో మానివేయవచ్చును.

ప్రశ్నలు :

1. తుఫాను గూర్చి చేసే హెచ్చరికలు గూర్చి
   అ) మీరు స్వయంగా వింటారా ? ఆ) ఒకరిద్వారా తెలుసుకుంటారా ?
2. తుఫాను గూర్చి, రేడియోలో యివ్వబడిన మొదటి హెచ్చరిక గూర్చి తెలుసుకున్న తరువాత, మిగతా హెచ్చరికలు మీరు స్వయంగా వింటారా ?
   అ) అవును ఆ) కాదు
3. తుఫానువల్ల మీరుండే ప్రాంతానికి ప్రమాదం అని సూచించిన తదుపరి మీరు సురక్షిత స్థలానికి వెడతారా ?
   అ) అవును. ఆ) లేదు. ఉన్నచోటనే జాగ్రత్తలు తీసుకుంటాము.
4. మీరు తీరప్రాంతంలో ఉంటున్నట్లయితే, మీ ప్రాంతంలో సురక్షిత ప్రదేశాలు నిర్దేశించబడినవా ?
   అ) అవును. ఆ) లేదు.
5. ప్రస్తుతంలో చేస్తున్న హెచ్చరికలు మీకు సంతృప్తికరంగా ఉంటున్నవా ?
   అ) అవును. ఆ) లేదు.
   మీ జవాబు 'లేదు' అయినట్లయితే, మెరుగుపర్చడానికి మీ సూచనలేమైనా యివ్వండి క్లుప్తంగా.
6. మీరుండే ప్రదేశం వెళ్ళవలసివస్తే మీకు ఎంత ముందుగా హెచ్చరిక చేయాలి ?
7. రేడియో హెచ్చరికలు కాకుండా, మరే విధమైన పద్ధతులైనా మీ ప్రాంతంలో అమలులో ఉన్నవా ?
8. తుఫాను మీరుండే ప్రాంతంలో తీరాన్ని తాకేటట్లయితే మీరు తీసుకోవలసిన జాగ్రత్తల గూర్చి మీకు తెలుసునా ?
   అ) తెలుసు ఆ) పూర్తిగా తెలియవు. ఇ) తెలియవు.
9. ప్రతి తుఫాను సీజను ముందు, దానివల్ల కలిగే నష్టములు గూర్చి రేడియో ప్రసంగాల ద్వారాగాని, ఫిల్ముల ద్వారాగాని ప్రజలకు ఎరుకపరచడం అవసరమంటారా ?
   అ) అవును. ఆ) కాదు.
10. రేడియో హెచ్చరికలలో ఉపయోగించే పదములకు అర్థం మీకు పూర్తిగా అవగాహన అవుతోందా ?
    అ) అవును. ఆ) లేదు.

— ఎ. వి. ఆర్. కె. రావు

మధ్యతరగతి మందహాసం

తృప్తి వుండేది. రెండు రూపాయల నోటిస్తే కొట్టుబాబు ఎనభై పైసల చిల్లర పోశాడు నా చేతిలో. అవునూ! శుభ్రంగా ఓ రూపాయిన్నర రిక్షావాడి చేతిలో పెట్టుంటే యీపాటికి హాయిగా యింట్లో మా ఆవిడ, పిల్లలతో కాలం గడిపేవాణ్ణి. ఖర్మ! ... అనుభవించాలి...లేకపోతే! దాహం ... అందుకోసమై రూపాయి డభై పైసలు ఖర్చు ... ఇలా ఖర్చు పెడుతూపోతే బ్రతికి బాగుపడ్డట్టే...! ఖర్మకు తగ్గట్టు ఖర్చుతప్పదుమరి. మళ్ళీ నడక...మూడో మలుపు ఓ ఫర్లాంగుదూరంలో కన్పడుతోంది... ఇంకో మూడు నిమిషాల నడక ... ఇల్లు చేరుకున్నట్టే...నాలో ఉత్సాహం పెల్లుబుకుతోంది... చకచకనుని అడుగులేస్తున్నా ... అదేంటి కాళ్ళు తేలిపోతున్నాయి...జబ్బలు విపరీతంగానొప్పులు... సామాన్లు కింద పెట్టేశాను ... ఉన్నట్లుండి కణతన నరాలు చిట్లుతున్నట్లు ... ఇక బాధ భరించలేకుండా వున్నాను... కళ్ళు బైర్లు కమ్మి చుట్టూ చీకటలు పోతోంది ... గుండె చప్పుడు పెద్దదవుతూంది...మైకం కమ్ముతున్నట్లు నడి రోడ్డుమీదే తూలిపోతూంటే ఎవరో ఆసరా యిచ్చారు... రిక్షాలో కూచోబెట్టారు ... కళ్ళు మూసుకున్నాను బరువుగా ...

రిక్షా ఆగుతూనే కళ్ళు విప్పి చూశాను... మా వీధిలో వున్నాను ... రిక్షావాడు అదే బవిరి గడ్డం ... నొసటన విబూధి ... మధ్యలో రాలిపోతున్న ఎర్రటి కుంకుమ.

"ఇల్లెక్కడండి పంతులుగారూ..."

చూపించాను... రిక్షా నడిపిస్తూనే యిల్లు దగ్గర చేర్చాడు... మా పెద్దోడు "నాన్నారు వచ్చేశారు" అంటూ హుషారుగా రిక్షా దగ్గర కొచ్చి సంచిఅందుకుని యింట్లోకిపారిపోయాడు.

జేబుల్లోంచి రూపాయితీసి రిక్షాఅబ్బాయికి యివ్వబోయాను...అతను వద్దన్నాడు.

"వద్దండి పంతులుగారూ! ... మంచితీర్థమిప్పించండి చాలు."

"అదేంటి బాబూ! మీరు యింత దూరం నడవగాలేంది నా దెంతదూరం బాబూ! ఈ బారడంత దూరానికి డబ్బులు పుచ్చుకోవాలా!" అంటూ రిక్షాలోనే కూలబడ్డాడు.

మా ఆవిడకు చెప్పి మజ్జిగ తెప్పించి యిచ్చాను... తృప్తిగా తాగాడు... వస్తానంటూ వెళ్ళిపోయాడు.

"అదేంటండీ! స్టేషన్నుండి యింటికి రావటానికి రిక్షాలు కానాల్సి వచ్చిందటండీ! ఇక సంసారం యీదినట్లే !! అదిగాక రిక్షావాడికి మహారాజ మర్యాద లేమిటండీ! చోద్యం గాకపోతేను..." అంటూ సాగదీస్తుంటే మధ్యతరగతి మందహాసాన్ని విసిరి ... నిరసంగా కళ్ళు మూసుకున్నాను పడక కుర్చీలో కూలబడి. ★


చదువుల్రావు
బి.వి. సత్యమూర్తి
సుబ్బారావుగారూ మీరు కాలేజీకి అలా వేషం వేసుకున్నట్లు తయారయి వస్తారెందుకు?
ప్రత్యేకంగా కనిపించాల
మరి మీరో_ నారాయణరావు గారూ?
ప్రత్యేకంగా కనిపించాలని
సూర్యంగారూ_ మీరు?
అందరిలాను ప్రత్యేకంగా కనిపించాలని
రావుగారూ_ అంతాఇలా మారిపోతున్నారు కదా? మీరు మారలేదేం?
ప్రత్యేకంగా కనిపించాలని

కొత్తగొంతులు

— టి.యల్. కాంతారావు

హత్య చేయవలసిన కుష్టు
సంఘంతో
నడిరాత్రి కక్కుర్తి రతి జరిపే
వీళ్ళు
ఆయుధాలు పట్టలేరు ,
బారికేడ్లు కట్టలేరు
గ్రినేడ్లు విసరలేరు, గీతంలో
జ్వలించలేరు
కపితో స్వార్థం శిరస్సు
గంద్రగొడ్డలితో
నరక గల్గిన వాడే నేటి హీరో
ప్రజల గుండెల కొండల్లో
మాటుకాసి
ట్రిగర్ నొక్కగలిగినవాడే ద్రష్ట
ప్రజను సాయుధం చేస్తున్న
రివల్యూషనరీ నేడు కవి.

– శివసాగర్

1970 నుంచీ 80 దాకా ఈ దశాబ్ద కాలాన్ని కల్లోల నక్సల్‌బరీ దశాబ్దం అన్నారు వి ర. సం వారు. విప్లవ సాహిత్యం రెండు రకాలు. మొదటిది విప్లవ రంగంలో ఉంటూ అక్కడ పరిస్థితుల ప్రభావాలను అర్థం చేసుకుంటూ, ప్రజల సంస్కృతిని అవగాహన చేసుకుంటూ ప్రాక్టికల్‌గా రాసే కవిత్వం. రెండవది విప్లవం ఒక ఆశయంగా, విప్లవ సాధన ఒక లక్ష్యంగా రచన మేరకు మాత్రమే కట్టుబడి ఆ భావాన్ని ప్రజల్లో ప్రచారం చెయ్యటానికి కవిత్వం రాయటం. సుబ్బారావు పాణిగ్రాహి, శివసాగర్ లాంటివారు మొదటి రకం కవులు. శివసాగర్ అనేక పేర్లతో రచన చేసినవాడు. మనస్సు, మాట, చేత ఏక సూత్రబద్ధం చేసి రచనా పోరాటాన్ని సాగిస్తున్నవాడు. వాస్తవానికి ఇతని గళం కొత్తదేమీకాదు. అయితే వస్తు దృష్ట్యా, శిల్పం దృష్ట్యా 1970 తరువాత వచ్చిన విప్లవ కవిత్వానికి ఒక రకంగా పథ నిర్దేశకుడు, దేశికుడు శివసాగర్. ప్రజల నుంచి ప్రజలకు అనే సూత్రాన్ని తు. చ. తప్పకుండా జీవితంలోనూ, సాహిత్యంలోనూ ఆచరిస్తున్నవాడు శివసాగర్. 'నరుడో భాస్కరుడా' పాట విప్లవ కవితా కళ దృక్పథాన్ని సమగ్రంగానూ, సంపూర్ణంగానూ మార్చిందంటే శివసాగర్ మార్గదర్శకత్వాన్ని గురించి వేరే చెప్పనవసరం లేదు. "విప్లవ చైతన్యం లోంచి మాత్రమే కాక పోరాటంలో భాగంగా వచ్చిన కవి శివసాగర్. విప్లవ సాహిత్యంలోనే కాదు. మొత్తం తెలుగు సాహిత్యంలో కూడా శ్రీశ్రీ తరువాత గుర్తించదగిన బహుముఖ ప్రతిభావంతుడు శివసాగర్" అని చేకూరి రామారావుగారు పేర్కొనటం సత్యదూరమైన విషయం కాదు.

ప్రజలు, ప్రజల పోరాటాలూ, ప్రజల బాణీలు తన కవిత్వానికి ప్రేరక శక్తులని, మానవాళి భవిష్యత్తుకు సంబంధించిన తపనే విప్లవమని, మానవజాతి భవిష్యత్తును పట్టించుకోవడమే విప్లవమని శివసాగర్ స్వయంగా చెప్పుకొనే ఉన్నాడు. ప్రజలను గురించి, ప్రజావిప్లవాలను గురించి కళాత్మక విలువలు చెదరకుండా, వాస్తవానికి భంగం వాటిల్లకుండా, ప్రజలకు అర్థమయ్యే భాషలో, శిల్పంలో కవిత్వం రాయటం ఆషామాషీ విషయం కాదు. సూడో విప్లవిస్టులు ఏదైనా కవిత్వంగా సునాయాసంగా రాయవచ్చుగాని, ప్రజావిప్లవాన్ని హృదయదఘ్నంగా కాంక్షిస్తూ, ప్రేమిస్తూ, దానికై పోరాడుతున్న ఒక విప్లవ కవి నుంచి ఒక విప్లవగీతం పుట్టడానికి ఎంతో ప్రసవ వేదన ఉంటుంది. "ఒక భావం రాంగానే రాయలేం. దానికి సరిపడే రూపం కూడా మనకు దొరకాలి. ఆ రూపం ప్రజల్లోనే మనం వెతకాలి ఆ రూపాలన్నీ కూడా చారిత్రాత్మికంగా అభివృద్ధి చెంది మన ముందుంటాయి" అంటాడు శివసాగర్ రచనా వ్యాసంగాన్ని గురించి.

నిజమైన ప్రతి కవికీ రాసేది ఎలా రాయాలి ? ఎందుకు రాయాలి ? ఏమిటి రాయాలి ? అనేది ఎప్పుడూ ప్రశ్నలుగానే ఉంటాయి. ఏ కవి అయినా, రచయిత అయినా తనకు తెలిసి కాని, తెలియక కాని ఒక స్వభావాన్ని కలిగి ఉంటాడు. ఆ స్వభావమే అతని దృక్పథాన్ని నిర్దేశిస్తుంది. శివసాగర్ – సాయుధ పోరాటం ద్వారా మాత్రమే ఈ దేశంలో శ్రామికవర్గ పరిపాలన [రాజ్యం] ఏర్పడుతుందని విశ్వసించినవాడు కనుకనే అతని కవిత్వం ఆ శ్రామికులకు, జానపదులకు దగ్గరగా, వారిని ఉత్తేజపరుచుటకు అనుకూలంగా, వారి నుంచి వారికే సంక్రమించే పద్ధతిలో రాయబడింది. శివసాగర్ పాటను ప్రజల బాణీలో ఎంత శక్తిమంతంగా రాయగలడో వచన కవిత్వాన్ని మాత్రాచ్ఛందంలో గేయాన్ని అంత బలంగానూ రాయగలడు. శివసాగర్ శ్రీశ్రీ, కృష్ణశాస్త్రి, వేదుల, నండూరి మొదలైన వారిని తీవ్రంగా అధ్యయనం చేసాడు. దానికి ఆయన మాటలే సాక్ష్యం. శ్రీశ్రీ పదబంధ ప్రభావం శివసాగర్ కవిత్వంలో ఎంతో ఉంది; తను చదివిన జీవితాల్ని, తను చదివిన కవిత్వాన్ని, తను చూస్తున్న సమాజాన్ని అస్తిగతం చేసుకున్నాడు గనుక శివసాగర్ జీవితంలోనూ, కవిత్వంలోనూ, ఉద్యమంలోనూ శివసాగర్‌గా మిగిలాడు. కోటి తుఫానులను, శతకోటి భూకంపాలను ఎదుర్కొన గలిగిన సాహసం అతనిది. తుపాకి రాజ్యాన్ని తుపాకితోనే తుద ముట్టించాలనే మహాసంకల్పం అతనిది. పోటెత్తిన సముద్రంలా గర్జించే గళం అతనిది. చీకటి కోటల్ని ధ్వంసించటానికి, వెలుగు బావుటాలను ప్రతిష్ఠించటానికి, విషాదానికి వీడ్కోలు పలికి, ప్రజాహ్లాదానికి స్వాగతం పలకటానికి విప్లవ శంఖం వినదిస్తున్న కవి శివసాగర్. చీకటిలో, చినుకుల్లో, ఏరు దాటేందుకు, నారి మీటేందుకు సాహసిస్తున్న చెల్లెళ్ళకు సాచిన హస్తాన్ని అందిస్తున్న సోదరుడు శివసాగర్. తన బాట నెత్తురు మడుగుగా, కన్నీటి కడలిగా, పోరాటం జయాపజయాల కలనేతగా, అనంత త్యాగాల సేతగా భావిస్తూ కవిత్వాన్ని, పోరాటాన్ని సాగిస్తున్నవాడు శివసాగర్.

పులి గుహలోకి
వెళ్ళ సాహసించినవాడే
పులి పిల్లను పట్టితెస్తాడు
వెయ్యి కత్తివేట్లకు
జంకనివాడే
రాజును పదవీభ్రష్టుణ్ణి చేస్తాడు. ★

సీరియల్

మానస మురళి

కొడాలి సాంబశివరావు

(గత సంచిక తరువాయి)

విజయ్ గదికి చేరేసరికి లోపల గదిలో ఒక కవరు పడివుంది. పోస్టుమేన్ తలుపు సందు లోంచి లోపలకు విసిరినట్లు వున్నది. 'తనకు ఉత్తరాలు రాసేదెవరు ?' అని ఆశ్చర్యపోతూ కవరు అందుకున్నాడు విజయ్. ఫ్రమ్ అడ్రసు లేదు. ఉత్తరం చింపి చక చకా చదవ సాగేడు.

'ప్రియమైన బావకు —

ఈ మరదలు ఎవరాని ఆశ్చర్యపోతున్నావు కదూ ? నేను బావా నీ చందనను ! నేనింకా గుర్తున్నానా ? ఎన్నాళ్లయింది బావా నిన్ను చూసి ? ఎలా వున్నావు ? ఒకటా రెండా ... ఆరేళ్లయింది కదూ నిన్ను చూసి ! పోలీసాఫీసరువు అయినావట గదా — ఆ దుస్తుల్లో ఒక్కసారి నిన్ను కళ్లనిండుగా చూసుకోవాలని మహా ఆరాటంగా వున్నది. నీవింత ఉన్నతికి చేరుకున్నందుకు నాకు చాలా సంబరంగా వున్నది. నిన్ను ఎపుడెపుడు చూద్దామాని నా మనసు వేగిర పడుతోంది. నీ గురించి తెలిసిన తరువాత ఉత్తరం రాయకుండా ఉండలేకపోతున్నాను.

బావా ! ఈ ఆరేళ్ల కాలంలో నేను ఎప్పుడైనా నీకు గుర్తుకు వచ్చానా ? నిన్ను మాత్రం తలవని రోజులేదు. ఒక్కసారి నిన్ను చూడాలనిపిస్తోంది. మా వూరు వస్తావా బావా ? నీవిక్కడకు వస్తే అడ్డగించేందుకు అత్తయ్య మామయ్య ఎవరూలేరు. నేనిపుడు ఒంటరిదాన్ని. నా ఒంటరి తనానికి జంటగా టి.బి. మాత్రం వున్నది. రెండేళ్ల నుంచి నన్ను అమితంగా ప్రేమిస్తూ నాలోనే వుండిపోయింది. దానికి నేనంటే ఎంతో మక్కువ. అమ్మా నాన్న పోయినా అది మాత్రం నన్ను వదిలిపోలేదు.

ఈ దీనురాలిమీద దయచూపి ఒక్కసారి నీ దర్శన భాగ్యం కలగజేయి. నాకెప్పుడైనా ఆనందం కలిగిందంటే - అది నీ గురించి ఆలోచించిన ఒక్కక్షణం మాత్రమే! అప్పుడే నిజమైన ఆనందాన్ని పొందుతున్నాను. ఈ పల్లెటూరి మరదలి కోరిక తీరుస్తావని, నీవు తప్పక వస్తావని ఎదురు చూసే

నీ చందనప్రియ —'

ఉత్తరం చదవడం పూర్తిచేసేక విజయ్ ముఖం తెల్లగా పాలిపోయింది.

'చందన ...! తన చిన్ననాటి చెలిమి — కలిమి. ఎన్నేళ్లకు ఉత్తరం రాయగలిగింది ! అత్తయ్య మామయ్య పోయారా ? ఆ ఊరు వదలి వచ్చాక తనకు ఆ సంగతులేమీ తెలియవు. చందన టి. బి.తో బాధపడుతుందా ? చందనా ! నీకెంత కష్టం వచ్చింది —' అని విజయ్ మనసు భారంగా మూల్గింది. కళ్లు తడయ్యాయి.

అవ్యక్తమైన ఉద్వేగం అతన్ని నిలువనీయ లేదు. ఉన్న పళంగా వెళ్లి చందనను చూడాలని పిస్తోంది. చకచకా ప్రయాణమైనాడు గండవరం వెళ్లడానికి.

పోలీసు ఇనస్పెక్టర్ ట్రైనింగ్ అయినాక ఆరునెలలు సర్వీసు ప్రొయసైగా మళ్లీ ట్రైనింగ్ వుంటుంది. ఆ ట్రైనింగ్ అవుగానే పోస్టింగ్ వేస్తారు. ఇప్పుడు విజయ్ ప్రొయసైగా ట్రైనింగ్ అవుతున్నాడు. మురళి దూరం కాగానే ఆ ఊరు వదిలి వచ్చేయాలనుకున్నాడు. కానీ ట్రైనింగ్ కోసం వుండాల్సి వచ్చింది. ఎలాగో ట్రైనింగ్ పూర్తి చేసుకుని — ఆ ఊరును — ఆ పరిసరాల్ని వదిలి వచ్చేశాడు. వృత్తిమీద ఎక్కువ శ్రద్ధ చూపుతూ ఆమెను తాత్కాలికంగా మరిచిపోయాడు.

ఇంతలో చిన్ననాటి చెలిమి— చందన వద్ద నుంచి ఉత్తరం వచ్చిపడింది. ఆమె చాలా దీనావస్థలో వున్నదని తెలుసుకుని చాలా బాధ పడ్డాడు. వీలైతే ఆమెను వెంట పిలుచుకుని వచ్చి వైద్యం చేయించాలని అనుకుని గండవరం బయలుదేరాడు విజయ్.

గండవరం వెళ్లాలంటే ముందుగా ఎందుకో గిల్టీగా అనిపించింది. చిన్ననాటి తన బాల్యం — అత్తమామయ్యలు — ఆ ఊరు— ఆ మనుషులు అన్నీ గుర్తుకు వచ్చాయి.

ప్రయాణం చేస్తున్నంతసేపు అతని మనసు పరిపరి విధాలపోతోంది.

'చందనకు అంతకష్టం కలిగిందంటే తను వుండి కూడా లేనివాడయ్యాడు. తన జీవితానికి వెలుగుబాటను చూపిన అభిమాన దేవతకు తానేమీ చేయలేకపోయాడు. తాను ఈ రోజు ఇంతటి వాడయ్యాడంటే అదంతా చందన చలువ కదూ !—'

విజయ్‌కు చిన్న తనంలోనే తల్లిదండ్రులు దూరమయ్యారు. తల్లి ఎలా వుంటుందో అతనికి తెలీదు. ఊహ తెలిసినప్పటినుండి అత్తమామల పెంపకంలోనే పెరిగాడు. చిన్నప్పటినుంచి అతని మనసులో ఒకే ఒక ప్రశ్న తలెత్తేది. అతను ఏ చిన్న పొరపాటు పనిచేసినా మేనత్త సుభద్ర గయ్‌మని విరుచుకుపడేది. 'ఆ ముండకని మా నెత్తిన పడేసిపోయింది. ఆ లేచిపోయేది వాడి పీక పిసికి ఏ బావిలో నయినా పడేసిపోరాదూ ? పీడా విరగడయ్యేది — మా ఇంటికి శనిలా దాపురించాడు — ఈ పీడ ఎప్పుడు వదలుతుందో' అని తిట్టిపోసేది.

ఆ తిట్లు విజయ్‌కేం కొత్తకాదు. రోజూ ఆమెచేత అలాంటి తిట్లు తింటూనే వుంటాడు. ఆమె తిట్టే తిట్లల్లో లేచిపోయిన తల్లిని

జరిగిన కథ — 12 : మానస ఉద్యోగం చేయడానికి ఒప్పుకోదు. ఈ నీచ వృత్తే నీకు ఇష్టం అని మానసను విజయ్ నిందించగా ఇన్ని మాటలకు బదులు తనను పెళ్లి చేసుకొని ఉద్ధరించమని అడిగి వెళ్లిపోతుంది. విజయ్ తను మానసను పెళ్లి చేసుకోడానికి నిర్ణయించుకున్నట్లు ఆమెకు చెపుతాడు. ఆమె అతనిని తన ఇంటికి తీసుకెళ్లి తన కుటుంబ సభ్యులను పరిచయం చేస్తుంది. మానస కోరిక ప్రకారం కోవెల్లో ఆమెను వివాహం చేసుకుంటాడు విజయ్. మానసను బలవంతంగా ఎత్తుకుపోయి రేప్ చేయబోయిన సుకుమార్ నుండి ఆమెను రక్షిస్తాడు విజయ్. ఈ సంఘటన తరువాత మానస ఇంట్లోంచి కదలకూడదని నిశ్చయించుకొంటుంది. తన చిన్ననాటి స్నేహితుడు శ్రీరామ్ వ్రాసిన ఉత్తరాన్ని చూసి మండిపడతాడు విజయ్. విజయ్ డ్యూటీలో వుండగా అతని దగ్గరకు ఓ పేద బ్రాహ్మణుడు వచ్చి లేచిపోయిన తన కూతుర్ని వెదికి పెట్టమని ప్రాధేయపడతాడు. ముసలి బ్రాహ్మణుని కుమార్తె దమయంతిని, శశికర్‌సు రఘురామ్ లాడ్జిలో పట్టుకొని దమయంతికి మంచి మాటలు చెప్పి ఆమెను ఆమె ఇంటికి చేరుస్తాడు విజయ్. రాజశేఖరంగారి కుమార్తె వాసంతి వివాహ సందర్భంగా ఏర్పాటైన మ్యూజికల్ పార్టీకి వెళ్లిన విజయ్ అక్కడ చందనను చూస్తాడు. చందన తను చందన కాదని చెప్పగా వేదనతో ఇంటికెళ్లి గతాన్ని తలుస్తాడు.

గురించి ఎప్పుడూ దొర్లుతాయి. అదే వాడికి అర్థంకాని ప్రశ్న!

ఒకరోజు ఉండబట్టలేక అత్తయ్యను అడిగేశాడు.

''అత్తా! మా అమ్మ ఎక్కడికి వెళ్లింది?'' అని చాలా అమాయకంగా అడిగాడు విజయ్. అప్పుడు విజయ్ వయసు పదేళ్లు. ఆ చిన్నారి మనసులో తల్లిని గురించి తెలుసుకోవాలని ఆరాటంగా వున్నది. విజయ్ ప్రశ్నకు సుభద్ర అక్కసుగా ''ఒళ్లు బలిసి ఎవడితోనే లేచి పోయింది–'' అన్నది.

''లేచిపోవడమంటే ఏమిటత్తా ?–''

వాడివైపు మిర్రిమిర్రిచూస్తూ ''పెళ్లి కాకుండానే నిన్ను కనిపడేసి దేశాలు పట్టుకు పోయింది. బరితెగించిన ముండ. అది మా ఇంటి ఆడపడుచు అని చెప్పుకోడానికికూడా సిగ్గు చేటు–'' అని తన కోపాన్ని ఆ పసివాడి మీద చూపింది.

తల్లి తనను వదిలి ఎక్కడికి వెళ్లిందో – ఎందుకు వెళ్లిందో ఎంత ఆలోచించినా అర్థం కాలేదు ఆ పసివాడికి. తనకు ఎవరూలేరు. ఓ అనామకుడు. అత్తామామల దయాభిక్షతో బ్రతుకుతున్నాడు. వాళ్ల దయలేకపోతే తనకు తిండి వుండదని – వాళ్లకు ఎదురు చెప్పకుండా, వినయంగా మసలుకోసాగేడు విజయ్. వాళ్లు ఎన్ని తిట్టినా నోరు మెదిపేవాడుకాదు. తన బాధను తనలోనే దాచుకునే వాడుగానీ, ఎవరి తోనూ చెప్పుకునే వాడుకాదు. వయసు పెరిగే కొద్దీ వాడికి ఎన్నో విషయాలు తెలిశాయి.

ఆ ఇంట్లో వాడిని గురించి ఆలోచించేది ఒక్క చందన మాత్రమే!

అతని చీకటి జీవితంలో కాంతి రేఖలా భాసించింది చందన!

చందనకు బావంటే ఎంతో మక్కువ. తల్లి తిట్టినపుడు చాటుగా బావను ఓదార్చు తుంది. కవ్వించి – ఉడికించి – నవ్వించి – మై మరిపించుతుంది అతని బాధను.

విజయ్ ఏడవతరగతి పాసైనపుడు ఆ వార్త అత్తామామలకు చెప్పాలని సంతోషంగా పరిగెత్తుకు వచ్చిచెప్పాడు.

సుభద్ర మూతి మూడు వంకర్లు త్రిప్పి ఈసడించేసింది.

''మహా పాసయ్యావులే – తిండికి గతిలేని వెధవకు చదువులొకటే తక్కువ. వీడికీ చదువ లొద్దు గొడ్లకాడ పడేయమని నేను మొత్తు కుంటూనేవున్నా, నా మాట వినిపించ కుంటారా ? –'' అని భర్తకు ఓ చుర అంటించింది.

''పోనీలేవే. నాలుగు అక్షరం ముక్కల నేర్చుకుంటే ఏదో ఒక రకంగా వాడి బ్రతుక వాడు బ్రతుకుతాడు. మనకూ బరువు తప్ప తుంది –'' అని చంద్రయ్య భార్యకు నర్ది చెప్పే వాడు. ఒకరకంగా సుభద్రకన్నా ఆయనే మేలు

భర్త మాటలు ఆమెకు రుచించినట్లు లేదు – ''పనిపాటలు లేకుండా మా నెత్తి



మానస మురళి

కనిలా దాపురించావు—'' అని వాడి నెత్తిన తంగున మొత్తింది.

అతని సంతోషం చప్పున చల్లారిపోయింది. కళ్లనీళ్లు దింపుకుని, బిక్కమొహంతో పెరట్లో బాదంచెట్టు క్రింద రాతిమీద వెళ్లి కూర్చు న్నాడు.

అతని బుర్రలో ఎన్నో సందేహాలు చెలరే గాయి. 'అత్తయ్య నోరుందని ఊరికే తిట్టి పోస్తుంది. తనిప్పుడు ఏం తప్పుచేశాడని ? పరీక్ష పాసయిన సంగతి చెబితే మెచ్చుకుంటుం దనుకున్నాను. అదే చందన ఐదో తరగతి పాసై నప్పుడు మిఠాయిలు అవీ కొనిచ్చి ప్రేమగా చూసుకున్నది. అత్తయ్యకు తనంటే ఎందు కంత కోపం ? ఊరికే కూర్చుని తింటున్నానని అబద్ధాలు చెబుతోంది. లేచిన దగ్గర్నుంచి ఏదో ఒక పని పురమాయిస్తూనే వుంటుంది. చెయ్యక పోతే తిడుతుంది, కొడుతుంది. చదువుకుందా మన్నా సాగనీయదు. సాయంత్రం బడి మంచి వచ్చాక మళ్లీ పనులు చెబుతుంది. పిల్లలందరూ బజార్లో ఆడుకుంటుంటే తను ఇంట్లో పనులు చేయాలి. ఆమె చెప్పిన పనులు చేస్తూ ఎంత మంచిగా వున్నా తిడుతూనే వుంటుంది. ఎందుకు నామీద ఆమె కింత కసి ! ఒక రకంగా మామయ్య మేలు. తనను ప్రేమగా చూడకపోయినా — కోపం వచ్చినప్పుడు తప్ప తిట్టడు.

మా అమ్మ నన్ను వదిలి వెళ్లినందుకు కదా ఇన్ని బాధలు నాకు ? ఎక్కడికి వెళ్లింది ? ఆమెకు నేను గుర్తురానా ? అమ్మ వుంటె ఎంత బావుండేది ? — కనిపించని తల్లి రూపాన్ని ఊహించుకోవాలని విశ్వప్రయత్నం చేసాడు విజయ్.

''బావా ! నువిక్కడున్నావా ? నీ కోసం ఇల్లంతా వెదికాను '' నవ్వుతూ అక్కడకు వచ్చింది చందన. చందనకు వళ్లంతా తెల్లటి పొడలు — మచ్చలు. చూడ్డానికి వికారంగా కనిపించినా మనసు చాలా మంచిది.

విజయ్ కళ్లలోని నీళ్లను చొక్కాతో వత్తుకున్నాడు.

''ఎందుకు బావా ఏడుస్తున్నావు ?—''

''కంట్లో నలక పడిందిలే...''

''అబద్ధం ! అమ్మ కొట్టింది కదూ ? అమ్మ మాటలు పట్టించుకోవద్దని నీకు ఎన్నిసార్లు చెప్పాను బావా ! అవునూ నీవు సెవెన్త్ పాసయ్యావట గదా ?—''

ఔనన్నట్లు తలాడించాడు విజయ్.

''నాకు తెలుసు నీవు తప్పకుండా పాసవు తావు. ఏదీ నోరు తెరువు — '' అంటూ బలవంతాన అతని నోట్లో సున్నివుండ కుక్కింది నవ్వుతూ. విజయ్ వుక్కిరి బిక్కిరి అయ్యాడు.

* * *

కాలగర్భంలో మరికొన్ని రోజులు దొర్లి పోయాయి.

విజయ్ టెన్త్ కూడా పాసయ్యాడు. ఈ సమయంలో అతనికి కలిగిన ఆనందం అంత ఇంతా కాదు. తన విజయాన్ని ముందు చందనకే చెప్పాడు. తన సంతోషాన్ని పంచుకునేది ఆమె ఒక్కటే ! ఆ రోజంతా అతనికి ఎంతో ఉల్లాసంగ వుంది.

''మరి కాలేజీలో చేరవా ? — '' అడిగింది చందన.

''నాకయితే బాగా చదువుకోవాలని వుంది కానీ మామయ్య ఏమంటాడో—''

''వెళ్లి అడుగు—''

''అయన్ని అడగాలంటే నాకు భయం—''

''దేనికి ? మంచి మార్కుల్లో పాసయ్యావు. కాలేజీ చదువులు చదివితే గొప్ప వృద్ధిలోకి వస్తావు. భయాలన్నీ ప్రక్కకు నెట్టి వెళ్లి నాన్న నడుగు—'' అని ధైర్యం చెప్పి తండ్రి వద్దకు పంపించింది చందన.

మరో పది నిమిషాల తరువాత నిరాశా నిస్పృహలను వెంట బెట్టుకుని దిగులుగా వచ్చాడు విజయ్. అతని వాలకాన్ని చూసి విషయం అర్థం చేసుకుంది చందన.

''ఏమన్నాడు బావా ?''

''కాలేజీలో చేరతానంటే చెడామడా తిట్టాడు. కాలేజీ చదువులకు బోలెడు డబ్బు ఖర్చు అవుతుందట. అందుకని వెంకటస్వామి రైసుమిల్లులో లెక్కలు రాసేందుకు పంపిస్తా డట—'' ఏడుపు గొంతుకతో చెప్పాడు విజయ్.

తండ్రి మీద విపరీతమైన కోపం వచ్చింది చందనకు. కానీ, ఏమీ చేయలేని అశక్తురాలు. ''నాకు ముందే తెలుసు; అమ్మా నాన్నా నీకు తిండి పెట్టడమే కష్టంగా భావిస్తున్నారు. ఇక కాలేజీ చదువులకు పంపేంత విశాల హృదయాలు వారి కెక్కడున్నాయి ? నాన్న మాట విని రైసుమిల్లులో చేరావంటే — నీ ఉజ్జ్వలమైన భవిష్యత్తు ఆ రైసుమిల్లు చక్రాల క్రిందపడి తునాతునకలై పోతుంది. నీవిప్పుడు పెద్దవాడి వయ్యావు. నీ గురించి నీవే ఆలోచించుకోవాలి'' అన్నది.

ఆమెలో అన్ని ఆలోచనలున్నాయా ? అని ఆశ్చర్యపోయాడు విజయ్. చందన చెప్పిన సలహా బాగానే వుంది. 'కానీ తనేం చేయగలడు ? మామయ్యతో ఘర్షణకు దిగితే తను బ్రతికేదెలా? ఈ సమస్య పరిష్కరించుకునేదెలా ?' అని ఎంతగానో మథనపడ్డాడు విజయ్.

ఆ రాత్రి ఎంతకీ నిద్ర పట్టలేదు విజయ్‌కు. ఆలోచనలతో దిగులుతో—భయాలతో అటు ఇటు ఊగిసలాడుతున్నాడు. ఎటూ తేల్చుకోలేక పోతున్నాడు.

ఆలోచనలలో వున్న విజయ్ తన ప్రక్కన ఎవరో నిలబడినట్లు సవ్వడి కాగానే ఉలిక్కి

పడ్డాడు. "ఎవరది ?—" కళ్ళు చికిలించి చూసాడు చీకట్లోకి.

"నేనే బావా !—"

"చందనా ! నువ్వా? ఈవేళప్పుడు ఎందుకు వచ్చావు ? నీవింకా నిద్రపోలేదా ?"

"లేదు. నీతో మాట్లాడాలి. ఇలా రా !—" చీకట్లో తడుముకుంటూ అతని చేయి పట్టుకుని తీసుకువెళ్ళింది పెరట్లోకి. పుచ్చపువ్వులాంటి వెన్నెల పెరటినిండా పరచుకుని వుంది.

"ఏమిటి చందనా, ఇక్కడకెందుకు తీసుకు వచ్చావు ?—" అయోమయంగా అడిగాడు విజయ్.

"ముందీ సంగతి చెప్పు — నీకు కాలేజీలో చేరాలని వుందా లేదా ?—"

"వుంది... కానీ..."

"కానీల్లేవు. కాకరగాయలు లేవు. నీవిలా దిగాలుపడి కూర్చుంటే ఏమీ సాధించలేవు బావా ! — మనిషన్న తరువాత కాస్త ధైర్యం, తెగింపు వుండాలి —"

"ఇప్పుడు నన్నేం చేయమంటావు ? మామయ్య నడిగితే వద్దన్నాడు. తల్లిదండ్రులు లేని అనామకుడుని. నామీద ఎవరికి జాలి వుంటుంది ?—"

"ఇదుగో బావా ! ఆ మాటలే నిన్ను అనవద్దంటున్నాను. నీవు బాగా చదువుకుని గొప్పవాడివి కావాలని మనస్ఫూర్తిగా నేను కోరుకుంటున్నాను. నీవు ఈ ఇంట్లో వున్నంత కాలము ఎదగలేవు. ఇక్కడనుంచి వెళ్ళిపో బావా... హాయిగా స్వేచ్ఛగా... ఈ ముళ్ళ పంజరంలోంచి ఎగిరిపో... నీ జీవితాన్ని నీవే దిద్దుకో —" అని తన కొంగున కట్టి తెచ్చిన వస్తువులను అతని చేతిలో పెట్టింది చందన.

"చందనా ! ఏమిటివి? -" నివ్వెరపోయాడు విజయ్.

"నీ జీవితం ఆనందంగా సాగిపోవాలని — నా కలలు ఫలించాలని ఈ మరదలి చిరు కానుకలు... తీసుకో బావా ! ఆ డబ్బు, నగలు నావే ! వీటితో నీ అదృష్టాన్ని పరీక్షించుకో జీవితాన్ని చిత్రించుకో... పట్నం వెళ్ళి వీటిని అమ్మేసి కాలేజీలో చేరు. ఇంకెపుడూ ఈ పరిసరాలకు రావద్దు. ఇది నా చివరి కోరిక బావా !—" ఆమె కంఠం దుఃఖంతో గరగరలాడింది.

ఆమె చూపిస్తున్న అభిమానానికి — చేస్తున్న త్యాగానికి అతని మనసు రెపరెపలాడి కళ్ళు తడయ్యాయి.

"చందనా ! ఎందుకిలాంటి నిర్ణయం తీసుకున్నావు ?—"

"నా బంగారు బావ భవిష్యత్తుకోసం—"

"ఈ సంగతి అత్తయ్య మామయ్యకు తెలిస్తే...?—"

"వాళ్ళ సంగతి నేను చూసుకుంటాలే —"

"ఏమో ! నాకు నీ నగలు తీసుకుపోవడానికి మనసొప్పడంలేదు —"

"ఇలాంటి పిచ్చి పిచ్చి శంకలతో మీన మేషాలు లెక్కబెడుతుంటే అమ్మా నాన్న లేస్తారు. వాళ్ళకు నేను ఏదో సర్దిచెప్పుకుంటాను. ముందు నీ విక్కడనుంచి వెళ్ళిపో —" అని తొందరపెట్టింది చందన.

అతని హృదయం కృతజ్ఞతా భారంతో నిండిపోయింది. అంతటి సాహసం చేయాలంటే భయంగా వున్నా — సుదూర తీరాల్లో కనిపించే ఆశాజ్యోతులు రా రమ్మని పిలుస్తున్నాయి చందన చకచకా చేతిసంచిలో అతనివి రెండు జతల బట్టలు సర్ది తెచ్చింది.

"త్వరగా వెళ్ళు బావా ! నీవెక్కడున్నా క్షేమంగా, సుఖంగా వుండాలని కోరుకుంటున్నాను. నీ వునికి ఎవరికీ తెలియకూడదు. ఆఖరికి నాక్కూడా ఉత్తరాలు రాయవద్దు. వెళ్ళు, రైలు బండికి టైమవుతోంది —" అని తన బాధను తనలోనే దాచుకని విజయ్‌ను ముందుకు సాగనంపింది చందన.

విజయ్‌కు దుఃఖం ఆగలేదు. తన చిన్నారి మరదలి చేయి అందుకుని ఒక్కసారి గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు. ఆ తరువాత ఆమె అందించిన డబ్బు, నగలు తీసుకుని ధైర్యంగా ముందుకు సాగిపోయేడు.

అతను కనుమరుగయ్యేంతవరకు అలాగే నిలుచుండిపోయింది చందన !


* * *


ఆలోచనల్లోంచి తేరుకున్నాడు విజయ్. ఆ విధంగా ఆ రోజు ఊరు వదలి చందన ఇచ్చిన డబ్బు, నగల్ని తీసుకుని వచ్చేశాడు. మళ్ళీ ఆ వైపుకు వెళ్ళలేదు. ఇన్నాళ్ళకు మళ్ళీ చందన ఉత్తరం వచ్చింది...

గండవరం బస్సు దిగి ఊర్లోకి అడుగు పెట్టాడు విజయ్. ఆ మట్టి రోడ్డు, ఆ పరిసరాలు, తన బాల్యాన్ని గుర్తుకు తెప్పించాయి. ఏదో వింత అనుభూతి కల్గింది. సూట్‌కేసు పట్టుకుని ముందుకు నడుస్తున్న విజయ్ వంక 'ఎవరీ కొత్త మనిషి ' అన్నట్లు కొన్ని జతల కళ్ళు ఆశ్చర్యంగా చూశాయి. అదేమీ గమనించ కుండా ముందుకు వెళుతున్నాడు విజయ్.

"ఎవరా వెళ్ళేది ?—" అన్న ప్రశ్నకు తల తిప్పి చూసాడు విజయ్. డెబ్బై ఏళ్ళ వృద్ధుడు వసారాలో పడక కుర్చీలో కూర్చుని, కళ్ళకు చేతులు అడ్డుపెట్టుకుని తనవంకే పరీక్షగా చూస్తున్నాడు. ఆయన రంగాచార్యులుగా పోల్చుకున్న విజయ్ పెదవులపైన చిత్రమైన నవ్వు నృత్యం చేసింది. పాత స్మృతులు ఛళ్ళున విచ్చుకుని మనసుని పరిమళభరితం చేశాయి.

రంగాచార్యులనబడే ఆ వ్యక్తి వయసులో వున్నపుడు కరణం పని చేసాడు. పెద్దకొడుకు ఆ పదవిలోకి వచ్చి ఆయనకు విశ్రాంతి ప్రసాదించాడు. కొడుకులకు, కూతుళ్ళకు పెళ్ళిళ్ళు చేసాక రంగా చార్యులుకు బోలెడు విశ్రాంతి దొరికింది. బాధ్యతలన్నీ వదిలించుకుని—వసారాలో కుర్చీ వేసుకుని ఏ భారతమో పుచ్చుకుని చతికిల బడేవాడు. కృష్ణా రామా అంటూ పుస్తక పఠనం చేసినా కాస్త పుణ్యమైనా వస్తుంది. ఆయనలా పడక కుర్చీలో కూర్చున్నప్పటి నుంచి ఏ పుసక్తములోనూ ఒక్క పేజీకన్నా ముందుకు పోయి ఎరుగడు. మరేం చేస్తుంటాడు ? కుర్చీలో కూర్చోగానే "ఏమేవ్ ! ఓ బెల్లం ముక్క ఇలా పట్రా—" అని కేకేస్తాడు.





ఆయన అర్ధాంగి పతిదేవుడు ఒక్క ముక్క అడిగితే పది ముక్కలు తెచ్చి అందిస్తుంది. ఆ బెల్లం ముక్కల్ని వెంటనే అందుకోడాయన. భార్యను ఒకసారి క్రిందికి మీదికి ఎగాదిగా చూసి "ఎవరే నువ్వు ?–" అని ప్రశ్నిస్తాడు.

ఆ భార్యామణి మూతి మూడు వంకర్లు త్రిప్పుతూ "అయ్యో సంబరం ! నేనెవరో తెలీకుండానే ఇన్నేళ్ళూ కాపురం చేసారా ? మీ భార్య చంద్రమ్మను కాదూ ?– మీ చాదస్తంతో విసిగించకుండా బెల్లం ముక్క నోటిలో వేసుకుని చప్పరించండి. అవతల నాకు బోలెడు పనులున్నాయి–" అని బెల్లం ముక్కలు ఆయన చేతిలో పెట్టి వెళ్ళబోయింది.

"ఏమిటే నీ బోడి పనులు ?–" అని ఆరాగా అడుగుతాడు.

ఆమెకా భాగోతం క్రొత్తకాదు. ఆయనకు జవాబులివ్వకుండా విసవిస లోపలకు వెళ్ళిపోతుంది. తన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా వెళ్ళిపోయే భార్యను చూస్తే ఆయనకు కోపం వస్తుంది, ఆ కోపానికి ఎరగా ఏ దారినపోయే దానయ్యో దొరుకుతాడు. రోడ్డుమీద మనిషి కనిపిస్తే చాలు ఇక చూడండి వాడి దుంపతెంచి గంపకెత్తుతాడు.

"ఎవ్వరా ఆ పోయేది ?–" అని బిగ్గరగా అరుస్తాడు. ఆయన కంఠం నుంచి ఆ ప్రశ్న వచ్చిందంటే ఆ దానయ్యకు అడుగు ముందుకు పడదు.

"నేను స్వామీ–" అని నమస్కరిస్తాడు.

"నేనంటే ఎవ్వరా ?"

'అదేంటి స్వామీ అట్లా అడుగుతారు ? నేను దానయ్యను."

"అదే ఏ దానయ్యవు ?"

"చెప్పులు కుట్టే దానయ్యను ... "

"ఛీ...ఛీ...నీ అఘాయిత్యం మండిపోను. చెప్పులు కుట్టే వెధవ్వి నా ఎదురుగా నిలబడతావా ?" అని గయ్యిన లేస్తాడు, పాపం ఆ దానయ్య బిక్కచచ్చిపోయి దూరంగా వెళ్ళి నిలబడతాడు.

మానస మురళి

"అదేంటి స్వామీ మీరేగదా పిల్చింది."

"నోర్ముయ్ ! నేను పిలిస్తే మటుకు నీ బుద్ధేమయింది? సరానరి, నా ఎదురుగా రావడమే అవతలకు తగలడిచావు–" అని కసురుకుంటాడు రంగాచారి.

"తప్పై పోయింది... ఇంకోసారి రానండి..." అని నెమ్మదిగా అక్కడ నుంచి జారుకుంటాడు దానయ్య.

ఒక్కరుకాక, ఏ ఇద్దరైనా ఆ దారిన పొరపాటున వెళ్ళారనుకో, వాళ్ళ కర్మ కాలిందే ! రంగాచారి ప్రశ్నలకు సమాధానం చెప్పలేకచావాలి.

"నీ ప్రక్కన వెళ్ళేది ఎవ్వరా ? – " అని మొదలుపెడతాడు.

"వీడు మా బామర్ది పుల్లయ్యండి – "

"ఆహా ! ఎందుకొచ్చాడ్రా ?"

"నారుమడికి విత్తనాల కోసం వచ్చాడు–"

"అలాగా ! మళ్ళీ ఎప్పుడెలతాడు ?" ఇలా సాగుతుంది ఆయన ధోరణి. ఏం ప్రయోజనం ఆశించి ఇలాంటి ప్రశ్నలు వేస్తాడో ఆ దేవుడికే తెలియాలి. ఆ ప్రశ్నలకు జవాబులు చెప్పలేక చాలా ఇబ్బంది పడిపోతారు జనం. వయసులో పెద్దవాడు, కాబట్టి ఆయన్ని ఎదిరించే దమ్ములెవరికీలేవు. అందుకే ఒద్దికగా, ఓపిగ్గా సమాధానాలిస్తుంటారు.

అంతటితో ఊరుకోడే "ఈ పుల్లయ్య ఎప్పుడెలతాడు ? – "

"ఎప్పుడోనా స్వామీ ! సాయంత్రమే వెళ్ళిపోతాడండి. పనుల కాలం గదా – "

"అయితే వీడు నిజంగా నీ బామర్ది పుల్లయ్యే నంటావు ? – "

"అవునండి – "

"ఇంతకూ నీవెవ్వరా ? – "

ఆ ప్రశ్నతో ఆ ఇద్దరూ ముఖముఖాలు చూసుకుంటారు అయోమయంగా. 'ఇదెక్కడి మేళంరా బాబూ ! – ' అని మహా విసుగ్గా చూస్తారు.

"నేనేనండీ ... మల్లయ్యను – "

"అరే ... ఏ మల్లయ్య వంట ?"

"కల్లయ్యగారి మల్లయ్యనండి."

"కల్లయ్యా వాడెవడు ?"

"మానాయనండీ ... "

"మీ నాయనంటే ఎవ్వరా ?"

"కల్లయ్యండి — "

అలా ఆయన ప్రశ్నలకు అర్థం పర్థం – తుదీ మొదలు అంటూ లేకుండా సాగుతుంది. ఇలాంటి మహానుభావుడిచేత ఏ పత్రికాధిపతులైనా రచన చేయించాలి. సీరియల్ రచనగానీ చేస్తే చదివేవాళ్ళకు – అచ్చు వేసేవాళ్లకు తప్ప రంగాచారికి మాత్రం అలసట కలగదు. జీవితాంతం వద్దన్నా – ముగించకుండా రాస్తూనే వుంటాడు.


అందుకని రంగాచారిగారి మనస్తత్వం తెలిసిన ఎవరూ ఆయన ఇంటిముందుగా వెళ్ళడానికి సాహసించరు. ఆయన కంట్లో నరుడు పడ్డం పాపం ! ఒకవేళ కుర్రకారు ఎవరైనా సమాధానం చెప్పలేక విసుక్కుంటే "పిదప కాలం పిదప బుద్ధులు. మరీ పెద్దా చిన్నా లేకుండాపోతుంది బడుద్దాయిలకు. పెద్దముండావాడిని పిలుస్తున్నా లెక్కచేయకుండా చక్కాపోతున్నాడు. అందుకే కాలమిట్లా తగలడుతుంది – ' అంటూ వారు కనుచూపుకు దూరం కానంతవరకూ గొణుగుతూనేవుంటాడు.

"ఎవ్వరా అక్కడ నిలుచున్నది ? – '

అన్న రంగాచారిగారి పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాడు విజయ్.

'బాబోయ్ చచ్చాను, ఈయన దృష్టిలో పడితే ఈరోజంతా వదలడు – " అని తల దించుకుని చకచకా నడుస్తూ ముందుకు వెళ్ళిపోయాడు విజయ్.

(ఇంకా ఉంది)





భారీ సంస్థ లోగుట్టు...!


శాన్ ఫ్రాన్సిస్కో నగరంలో వూరుకు కొత్తగా వచ్చినవారి విహారాలు జయప్రదంగా అయ్యేందుకు గైడులను యిచ్చే "ఎస్కార్ట్" అనే వో సంస్థ నడిపే 49 ఏళ్ళ జన్నీస్ ఛాటర్సన్ ఆ సంస్థను నమ్మశక్యంగానంత భారీ ఎత్తున నడుపుతోందట. ఈమె నివాస గృహం అయిదు లక్షల డాలర్లు ఖరీదుచేసే అత్యద్భుత గృహమట. కంపెనీలో నలుగురు టెలిఫోను ఆపరేటర్లు పనిచేసే 35 లైనుల ఫోను లున్నాయట. వాటీ జార్డిన్ అవి కెలికి చూస్తే యీ ఛాటర్సన్ యీ కంపెనీ పేర అందమైన అమ్మాయిలను విహార యాత్రల నెపంతోవచ్చే ధనికులకు తారుస్తోందట. ఈ స్త్రీలలో వివాహితులు, ధనికవర్గానికి చెందినవారు, వుద్యోగం చేసేవారూ వున్నారట. ఫోనుచేస్తే



నిముషాలమీద కావలసిన వయస్సు, సైజు, రంగు, వొంపు సొంపులమ్మాయిని కావాల్సిన చోటుకు పంపుతుందటామె. ఈమె యీ బృహత్ వ్యభిచార పథకంలో ఖాతాదారులకూ, ధనికులకూ యిబ్బంది కలుగకుండా వుండడానికి క్రెడిట్ కార్డు పద్ధతికూడా పెట్టిందట. ఏమిటే యిది అని అధికారులడిగితే — నేను ప్రభుత్వాన్నిగాని, ప్రజలనుగానీ మోసగించలేదు. పోయినేడు పది లక్షల డాలర్లు ఆదాయప్పన్ను నే గట్టలేదా అన్నదట — !

పోలీస్ కానిస్టేబులు హత్య !

కూత్తుకుడికు చెందిన కుప్పంపట్టి గ్రామంలో 27 ఏళ్ళ శివసుబ్రమణ్యం అనే వో పోలీసు కానిస్టబులు ఇంటికెళ్తూండగా జూలై 30న రాత్రి ఎవరో ఆతన్ని దారికాసి, గొడ్డళ్ళతో చిత్రవధ చేసి చంపేశారట.



ఆత్మహత్యల ఫలితం !

విల్లుపురానికి చెందిన 30 ఏళ్ళ సుబ్రమణ్యం అనే వో అవివాహితుడు పెళ్ళి కావాలని సవాలక్ష విధాల ప్రయత్నించి, కుదరక, యిహ తనకా యోగంలేదని మనస్సు విరిచేసుకు, విషం పుచ్చుకు చనిపోయాడట. ఆతని చెల్లెలు 25 ఏళ్ళ రాధ అదేరోజున భర్త పోరు పడలేక విషంత్రాగి ఆత్మహత్య చేసుకున్నదట. ఈ రెండు చావు వార్తలూ విన్న చంద్ర అనే (వారి చెల్లెలు) ఆమె గుండె ఆగి చనిపోయిందట. ఈ మూడు చావు వార్తలూ విన్న వారి తండ్రి రంగనాధన్‌కు గుండె డిక్కపడి, ఆసుపత్రిలో చేరి, చాలా ప్రమాదమైన స్థితిలో వున్నారట.

వెయ్యి రూపాయల కోసం....!

రాజపాలయంకు చెందిన కమ్మపాట్టి అనే గ్రామంలో వో వ్యవసాయదారుడు తనకాపని అచ్చిరానందువల్ల వ్యాపారం జేదామని సంకల్పించి, అందుగ్గావల్సిన మూలధనంగా వో వెయ్యి రూపాయలు తన మామగార్నడిగి పట్రటమ్మని భార్యను ఆమె పుట్టినూరుకు పంపాడట. ఆమె నాలుగొందలు తీసుకువస్తే అది చాలదని, మొత్తంపట్రటమ్మని ఆమెను, ముగ్గురుపిల్లలనూ ఇంట్లోకి రానివ్వనేలేదట. దాంతో ఆమె తిరుగు ముఖంపట్టి తన ముగ్గురు పిల్లలనూ (ఆర్నెల్ల నుంచి ఏడేళ్ల వయస్సులోపు) నూతిలోపడేసి, తానూ దూకి ఆత్మహత్య చేసుకుందిట. స్త్రీకి ప్రసవం పునర్జన్మంటారు కానీ వివాహమే పునర్జన్మలా వున్నదీనాటి వ్యవస్థ, దాని అవస్థ చూస్తే.

చేప తెలివి !

ఆర్చర్ అనే వో జాతి చేప నీళ్ళలోని ఆహారమేగాక, నీటిమీద మొలిచే మొక్కల మీదుండే పురుగులను కూడా అతిలాఘవంగా తినగలదట. నీటిమీది మొక్కమీదున్న పురుగును చూసి, తాను నీటిమీద తేలి, గురిచూసి, నీళ్ళు పుక్కిలించి, వేగంగా ఆ పురుగుమీద చిమ్మన గ్రోవితో చిమ్మినట్టు వుమ్ముతుందట. ఆ ధాటికా పురుగు నీళ్ళల్లో పడిపోయాక ఠక్కున చప్పరించేస్తుందట — కూటి కోసమే కదా యీ కోటి విద్యలూ పుట్టిందసలు.

భార్య పోరు పడలేక....

శంకరపేరి గ్రామంలోని వో ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల హెడ్మాస్టరు 33 ఏళ్ల కనకరాజు తన భార్య నోటితో వేగలేక, ఆవిడ గయ్యాళి నోటిని అరికట్టలేక, పద మీ పుట్టింటికి వెళ్దామని ఆమెను, యిద్దరు కూతుళ్ళను తీసుకుని ముక్కడల్ అనే వూరు వెళ్ళి, తన మామగారింట్లో ఆ రాత్రి పాలలో విషం కలిపి తను తాగి, భార్యా పిల్లల కిచ్చాడట. తెల్లారేసరికా నలుగురూ చనిపోయి వున్నారట.

వరకట్నానికి మరో వధువు బలి !

బెంగుళూరు జీవన్ భీమానగర్‌కు చెందిన వోహ డాక్టరుగారు (యీ విషయం రాసిన పేపరు ఆయన పేరు రాయలేదు.) తన భార్యను పెళ్ళయిన గత ఏణ్ణర్ధం నుంచి ఆమె తెచ్చిన కట్నం, కానుకలూ చాలలేదని అనునిత్యమూ



చితుకబాదేవాడట. మొన్న ఆగస్టు 23వ తేదీన తన భార్య కనబడుటలేదని పోలీసు రిపోర్టిచ్చాడట. ఆ మర్నాడామె శవం నూతిలో దొరికిందట. ఆమె అన్నగారి రిపోర్టు ఆధారంగా పోలీసులా డాక్టర్‌గారిని అరెస్టు చేశారుట — ఎవరా డాక్టరు, ఏమాకథ !

అతి చిన్న కారు !

ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఫోర్డ్ కారు కంపెనీ ప్రపంచంలో కల్లా అతి చిన్న కారును తయారుచేసిందట. ఈ కారు రెండుంపావు మీటర్ల పొడవుతో, 334 కిలోల బరువే వుంటుందట. ఇందులో ముగ్గురు మాత్రమే ప్రయాణం చేయగలరట. వేగం 40 నుంచి 80 కిలోమీటర్లవరకూ పోతుందట !

కృత్రిమ రక్తం తయారీ!

అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో గల ఆల్ఫాథెరపటిక్ కార్పొరేషను కృత్రిమ రక్తం తయారీకి అమెరికా ప్రభుత్వ అంగీకారాన్ని కోరింది. ఈ సంస్థ, జపానుకు చెందిన గ్రీన్‌క్రాస్ సంస్థకు ఉపసంస్థ. కృత్రిమ రక్తంలో ఎర్రకణాలుంటాయి. ఇది ఆక్సిజనును శరీర భాగాలకు తీసుకొనిపోగలవు. గ్రీన్‌క్రాస్ కార్పొరేషను కృత్రిమ రక్త తయారీ పథకాన్ని రూపొందించింది. ప్రపంచంలో మొదటిసారిగా కృత్రిమ రక్తాన్ని వాణిజ్య స్థాయిలో తయారుచేయటానికి అనుమతి కోరిన సంస్థ ఇదేనని వీరు తెలియచేశారు.

ఫాలాక్షుని డైరీ

చైనాలో రవిశంకర్ పర్యటన!

సితార్ వాదనలో జగమెరిగిన పండిట్ రవిశంకర్ చైనా ప్రభుత్వ ఆహ్వానంమీద చైనా దేశం వెళ్ళారట. ఆ దేశంలో ఆయన ఆరు ప్రోగ్రాములు యిస్తారట. ప్రపంచమంతా తన సితారు వాదనతో పరవళ్ళు తొక్కించిన రవిశంకర్ చైనా వెళ్లటం యిదే మొదటిసారట — శుభం భూయాత్.

షవర్ కింద 360 గంటలు!

పశ్చిమ జర్మనీకి చెందిన కొలోంగ్ అనే నగరంలో క్లిమెన్స్ ముట్టర్ అనే వో యువకుడు నీళ్ళ తొట్టెలో కూర్చుని నెత్తిమీద షవర్‌లోంచి వర్షాపాతంగా నీళ్ళు పడుతూండగా ఖచ్చితంగా మూడొందల అరవై గంటల కాలం గడిపి, తన రికార్డును తానేదాటి, కొత్త రికార్డు సృష్టించుకున్నాడట. పోయినేడు ఈ ముట్టర్‌గారు ఇదే పని చేస్తూ మూడొందల యాభై ఒక్క గంట గడిపారట.

టాంకర్‌లో ద్రవం తాగి ఆరుగురి మృతి!

బరోడాకు సమీపంలోగల పిలాల్ అనే వూరి రైల్వే స్టేషనులో నిలబడివున్న వో గూడ్సు రైలు వాహ టాంకర్‌లోంచి కారే ద్రవాన్ని మద్యమనుకుని, కొందరు రైల్వే పనివారు త్రాగారట. అది మిథొనాల్ అనే ద్రవమట. దీనిని త్రాగడంవల్ల త్రాగినవారిలో ఆరుగురు హాంతులుచేసుకు చనిపోయారట. మిగతావారాసుపత్రి పాలయ్యారట. ★



— శేఖర

ప్లాను

తులసి బాలకృష్ణ

"బిల్లు నేనిస్తా"

"కాదు — నేనిస్తాలే."

"అరె వద్రా నేనిస్తానంటున్నానా?"

"ఫర్వాలేదులే — నేనిచ్చేస్తా — వదిలెయ్యి."

— ఆశ్చర్యపోయాను.

బుచ్చిరెడ్డి గాడేవిటే... బిల్లివ్వడమేవిటి ?! కొంపతీసి ఏ లాటరీ అయినా తగల్లేదుకదా ! వాడి జన్మలో ఎప్పుడన్నా కాఫీనీళ్ళన్నా ఎవరికయినా పోయించి ఎరుగునా వాడు ?! మరివాళ ?!...

"ఏవిటోయ్ బుచ్చీ విశేషం ? చేతిలోంచి లాక్కుని మరీ బిల్లిస్తానంటున్నావు ?"

"ఏం లేదులేరా, ఊరికే. ఎప్పుడూ నువ్వే ఇస్తావుగా."

"అదే అంటున్నానోయ్ — ఈ వాళేం ఉపద్రవం తెచ్చిపెట్టబోతున్నావు బిల్లిచ్చి ?"

"ఛ పోరా — నీలా బాచిలర్ గాడినయితే నేనూ కనబడ్డవాడికల్లా దుక్కగా తినిపించి వుండేవాడిని. పద్దెనిమిదోఏడు తిరక్కుండానే కట్టబెట్టాడో గుదిబండని నా మెడకి మా బాబు. వరసలో పుట్టుకువచ్చేసారు నలుగురు ఆడపిల్లలు— చావనీయకుండా బతకనీయకుండా చంపుతున్నారు నన్ను..."

"నాయనా బుచ్చీ—హేమరింగొద్దు బాబూ. నీ చరిత్ర చెప్పమన్నానా ? ఈ వేళెందుకు ఇంతటి సాహసానికి ఒడికట్టావు, ఏవిటీ తెగింపు అని మాత్రమేకదా నేనడిగింది ?"

"ఇదేకాదురా — ఈ శలవు దినం నీకు వీలయినంత ఆనందాన్ని కలిగించి గుడ్ కంపెనీ య్యివ్వదలుచుకున్నాను. ఇప్పుడు మనం మ్యాట్నీకి పోతున్నాం. రాత్రి డిన్నర్ హోటల్ అన్నపూర్ణలో. అన్ని ఖర్చులూ నావే."

అయ్యబాబోయ్, అయ్యబాబోయ్ ఎంత ధైర్యంగా చెప్పేస్తున్నాడూ... ఏవొచ్చిం దివాళ వీడికీ... పిచ్చిపట్టలేదుకదా...

ఆ విషయమే అడిగాను — మనిషిని కుదుపుతూ.

చిద్విలాసంగా నవ్వి, తలాడించాడు.

సినిమా, భోజనం అయ్యాక, 'మా ఇంటికోసారి వెళ్దాంనదు' అంటూ తీసుకు వెళ్లాడు. అప్పటివరకు ట్రీట్ ఎందుకు ఇస్తున్నాడో ఎంత అడిగినా చెప్పలేదు.

ఇంటినిచూసి, ఇల్లాలిని చూడమని అన్నది బుచ్చిరెడ్డి భార్యని గురించిన హెచ్చరికేనేమో. అడుగు మోపడానికి చోటులేకుండా చెల్లాచెదరుగా పడివున్నాయి సామాన్లన్నీ.

"కూర్చో" అన్నాడు.

"ఎక్కడ ?" అన్నాను చుట్టూ అయోమయంగా చూస్తూ.

ఒక కుర్చీమీది బొమ్మలు, పుస్తకాలుతీసి, ఒక పాతబట్టతో బొగ్గుమసిని తుడిచి, "ఇక్కడ." అన్నాడు.

బలవంతంమీద కూర్చున్నాను.

"బావున్నారా అన్నయ్యగారూ" అన్న కర్ణకఠోరమైన ధ్వనికి గబుక్కున "ఆ" అని జవాబిచ్చేసి, తల దించేసుకున్నాను — కళ్లెత్తి ఆ ఆకారాన్ని చూస్తే ఇందాక తిన్న ఆహారానికి ఏదైనా ముప్పు రావొచ్చని.

నా చేతికి మంచినీళ్లందించి, లోపలకు వెళ్లిపోయిందా సౌందర్య లతిక, భయంకరంగా ఆవులించుకుంటూ.

బ్రతికించింది.

"ఇప్పటికయినా చెప్పరా బుచ్చీ నన్ను చంపక" అన్నాను — వాడి చేతులు నా చేతుల్లోకి తీసుకుని, బ్రతిమలాడుతూ.

"చెబ్తాను" అన్నాడు అభయమిస్తూ.

లోపల గదిలో ఆఖరి పిల్లకాబోలు, నిద్రలో వులిక్కిపాటుకి ఏడుపు లంఖించుకుంది తారస్థాయిన. నా గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. ఇంక ఒక్కొక్క పిల్లే లేస్తుంది. నలుగురూ కలిసి నా మీదకు దండయాత్రకు ...

"ముందు బయటకుపోదాం పద" అంటూ వాడిని బలవంతంగా, కాంపౌండులోకి లాక్కుపోయాను.

"ఊఁ ... ఇప్పుడు చెప్పు."

"ఏం లేదురా — అటు చూడు" అన్నాడు పెరట్లోని వాటావైపు చూపిస్తూ.

చూసాను.

"ఏముందక్కడ ?" అన్నాను అర్థంగాక.

"ఆ వాటాలో ఒక చెట్టుక్రింద ప్లీడరు, అతని పెళ్లాం వుంటున్నారు అద్దెకి. అద్దె రెండువందలిస్తున్నాడు. పెంచుతానంటే ఒప్పుకోడు. పోనీ, ఖాళీ చేయమంటే చేయడు."

"ఎన్నిగదుల వాటా అదీ ?"

"రెండు."

"రెండు గదులకి రెండు వందలకంటే ఎవడిస్తాడ్రా నీకు — ఇంతోటి సుందరభవనానికి? గొడవ చెయ్యక వూరుకో."

"ఏడిశావులేవోయ్, తనది కాకపోతే చార్మినార్ వరకు డేకమన్నాట్ట. ఈ హైద్రాబాద్‌లో, ఈ ఏరియాలో మూడొందలు ఈజీగా వస్తాయి. మూడు సంవత్సరాలనుంచీ

ప్లాను

రెండొందలే యిస్తున్నాడు.''

''అద్దె పెంచడానికి ఒప్పుకోవడం లేదన్న బాధ తప్పితే, ఇతరత్రా అతగాడు నిన్ను వేరే బాధలేం పెట్టడం లేదు కదా ?''

''ఇంకేం బాధలు కావాలి – ధన మూలం మిదం జగత్ అన్నారోయ్. రేపు ఫస్టు నుంచీ ఆ వాటాకి నాకు మూడొందలు రావాలి. ఈ విషయంలో నీ సాయం కావాలి. చేస్తావా చెయ్యవా ?''

''నన్నేం చెయ్యమంటావు ?''

''అది నాకు తెలిస్తే ప్రొద్దున్నుంచీ నిన్ను మేపడం ఎందుకు ?''

చచ్చేంరా దేవుడా ! సాయం చెయ్యకపోతే ఇప్పుడు నన్ను కక్కమంటాడు కాబోలు తిన్న దంతా. లేకపోతే పెళ్లాం పిల్లల్ని లేపి, నా మీదకు వుసిగొల్పినా వుసిగొల్పుతాడు.

ఆలోచనలో పడ్డాను. బుర్రకి ఏమీ తట్టడం లేదు. అన్ని విధానాల్లోనూ వీడు అతన్తో డీల్ చేసి, ఫెయిల్ అయ్యాకే నామీద ఖర్చు పెట్టి వుంటాడు. వీడు వెధవ గానీ, అతగాడు వెధవ కాక పోవచ్చుగా – నేనెళ్లి వీడి తరపున డబాయించి మాటాడితే, అతగాడు తన లాయరు తెలివితేటలతో నన్నొక స్టుపిడ్ ఆఫ్ గూస్‌ని చేయొచ్చు, ఏం చెయ్యాలి ?

''నాక్కొంచెం టైం కావాల్రా'' అన్నాను చివరకి.

''ప్రొద్దున్న వరకూ టైము ఇస్తున్నాను. రాత్రంతా నిద్రపోకు. ఆలోచించు. ఎ ఫ్రెండ్ ఇన్ నీడ్ ఈజె ఫ్రెండ్ ఇండీడ్ అన్నారు. మర్చిపోకు.''

''మర్చిపోను. నీ తిండిమీద, సినిమామీద ఒట్టు.''

''అదీ– గుడ్‌బాయ్ లక్షణం.'' అంటూండ గానే వాడి కళ్లల్లో నీళ్ళు తిరిగాయి. ''నీకు తెలియదురా ఎంతగా బెంగపెట్టుకు పోయానో– వీడి మొహం మండా అన్నీ లా పాయింట్లు చెప్పి, కొట్టి పారేస్తున్నాడు. నెలకి వందరూపాయలు లాస్ అంటే మాటలుట్రా'' వాడి గొంతు బొంగురు పోయింది.

నాకు ఒళ్ళు మండింది. అభయమిస్తూనే తిట్టాను, ''వాడి విషయం నేన్చూస్తాను గానీ, మరీ అంత ఆడదానిలా ఏడిచెయ్యకురా, వెధవ ఏడుపూ. అవునూ – ఆ వాటా ప్రక్కనున్న గుమ్మం ఏవిటీ ?'' అన్నాను రెండడుగులు అటువేసి.

''అది ప్రస్తుతం ఖాళీగా వుంది. సెక్రటేరియట్ ఎంప్లాయీ వుండేవాడందులో. క్వార్టర్సు దొరికాయట వెళ్లిపోయాడు.''

''అయితే ప్రస్తుతం ఖాళీయేనన్నమాట. అయితే ఇంకేం. దొరికింది అయిడియా.''

''ఏవిటి ?''

"చెబ్తా – నడు నాతో."

* * *

"ఇది చింతలబస్తీ యను పురంబు..."

"ఇక్కడి కెందుకొచ్చాం మనం ?"

"ఇచట గలదు కత్తుల యాదగిరి యనబడు వస్తాదు."

"వస్తాదా ? మా లాయరుగాడ్ని తన్నమని వీడికి పురమాయిద్దా మంటావా ? కొంపలు ముంచేస్తావురేయ్. ఆ లాయరు ప్రాణమయినా యిస్తాడుగానీ, ఇటువంటి వస్తాదులకీ, రౌడీలకీ లొంగడు."

"అదికాదులేవోయ్ – 'పొగపెడితే చాలదా, పొమ్మనాలా' అన్నార్రా వెర్రినాగన్నా మన పెద్దలు."

"అంటే... ?"

"చెబ్తానుగానీ, ఓ నెల్లాళ్ళు ఇప్పుడు ఖాళీగా వున్న వాటాకి అద్దె రాకపోతే మరేం ఫర్వాలేదుగా ?"

"ఊఁ... ?"

"ఒక్క నెల్లాళ్ళు ఓర్చుకోరా. లేకపోతే ఒంటిపూట భోజనాలు చెయ్యి. వీలయితే అదీ మానెయ్యి. కానీ ప్లాను నెరవేరాలంటే ఒక నెల్లాళ్ళ అద్దె తీసుకోకుండా కత్తుల యాదగిరికి ఆ వాటా నువ్వు యివ్వాలి."

"ఇస్తే ?!"

"ఇస్తే ఏముందిరా వెర్రినాగన్నా. నీ పాచిక పారినట్టే – పొమ్మనకుండా పొగపెట్టడమన్న మాట. నెల తిరక్కుండా మీ లాయరు గూడు మార్చకపోతే – నా కర్లింగ్ క్రాపు నున్నగా గీయించుకుంటాను. సరా ?"

"సరే"

* * *

"ఈవాళ బిల్లు నేనే ఇస్తా. సినిమా, డిన్నరూ... ఫో – కొట్టావు ఛాన్సు" అన్నాడు బుచ్చిరెడ్డి – సరిగ్గా నెల తిరిగాక.

"ఏం మన ప్లాను నెరవేరిందా ? మీ కోర్టు పక్షి ఎగిరిపోయిందా ?"

"ఆహా – దివ్యంగా"

"అదీ – చెప్పాగా"

"కొట్టలేదు, తిట్టలేదు, గొప్ప ట్రబులిచ్చేశాడులేరా మన కత్తుల యాదగిరి లాయరు దంపతులకి. ప్రతి పనికీ అడ్డే. ఉక్కిరిబిక్కిరి చేసి ఊదరగొట్టిపారేశాడు. అందుకనే మరో నెల్లాళ్ళు, సరయిన వాళ్ళొచ్చేదాకా ఫ్రీగానే వుండమన్నాను వాడిని."

"నీకూ కృతజ్ఞత తెలుసన్నమాట."

"ఏడిశావులేవోయ్"

* * *

మరో నెల తిరిగింది —

"చచ్చాన్రోయ్" అన్నాడు బుచ్చిరెడ్డి, తలుపులు దభాలున తీసుకునివచ్చి, నాముందుపడి.

"ఏమయింది— మళ్లీ ఏమొచ్చింది ?"

"చంపావు నన్ను."

"నేనా ?!!"

"నువ్వే. సాక్షాత్తూ నువ్వేరా నాయనా. నా కొంప నిలువునా ముంచావు."

"విషయం చెప్పకుండా ఏమిట్రాయిదీ ?"

"ఏం చెప్పమంటావు. ఎలా చెప్పమంటావు? ఆ దిక్కుమాలిన కత్తుల యాదగిరిగాడ్ని నా నెత్తిమీద పెట్టావు. వాడిప్పుడు ఇల్లు ఖాళీ చేయనంటున్నాడ్రా తండ్రోయ్. పైగా ప్రక్క వాటా కూడా ఆక్రమించుకున్నాడ్రా నాయనోయ్. అందులో పేకాట క్లబ్బు పెడతాట్రా బాబోయ్..."

"... ... ...???"

"ఈ విషయంలో ఇంక ఏం గొడవ చేసినా మక్కెలు విరిచేస్తానంటున్నాడ్రోయ్ దేవుడోయ్"

"... ... ...???"

"కోర్టుకేసొచ్చినా మరేం ఫర్వాలేదు— నువ్వు మాత్రం ఇల్లు ఖాళీచేయొద్దు. నేనున్నాను నీకు అండ అని ఆ లాయరుగాడే వీడికి ధైర్యం చెప్తున్నాట్రా తండ్రోయ్..."

"... ... ...?!!!"

—చాలాసేపటి వరకూ బుచ్చిరెడ్డి ఏడుపు నా చెవులకు వినబడుతూనే వుంది గానీ... ఎంత ప్రయత్నించినా కనురెప్పలు వాల్చలేకపోయాను... మనిషిని కదలలేక పోయాను. బహుశా మెదడు మొద్దుబారి పోవటమంటే ఇదే కాబోలు. ★

జోహార్, లాల్‌బహదూర్ !

లాల్‌బహదూర్ ! లాల్‌బహదూర్ !
ఇదిగో, వెచ్చని జోహార్ !

గనగన మండే ధైర్యం
నీ రూపం తాల్చిందట.
పిడుగుపడ్డ ఈ దేశం
నీ చలవన బ్రతికిందట,
ఒళ్ళు పొంగి 'శాంతివనం'
రా రమ్మని పిలిచిందట.
లాల్‌బహదూర్ ! లాల్‌బహదూర్ !
ఇదిగో, వెచ్చని జోహార్ !

జాతిని నిర్మించేందుకు,
శాంతిని వెల్గించేందుకు,
జీవితమే వెచ్చించిన
యుగపురుషుని వారసునిగ –

కల్లోలం, కాపట్యం,
యుద్ధాగ్నులు, రక్తాశ్రులు.
ఆకలి వ్యథ, చీకట్లూ
ముప్పిరిగొని ముంచెత్తిన
మూగ కోత రోజుల్లో–

"జై జవాన్ ! జై కిసాన్ !"
అన్న సింహగర్జనతో
ఇంతింతై, నురి అంతై,
అంతంతై అగ్గలించి,
దేశానికి రక్ష కట్టి,
దౌష్ట్యానికి శిక్ష వేసి, ధరిత్రినే
నవతరించావ్ !
భవిష్యమే నిలబెట్టావ్ !
లాల్‌బహదూర్ ! లాల్‌బహదూర్ !
ఇదిగో, వెచ్చని జోహార్ !

ధర్మానికి బాసటగా
మర ఫిరంగి మండించీ,
నరహింసకు కరగిపోయి
కన్నీరే నిండించీ,
'తాష్కెంటు'కు దారి తీసి
గౌరవాల కలం దూసి
శాంతి వీలునామాపై
సాక్షి సంతకం చేసి,
మనస్సు మాత్రం మాకిచ్చావ్.
వయస్సు మాత్రం జమకట్టావ్ !
లాల్‌బహదూర్ ! లాల్‌బహదూర్ !
ఇదిగో, వెచ్చని జోహార్ !

నిరీక్షలో, పరీక్షలో
నిప్పుల కుంపటిగా మారిన
వర్తమాన జీవితాన్ని
వరించుకున్న మాకు –

సామాన్యుడి ప్రతినిధిగా,
వెనుదిరుగని వీరుడిగా,
మనోబలాల మేరువుగా,
క్రియాచరణ శిఖరంగా.

నువు చూపిన కర్తవ్యం,
నువు రేపిన ఔత్రవ్యం,

చితాభస్మ రూపంగా,
స్మారకాల దీపంగా
ప్రసాదించి పోవయ్యా !
అదే మాకు ఋణమయ్యా !
లాల్‌బహదూర్ ! లాల్‌బహదూర్ !
ఇదిగో, వెచ్చని జోహార్ !

– జగ్గయ్య

ఆంధ్ర సచిత్ర వారపత్రిక 1966 జనవరి 21 సంచిక నుంచి

ప్రశ్నావళి!

కె.రామలక్ష్మి

షణ్ముఖ – మవాబేడ

మీ నవల "పొద్దుతిరుగుడు పూలు" చలన చిత్రంగా తీస్తున్నారని విన్నాను. నిజమేనా ?

★ నిజమే.

ప్రశ్నావళిలో ఈ మధ్య మీ రిచ్చిన సమాధానాలు చాలా ఘాటుగా వుంటున్నాయి. కారణం ?

★ ఇంకా దిగజారిపోతున్న పరిస్థితులు !

ఈ చిట్టి తమ్ముడిపై మీ మనస్సులో ఎప్పటికీ చోటు వుంటుంది కదూ ?

★ ఏమిటీ మరీ పిచ్చిగా– బాలానందం కుర్రాడిలాగా ? మీ అందరికీ మనస్సులో చోటు కేటాయించేస్తూ పోతే నాక్కావలసినవాళ్లనేం చెయ్యను ?

ప్రేమ నిలవడానికి జీవితాన్ని త్యాగం చేయమంటారా ?

★ అప్పుడిక ప్రేమ నిలిచి ప్రయోజనం ఏమిటి ?!

ఆడదానికి శత్రువు ఆడదే కదా; మరి మగవాడికి ?

★ ఆడదే – శత్రువు.

జీవితం క్షణికం అని తెలిసీ – చచ్చేదాకా కష్టపడి బ్రతుకుతాడు కారణం ?

★ చావొచ్చేదాకా – తేరగా బ్రతకడం – మానవ నైజం కాదు. అందుకని !

మగవాడు మోసంచేస్తే ఆడది ఆత్మహత్య చేసుకుంటుంది. మరి ఆడది మోసం చేస్తే – మగవాడు ఏం చేస్తాడు ?

★ కడుపో, కాలో రాదు కనుక–ఆత్మహత్య తలపెట్టడు. ఇంకో ఆడదానికోసం వలవేస్తాడు.

ఎల్. ఎన్. – భువనేశ్వర్

పత్రికలో ముందు మీ ప్రశ్నావళి చదవాలని పిస్తుంది. ఎందుచేత అంటారు ?

★ ఎందుకేమిటయ్యా శ్రీ వి వా సూ, రోగికి అపత్యంపైనేకదా మోజు !

సిహెచ్; ఎస్.బి; ఎస్.డి. – రాజమండ్రి

చదువు మానవులకు జీవనోపాధికి మూలమని నా భావన. మీ అభిప్రాయం ?

★ అలా అనుకునే గుడ్డిగా చదివేస్తున్నారు ! చదువు ఇటు విజ్ఞానదాయనీ కాదు. అటు జీవనోపాధికల్పించేదీ కాదని – యిప్పుడిప్పుడే తెసుకుంటున్నారు. ఇప్పుడు కావలసినవి ఇంకో రకం తెలివితేటలు.

పి.ఎల్.ఎమ్. – అక్కవల్లి

రామలక్ష్మిగారూ ! మీ సాహిత్య పరంపర చదివి మీ అభిమానిని అయ్యాను. మీ సాహిత్య ప్రతిభ ఎలుగెత్తి పదిమందిలో చెప్పుకుంటాను..

★ బ్రతికించావు బ్రదర్, నా స్వంత బాకా వూదుకునే బాధ తప్పింది !! భజన కూటాలు ఏర్పాటు చేసుకోనక్కరలేదు.

కె. డి. బి. – మచిలీపట్నం

ప్రేమించడం కూడా ఒక బలహీనతే అంటాను. మరి మీరేమంటారు ?

★ బలహీనతలు లేకపోతే మనిషి ఎలా అవుతాడు. ప్రేమించకుండా, ద్వేషించకుండా – ఉండడం కంటే – ప్రేమించి, ద్వేషించి ఓడిపోవడం కూడా మంచిదే – మనని ఎదిగేలా చేస్తుంది అనుకుంటాను నేను.

ప్రభు – గుంతకల్

ఈ వ్యవస్థ మారాలి... మా రా లి. శాస్త్రీయ విద్యావిధానం రావాలి. అంటూ విద్యార్థులు, నాయకులు,నిరుద్యోగులు,పండితులు మహా మేధావులు అందరూ గొంతులు పూడిపోయేలా అరుస్తున్నారు. వ్యవస్థ మారడంలేదు. మరి ఎప్పుడు మారుతుందో చెప్పకలరా ?

★ అరుపులు మాని కార్యాచరణకు పూనుకున్నప్పుడు – కంఠ శోషలిజమ్‌తో సమాజం మారదు.

ఎ.ఆర్.ఆర్. – జమ్మలమడుగు


... ఒక్క మగజాతిని విమర్శించడంలోతప్ప మీ సమాధానాలు మిగిలిన విషయాల్లో బాగుంటాయి. ఆచరణయోగ్యం, ఎందరికో ఉపయోగపడతాయికూడా... ఆడదాని కష్టాలకి మగవాడే కారణం అనడం సమర్థనీయంకాదేమో?


★ అందరు మగవాళ్లనీ నేనెక్కడ తిడుతున్నానయ్యస్వామి, గుమ్మడికాయ దొంగ అంటే భుజం తడుముకునే వాళ్లు వుంటారు – అవి వారికి వర్తించుకుంటారు. తిట్టుకుంటారు. మీరూ అలా అనుకుంటే ఎలా ? కావలిస్తే – మగవారినే అడగండి – కె. రా. తిడుతుందా మిమ్మల్ని అని. వారి సమాధానం మీకు ఆశ్చర్యం కల్గిస్తుంది.

కె. జి. ఎస్. కె. – కుప్పం

సాహిత్యం పుట్టుకతో వచ్చే విద్య అని కొందరు, కాదు సాధనతో సాధించవచ్చునని మరికొందరు వాదిస్తున్నారు. మీరు ఎవరితో ఏకీభవిస్తారు ?

★ రెండోవారితో ఏకీభవించడం–ఈ రోజుల్లో న్యాయంగా తోస్తుంది. వెనకటికి గోరాశాస్త్రి, 'మీరంతా చేసేది సక్కుబాయి పిండి రుబ్బడమే. జబ్బుసత్తువేగాని దీల్లో మరేం వుండడంలేదు' అన్నారు ! రుబ్బడం అంటే సాధనే కదా !





అలసట చేత ఇంట్లో చదవ లేవా?




గ్లూకోన్-డి ®

ఇది మీరు నమ్మిన గ్లాకోస్ జ్-డి యొక్క కొత్త పేరు

ఆదనపు శక్తికోసం—అలా
అతనికి కావలసినప్పుడు

సేద తీర్చడానికి, చల్లదనానికి శక్తినిచ్చే గ్లూకోన్-డి. గ్లాక్సో కంపెనీ నుంచి వచ్చిన విటమిన్-డి మరియు కాల్షియం ఫాస్ఫేటులతో బలపరచబడిన అసలైన గ్లూకోజ్ పౌడరు. దాన్ని ఏ పానీయం లోనైనా సరే కలపండి—పళ్లరసం, పాలు, టీ, కాఫీ, నీరు. లేకపోతే దేనితో కలపకుండా అలానే తీసుకోండి. శక్తి అలా ఉరకలు వేస్తూవచ్చే అనుభూతిని పొందండి.

అందరికీ పరిచయమున్న అదే ఆకుపచ్చ ప్యాక్‌లో దొరుకుతుంది.



HTB-GLL-7200-TG

గ్లూకోన్-డి ® నమ్మకంగా తిరిగి శక్తి నిచ్చే **గ్లాక్సో** వారి తయారీ

ఆనంద్ విషాదాంతం

[8వ పేజీ తరువాయి]

ఒకడివి. మన అయిదుగురం కూడ పట్టుబడతాం, కాబట్టి ఆనంద్ శవాన్ని వదుల్చుకోవటం తక్షణ కర్తవ్యం అని తీర్మానించింది. అయితే అది 'నేరం' అని దర్శన్ చెప్పగా "పిల్లల మొహాలు చూసి మాట్లాడు. వాళ్లు నీ స్వంత బిడ్డలులాంటి వారు" అని చెప్పింది. నేను సూచించిన పద్ధతి సరైనది అని చెప్పి వెలుపలికి వెళ్లి తొంగి చూసి విక్కీని కేకేసింది. విక్కీ కారు డిక్కీని తెరిచాడు. అది ఆనంద్ స్వంత ఫియట్ కారు. ఇందూ ఆదేశించగా ఆనంద్ శవాన్ని విక్కీ, శాండీ, దర్శన్ మోసుకొచ్చారు! మిగత ఇద్దరిని వదిలెయ్యమని దర్శన్ తనే శవాన్ని డిక్కీలోకి తోసేశాడు. దర్శన్ ఇంటికి తాళం వేసి వచ్చాడు. యువిక మాత్రం మేడమీదనే ఉండిపోయింది. వాళ్లు ఎం. ఎల్. ఏ. క్వార్టర్సు ఫ్లైట్‌రోడ్, పంజాబ్ రాజభవన్, గోల్ఫ్ క్లబ్ మీదుగా 'సుఖ్నా' కొలను చేరి అందులో ఆనంద్ శవాన్ని త్రోసివేశారు. ఆ కొలనులో ఎక్కువ నీరు లేదు. వాళ్లు తిరిగి కారులో మెయిన్‌రోడ్‌లో ఇంటికి చేరారు. దర్శన్ ఇంటి తాళం తీయగా మిగతా ముగ్గురు పైకి వెళ్లారు. దర్శన్ మాత్రం గడ్డిలో మంచం వేసుకొని పడుకున్నాడు. పది నిమిషాలు తర్వాత ఇందూ దిగివచ్చి కారులో ఎక్కడికో వెళ్లిపోయింది. వాళ్లంతా ఎక్కడకు వెళుతున్నారో దర్శన్‌కు చెప్పలేదు. పది నిమిషాల తరువాత శ్రీమతి ఇందూ దిగివచ్చి కారులో ఇంటి వెనకవైపుకు వచ్చింది. యువిక దర్శన్‌ను పిలిచి ఇంటి తలుపులు తీసి ఉన్నాయి. జాగ్రత్తగా చూసుకో అని చెప్పి, తాము సెక్టారు 11, ఇంటి నెం. 1505 వెళుతున్నట్లు చెప్పింది.

దర్శన్ ఇంటికి తాళం వేసి విశ్రాంతి తీసుకున్నాడు. ఒక గంట తరువాత యువిక, ఆమె తల్లి తిరిగి వచ్చారు. శాండీ, విక్కీ సుమారు పొద్దున 4–45 ప్రాంతంలో వచ్చారు. దర్శన్ తెల్లవారి పాలు తేవడానికి వెళ్లి వచ్చేటప్పటికి పిల్లలందరు శ్రీమతి ఇందూ గది తలుపులు కొడుతూ కనిపించారు. ఎలాగో దర్శన్ గదికున్న అద్దాన్ని పగులగొట్టి చూడగా శ్రీమతి ఇందూ స్పృహలేని స్థితిలో పడి ఉంది. ప్రక్కింటి జాస్పర్ సింగ్ కుటుంబ సభ్యులంతా వచ్చారు. జాస్పర్ దర్శన్‌ను తమతో కూడ రమ్మని శ్రీమతి ఇందూను పి. జి. ఐ. హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. ఆమెను ఎమర్జెన్సీ వార్డులో చేర్పించారు. ఆమె అక్కడ నలుగురైదుగురు డాక్టర్ల పర్యవేక్షణలో కోలుకుంది. తను విస్కీ బాటిల్ పూర్తిగా తాగినట్లు చెప్పింది. తరువాత ధన్‌రాజ్ కౌర్ మొదలయినవారు వచ్చారు. యువిక కూడ హాస్పిటల్‌కు వచ్చింది. అంతకుముందే శాండీ, విక్కీ ఎక్కడికో వెళ్లారు.

ధన్‌రాజ్ కౌర్ దర్శన్‌ను ఇంటికెళ్లమని చెప్పగా అతను ఇంటికెళ్లి ఇల్లు శుభ్రం చేస్తూండగా జాస్పర్ సింగ్ వచ్చి ఆనంద్ చనిపోయాడనీ అతని శవం దొరికిందని చెప్పాడు. దర్శన్ ఆనంద్ శవం ఎక్కడ దొరికిందని అడిగినపుడు కొలనులో దొరికిందని చెప్పాడు. దర్శన్ యజమాని మరణానికి విచారం వ్యక్తం చేశాడు. ఈ వార్త తెలిసి ఒక్కొక్కరు పరామర్శకి రాసాగారు.

తరువాత పోలీసులు వచ్చి జరిగిన విషయం దర్శన్‌ను అడిగినపుడు తన యజమాని ఏదో ఎందుకు వెళ్లివచ్చి, వాహ్యాళికి వెళ్లినట్లు మాత్రమే చెప్పాడు. జూలై 14 తారీఖున విక్కీ దర్శన్‌తో ఇంట్లో జరిగిన కొట్లాట పోలీసులతో చెప్పవద్దని కోరాడు.

దర్శన్ తనకు కూడ ఈ నేరంలో భాగం ఉంది కనుక తనూ పట్టుబడవచ్చనే భయంతో అబద్ధాలు చెప్పానని ఒప్పుకున్నాడు. ఇందుకు తన మనస్సు చాల బాధ పడుతోందని సి. బి. ఐ. ఎదురుగా ఆగస్టు 19 తారీఖున ఒప్పుకొన్నాడు. మొత్తం విజాన్ని పై విధంగా చెప్పాడు. ఈ హత్యకేసులో అతనిని సాక్షిగా సి. బి. ఐ. పెట్టవచ్చు.

[– ఓ.వి] ★



అపశ్రుతి

మసునూరి పేరయ్యశాస్త్రి

రేపటి కోసం ఎదురుచూస్తూ క్షణమొక యుగంలా గడుపుతున్నారు ఆ దంపతులు. రేపు కొడుకు వస్తాడనే ఊహ వారికి నూతనోత్సాహం కలిగిస్తోంది.

కొడుకు వస్తున్నానని వ్రాసినప్పటి నుంచి, అతనొచ్చే రోజు కోసం—రోజులు లెక్కపెట్టడమే కాలక్షేపంగా మారింది వారికి.

ఆ దంపతులు కన్న ఏకైక పుత్ర రత్నం అరవింద్. బాగా తెలివైనవాడు. బి. ఇ. చదివాడు. మధ్యప్రదేశ్‌లో నెల క్రితమే ఉద్యోగంలో చేరాడు. ఇంతవరకూ ఇన్నాళ్ళు కొడుకుని వదలి వుండని వారు కొడుకు కోసం ఎదురు చూస్తున్నారు. అతన్ని తొందరగా చూడాలని – వేయికళ్ళతో ఎదురుచూస్తూ అతని కిష్టమైన పిండివంటలు రెడీచేస్తున్నారు.

పద్మావతమ్మగారు బయట అరుగుమీద కూర్చున్నారు. ఇంతలో విశ్వనాథంగారు బయట నుంచి వస్తూ, ''ఏమిటే, అప్పుడే కొడుకు కోసం ఎదురుచూస్తూ కూర్చున్నావా – కళ్ళు వాచిపోయాయి'' అన్నారు వేళాకోళంగా.

పద్మావతమ్మగారు వెటకారంగా, ''చెప్పొచ్చారు, ఒకసారి మీరెళ్ళి అద్దంలో మీ ముఖం చూసుకోండి'' అన్నారు.

విశ్వనాథంగారు ఆమె ప్రక్కన కూర్చుని, ''పద్మావతీ, రేపు ఈపాటికి మనబ్బాయి మన మధ్య వుంటాడు గదూ !'' అన్నారు కళ్ళలో కాంతులీనుతుండగా ? ఆ మాటలు విన్న పద్మావతమ్మగారి కళ్ళు కూడా తళ తళ లాడాయి.

''అవును'' ఆనందంతో తబ్బిబ్బు అవుతూ అన్నారామె.

''ఇదిగో. మళ్ళీ అప్పుడు చెప్పడం కుదరదు. వాడు వచ్చీరాగానే దిష్టి మాత్రం తీసెయ్యి'' అన్నారు విశ్వనాథంగారు.

ఆవిడ వింటూ, ''నేనేమైనా చిన్నపిల్లనా, తెలీనట్టు చెబుతారేమిటి ? నా విషయం మీరేమి చెప్పక్కర్లేదు. వాడు బస్సు దిగేటప్పుడు జాగర్త. అసలే వెధవ బస్సుల తలుపులు రేకులు పైకి లేచి ఉంటాయి. చప్పున దిగాలనే ఆత్రుతలో చూసుకోకుండా దిగితే గీసుకుంటాయి. అలసిపోయివస్తాడు. దిగగానే వాడిచేతిలో సంచి అందుకోండి'' అన్నారు.

విశ్వనాథంగారు భార్య ముఖంలోకి వంగి, ''ఏమే, మనమింత ఆరాటపడుతున్నాముగదా ! వాడు మనకోసం ఆరాటపడుతున్నాడంటావా !'' అనేసరికి, ఆవిడకు వళ్ళెరగని కోపం వచ్చేసింది. ఒక్కసారి లేచి లోపలికి వచ్చేసింది.

విశ్వనాథంగారు అయోమయంలోపడి, ఆవిడ వెనుక లోపలికి వచ్చారు.

''ఇప్పుడు నేను ఏమన్నానని అంత కోపం'' శాంతంగా అడిగారు.

ఆవిడ తల విసురుగా తిప్పి, ''ఏమన్నానని యింకా అడుగుతున్నారా ! మనవాడిగురించి మీకు తెలీదా ! మనమంటే వాడికెంత అభిమానమో మీకు తెలియదా !'' అన్నారు.

విశ్వనాథంగారు నవ్వి ''పిచ్చి ముఖమా, తెలీక కాదే – ఊరికే అడిగాను'' అన్నారు.

అయినా ఆవిడకు కోపం తగ్గలేదు. మొదటి నుంచీ కూడా ఆమె తీరు అంతే. కొడుకు మీద

అపశ్రుతి

ఈగ వాలనివ్వరు. ఎప్పుడైనా కోపం వచ్చినా తనని తాను తిట్టుకునేవారే గానీ— కొడుకు నెప్పుడు తిట్టలేదు. విశ్వనాథంగారు కర్మకాలి తిడితే ఆయన కారోజు మనశ్శాంతి కరువైందన్న మాటే !

* * *

మర్నాడు —

ఉదయం పదిగంటలు.

పద్మావతమ్మగారి సలహాలు సూచనలు మనసులో దాచుకుని బస్టాండ్ చేరుకుని, ఒక మూల కూర్చున్నారు విశ్వనాథంగారు.

పదిన్నర ప్రాంతంలో బస్సు వచ్చింది. అందులో అరవింద్ కనిపించాడు. విశ్వనాథంగారు, "ఒరే బాబూ, జాగ్రత్తగా దిగు" అని అరిచారు.

అరవింద్ బస్సు దిగాడు.

ఆ సంచీ ఇలాతే బాబూ ! వళ్ళంతా కళ్ళు చేసుకుని కొడుకును చూస్తు న్నారు.

"పర్వాలేదు, రండి" ముందుకడుగు వేస్తూ అన్నాడు. అయినా వినలేదాయన. బలవంతంగా లాక్కున్నారు. రెండడుగులు వేసాక "హల్లో, కులాసాయేనా మధూ!" అంటూ స్నేహితుణ్ణి పలకరించాడు అరవింద్.

ముందు విశ్వనాథంగారు నడుస్తున్నారు. ఆయన వెనుక అరవింద్, మధు కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నారు. విశ్వనాథంగారి ముఖం అదోలా మారిపోతోంది. కొడుకుతో యెన్నో చెప్పాలనుకున్న ఆయన గొంతు మూగబోయింది. ఎన్నో ఆశలు నింపుకున్న ఆయన మనస్సు ఖాళీ అయిపోయింది.

కొంత దూరం నడిచాకా, "నాన్నా ! మీరు వెళ్ళండి— నేను వెనుక వస్తాను" అన్న కొడుకు మాటలు లోపలి నరాలు తెగిపోయినంత బాధని కలిగించాయి. ఇంటి దగ్గర ఒక హృదయం తన కోసం ఎదురు చూస్తుందనే విషయం మరచిపోయాడా ! ఇంటి దగ్గర రెండు కళ్ళు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నాయనే సంగతి వీడికి తెలియదా ! ఎందుకిలా తల్లిదండ్రుల ఆత్రుతని, ప్రేమని పసిగట్టని మూర్ఖుడిలా తయారయ్యాడు. తల్లిని వెంటనే చూడాలని – తండ్రిని పల్కరించాలని—లేకపోతే వారి గుండెలు బ్రద్దలైపోతాయని తెలియదా వీడికి.

అలా ఆలోచిస్తూ ఇంటికొచ్చిన విశ్వనాథంగారు వీధి గుమ్మంలో ఎదురుచూస్తూ కూర్చున్న భార్యని చూడగానే ఆయన కళ్ళు చెమ్మగిల్లాయి.

"వాడేడి ? " అడిగారామె ఆత్రుతగా.

ఆయన ముఖం వాడిపోయి వుంది.

"మధు కనిపించాడు. వాడితో వెళ్ళాడు, ముందు నన్ను నడవమని చెప్పి వెళ్ళాడు" అనేసి అక్కడే ఉన్న పడకకుర్చీలో నడుం వాల్చాడు. గాలి తీసేసిన బెలూనులా చల్లబడిపోయింది

అవీ... ఇవీ... అన్నీ...

రోటరీక్లబ్ విజయవాడ వారి రాష్ట్రస్థాయి కార్టూన్ల పోటీ

పౌరధర్మాలను [సివిక్ సెన్స్] గురించి ఆలోచనలను రేకెత్తించే రాష్ట్రస్థాయి కార్టూన్ల పోటీని రోటరీక్లబ్, విజయవాడ వారు నిర్వహించనున్నట్లు, ప్రెసిడెంట్ ఆకే ఆంజనేయులు తెలియ చేస్తున్నారు. రోడ్‌మీద నడిచేటపుడు, వాహనాలు నడిపేటపుడు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఇంటా, బయటా ఎలా ప్రవర్తించాలి, మన నడవడి ఇతరులకు ఏవిధంగా వుండకూడదు, మనకు హక్కులతో పాటు నిర్వర్తించవలసిన ధర్మాలు కూడా కొన్ని వున్నాయని తెలియ చేయడం లాంటి విషయాలపై కార్టూన్లు ఈ పోటీకి ప్రధాన అంశములు. పౌరధర్మాలు గురించి ఆలోచింపచేసే కార్టూన్లు ఈ పోటీకి పంపాలి. ఉత్తమమైన వాటికి బహుమతులు ఇవ్వడమే గాక-- మరీ బాగున్న కార్టూన్లు పెద్ద బోర్డులుగా తయారు చేయించి నగరంలో పెట్టాలని నిర్ణయించుకున్నారు.

★ ఈ పోటీలో ఎవరయినా పాల్గొనవచ్చు. ఎన్ని కార్టూన్లు అయినా పంపవచ్చు. ప్రవేశ రుసుము లేదు. ప్రతి కార్టూను 15×20 లేదా 20×30 అంగుళాల సైజులో వుండాలి. రంగులలో కానీ, నలుపు, తెలుపులో కానీ వేయవచ్చు. కార్టూన్లు లోగడ ప్రచురించినవి కాకూడదు.

★ ఉత్తమ కార్టూన్లకు 500, 300, 200, 100 రూపాయలు మొదటి నాలుగు బహుమతులుగా ఇవ్వడమే గాక—మరో పదిహేను కార్టూన్లకు యాభయి రూపాయలు చొప్పున ఇవ్వడం జరుగుతుంది.

★ ఎగ్జిబిషన్‌లో ఎన్ని కార్టూన్లు అయినా, ఏవిధంగానైనా వాడుకొనే హక్కు రోటరీక్లబ్ వారికి వుంటుంది. బహుమతి పొందని కార్టూన్లు తిప్పి పంపగోరేవారు ఆ ఖర్చుకు తగిన స్టాంపులు పంపాలి. కార్టూన్లు చేరవలసిన ఆఖరు తేదీ : 30–9–1983. కార్టూన్లు పంపవలసిన చిరునామా : శ్రీ పి. ఎల్. పి. రాజు, చైర్మన్: ఫైన్ ఆర్ట్స్ కమిటీ, శ్రీరామా సిమెంట్ కాంక్రీట్ ప్రొడక్ట్స్ కంపెనీ, మధురానగర్, విజయవాడ – 520 011.

వెంకట్ అవార్డు కార్టూన్ల 5వ పోటీ 1983

యువ వ్యంగ్య చిత్రకారుడు ''వెంకట్'' పేరిట అవార్డుల బహూకరణకై వ్యంగ్య చిత్రలేఖనంలో 5వ వార్షిక పోటీని సాధన సమితి, హైదరాబాదు ప్రకటిస్తున్నది. ప్రవేశ రుసుం లేదు. ప్రతి పోటీదారు రెండు కార్టూన్లు పంపవచ్చు. ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించటానికి అనువుగా 9×12 అంగుళాల సైజులో ఇవి ఉండాలి. ఎగ్జిబిషన్ కొరకు పాస్‌పోర్టు సైజు ఫోటో కూడా పంపవచ్చు.

రు. 516/– ల మొత్తాన్ని నలుగురు లేక అంతకన్న ఎక్కువమంది విజేతలకు పంచటమవుతుంది. ప్రోత్సాహక బహుమతులు కూడా వుంటాయి. స్టాంపులతో 9×12 అంగుళాల సైజులో స్వంత చిరునామా వ్రాసిన కవరును జతపరచిన పోటీదారులకు మాత్రమే ధృవపత్రాలు మొదలైనవాటిని పంపటమవుతుంది.

స్వంత చిరునామాతో పోస్టల్ కవరు పంపి ముందుగా పోటీ సమాచార పత్రం తెప్పించుకొనటానికి, ఎంట్రీలు దాఖలు చేయటానికి చిరునామా :— కార్యదర్శి, సాధన సమితి, 1–1–336/20, వివేకనగర్, చిక్కడపల్లి, హైదరాబాదు–500 020.

ఈ పోటీకి కార్టూన్లు స్వీకరించటానికి చివరి తేదీ 1983 అక్టోబరు 16.

ఆయన ఉత్సాహం. కన్నవారు తనకోసం ఆరాటపడతారని, తనని చూడాలని వారెంత ఎదురు చూస్తారోనన్న ఇంగితజ్ఞానం లేనివాడయ్యాడేమిటని బాధపడిపోతున్నారు పద్మావతమ్మగారు.

అలా కాసేపుచూసి, ''వస్తాడులెండి. ముందు వంట చెయ్యాలి. వాడి కిష్టమైనవి చేయాలి. ముందరే చేసి వుంచితే చల్లారి పోతాయని కూర్చున్నాను.'' అని వంటగదిలోకి వెళ్ళారామె. విశ్వనాథంగారు కూడా లేచి, ఆమెకు సహాయంగా ఉండాలని వెళ్ళారు. ఎంతో రుచికరమైన వంటలు గ్యాస్ స్టవ్ మీద అరగంటలో రెడీ చేశారు పద్మావతమ్మగారు. బయటకి వచ్చి కూర్చున్నారు.

పన్నెండు గంటలయింది.

''మీరు వెళ్లి, వాడిని రమ్మని చెప్పిరండి ఎంతసేపు భోజనం లేకుండా కూర్చుంటాడు'' అన్నారు పద్మావతమ్మ.

విశ్వనాథంగారు వెంటనే, ''వస్తాడులే, నీకు ఆకలవుతే చేసెయ్యి'' అన్నారు.

''బాగానేవుంది మీరనేది. చాలాకాలం తర్వాత వాడు వచ్చాడు. కలసి తిందాంలెండి. ఒకరోజు ఆలస్యమైతే పోయిందేమీలేదు'' అన్నారామె.

విశ్వనాథంగారు భోజనం పెందరాళే చేయడం అలవాటు. భోజనం చేస్తేగాని అడుగు బయట పెట్టరు. ఉద్యోగ సమయంలో కూడా అదే అలవాటు. కానీ, ఈరోజు కొడుకుతో తినాలని ఆకలవుతున్నా ఉండిపోయారు.

పన్నెండున్నర ప్రాంతంలో వచ్చాడు అరవింద్. కొడుకుని చూసిన పద్మావతమ్మగారి ఆనందం వర్ణనాతీతం. చచ్చిపోయిన ఆనందం విశ్వనాథంగారిలో కొడుకుని చూడ్డంతో మళ్ళీ పుట్టుకొచ్చింది. పిల్లలకేం తెలుస్తుందని సరిపెట్టుకున్నారు. చాలాసేపు కబుర్లు చెప్పుకున్నారు. తర్వాత పద్మావతమ్మగారు లేచి వంటగదిలోకి వెళ్ళి కంచాలు సర్దబోయింది.

ఇంతలో అరవింద వచ్చి, ''అమ్మా, నా భోజనం అయిపోయింది మధు ఇంట్లో చేసేశాను'' అనేసి తిరిగి తండ్రి దగ్గరకి వచ్చేశాడు. కొడుకుతో కబుర్లు చెబుతూ కూర్చున్న విశ్వనాథంగారు ఆకలి చురుక్కుమనిపించింది. భార్య నుంచి కబురు రాలేదేమిటని వంటగదిలోకి వచ్చి, గోడనానుకుని తలొంచుకుని కూర్చున్న భార్యను చూసి ఆశ్చర్యపోయారు.

''పద్మావతీ, ఏమిటలా కూర్చున్నావు ?'' అడిగాడు.

ఆవిడ తల పైకెత్తింది.

ఆశ్చర్యం !!

ఆవిడ కళ్ళల్లో కన్నీరు. చలించిపోయారు విశ్వనాథంగారు. గొంతుకూర్చుని, ఏమైందే!? అడిగారు నెమ్మదిగా.

ఆవిడ చీరకొంగుతో కళ్ళు తుడుచుకుని, ''వాడు ఆ మధువాళ్ళ యింట్లో భోజనం చేసేశాట్ట'' అన్నారు.

విశ్వనాథంగారి మనసు చివుక్కుమంది. కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా ఉండిపోయారు. తర్వాత తేరుకున్నారు. భార్య వైపు జాలిగా చూస్తూ, ''చూడు పద్మావతీ, దీని కెందుకింత బాధ. ఈ మాత్రం దానికే నువ్వింత ఇదైపోతే, రేపు యింకా ఇంతకంటె ఎక్కువ భరించాల్సి ఉంటుంది. గుండె రాయి చేసుకోవాలి. కొడుకులు మనల్ని ప్రేమించి, ఆదరిస్తే అదృష్టవంతులం అనుకోవాలి. అలా కాని పరిస్థితుల్లో దురదృష్టవంతులమనుకుని — వారు సుఖజీవనం గడపాలనే మనం కోరుకోవాలి. ఇది మన ఇంట కథ మాత్రమే కాదు పద్మావతీ, చాలా మందిళ్ళల్లోని కథేయిది. లే, భోజనం చేద్దువుగాని,'' అని ఆయనే కంచాల్లో వడ్డించసాగారు. ★

నాటిక పోటీలు

కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్, హైదరాబాదు వారు తృతీయ అఖిలభారతస్థాయి నూతన నాటిక పోటీలు నిర్వహిస్తున్నారు.

1983 డిసెంబరు 24, 25వ తేదీలలో హైదరాబాద్, రవీంద్రభారతిలో జరుగుతాయి. ఉత్తమ ప్రదర్శన బహుమతితో సరిసమానంగా రచయితకు గూడ రూ 1000/– లు నగదు బహుమతి ఉంటుంది.

ఉత్తమ ప్రదర్శనకి – నగదు బహుమతి రూ 1000/– లు మరియు కిన్నెర– డా॥ సుంకు బలరామ్ అవార్డు.

ఉత్తమ రచనకి – నగదు బహుమతి రూ. 1000/– లు మరియు కిన్నెర – సుంకు ఉషాగౌతమ్ స్మారక అవార్డు.

ద్వితీయ ఉత్తమ ప్రదర్శనకి – నగదు బహుమతి రూ. 500/– మరియు కిన్నెర – బొడ్డులూరి రామారావు అవార్డు.

ఉత్తమ దర్శకునికి – నగదు బహుమతి రూ. 500/– మరియు కిన్నెర – బాదం రామస్వామి అవార్డు.

ప్రాథమిక నాటికలో ఎన్నికైన ప్రదర్శించిన ప్రతి నాటికకు రూ. 300/– మరియు శాశ్వత జ్ఞాపక చిహ్నం యివ్వబడుతాయి.

వివరాలకు : మద్దాళి రఘురామ్, కార్యదర్శి, కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్, 2–2–647/153, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ, హైదరాబాద్.

దక్షిణ భారత వైశ్య సంఘం నాటక పోటీలు

దక్షిణ భారత వైశ్య సంఘం (మదరాసు) వారు తమ సంస్థ స్వర్ణోత్సవాల సందర్భంగా నవంబరు 15,16 తేదీలలో తెలుగు నాటకాల పోటీలని మదరాసులోని స్వామి శంకరదాస్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నారు. ఉత్తమంగా ఎన్నికైన మొదటి నాటకానికి రు. 1,001లు, రెండవ నాటకానికి రు. 501లు, మిగతా వాటికి ఒక్కొక్క దానికీ రు. 251లు; ఉత్తమ నటుడు, ఉత్తమ నటి, ఉత్తమ రచన, ఉత్తమ దర్శకుడుగా ఎన్నికైన వారికి తలా రు. 101లు నగదు బహుమతులు అందజేస్తారు. దరఖాస్తు ఫారాలకి, ఇతర వివరాలకి ది సదరన్ ఇండియా వైశ్య అసోసియేషన్, 63, గోడవున్ స్ట్రీట్, మదరాసు – 600 001 రాయాలి. ●

హైదరాబాదు నోట్‌బుక్

భేషైన పని

ప్రముఖ రచయిత్రి, కవయిత్రి, వ్యాఖ్యాత్రి, పరిశోధయిత్రి, వివిధ సాహిత్య సంఘ విధాత్రి, అన్నిటిని మించి సౌజన్య సంస్కారాలమైత్రి అయిన డాక్టర్ నాయని కృష్ణకుమారిని మహిళా విశ్వవిద్యాలయ కళాశాలల ప్రిన్సిపాలుగా నియమించి మరొక మంచిపని చేసింది — తెలుగుదేశం ప్రభుత్వం. వైస్ చాన్సలర్ డాక్టర్ వనజా అయ్యంగార్‌కు డాక్టర్ నాయని కృష్ణకుమారి వంటి విదుషీమణులు, కార్యనిర్వహణచతురులు తోడుకావడంతో మహిళా విశ్వవిద్యాలయం తక్కిన విశ్వవిద్యాలయాలకు ఆదర్శంగా, కార్వే మహిళా విశ్వవిద్యాలయానికన్నా మిన్నగా రాణించగలదనడంలో సందేహం లేదు. కృష్ణకుమారిది కవిత, మమత, సమత పండించుకొన్న పండిత వంశం, అజాతశత్రువు, కవితామూర్తి అయిన నాయని సుబ్బారావుగారు నాయనగారు. కవితకు నట్టిల్లయిన పుట్టింటి సంస్కారం ఆమె జీవితంలో పారిజాత పరిమళాలు వీచడం సహజం. గుంటూరు ఏ.సి. కాలేజీలోను, ఆంధ్ర విశ్వవిద్యాలయంలోను విద్యార్థినిగా ఉన్నప్పుడే ఆమె కలం బలం ఆంధ్రావళికి తెలిసింది.

డాక్టర్ నాయని కృష్ణకుమారి



ఒక సంవత్సరంపాటు మద్రాసులోని యతిరాజ కళాశాలలోను, 1952 నుంచి ఉస్మానియా విశ్వవిద్యాలయంలోను అధ్యాపకురాలుగా ఉంటూ విద్యార్థులను సర్వతో ముఖంగా తీర్చిదిద్దింది. ఆమె డాక్టరేట్ పొందిన సిద్ధాంతవ్యాసం 'తెలుగు జానపద గేయ గాథలు'.

1978 లో గృహలక్ష్మి స్వర్ణకంకణ సన్మానం, 1981లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ ఏర్పరచిన స్వర్గీయ శ్రీ నాళం కృష్ణారావుగారి సంస్మరణ సన్మానం పేర్కొన దగినవి. మరచాను. ఆంధ్రపత్రికవారపత్రిక కథల పోటీలో ఆమె కొకసారి బహుమతి లభించింది. ఆమె భర్త శ్రీ కనకపల్లి మధుసూదనరావుగారు స్నేహమూర్తి. జాలీ ఫ్రెండ్స్ కల్చరల్ అసోసియేషన్ ఆగస్టు 30న శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయంలో డాక్టర్ కృష్ణకుమారికి జరిపిన సన్మాన సభకు అధ్యక్షత వహించిన ఆచార్య బిరుదురాజు రామరాజు, సభను ప్రారంభించిన శ్రీ దేవులపల్లి రామానుజరావు, వక్తలు డాక్టర్ సి. నారాయణ రెడ్డి, డాక్టర్ జి. వి. సుబ్రహ్మణ్యం, డాక్టర్ సి. ఆనందారామం, డాక్టర్ సరస్వతీ లావణ్య, డాక్టర్ వాసా ప్రభావతి, కుమారి వాసిరెడ్డి సీతాదేవి కృష్ణకుమారి సమర్థతను, సహృదయతను, విద్వత్తును ప్రశంసించారు. శ్రీమతి సీతా పద్మరాజు మెమెంటో బహూకరించారు. డాక్టర్ కృష్ణకుమారికి మొన్ననే 53 ఏళ్లు నిండాయి. ఆమె సేవ ఆంధ్రావళికి ఇంకా చాల వుంది.

ఉపశ్రుతి


ఏం సార్, వాళ్లిద్దరూ ఒకే మేనుగా తెగ తిరిగారు. ఇప్పుడు ఎడముఖం, పెడముఖం అయ్యారేమిటి ?— అని ఇటీవల విడిపోయిన ఒక రాజకీయ నాయకులను గురించి ఒకరు ప్రశ్నించారు నన్ను. ఏముందీ ! వ్యాసుడు ఏనాడో అన్నాడు —

యధా కాష్ఠంచ కాష్ఠంచ
సమేయాతాం మహోదధౌ
సమేత్యచ వ్యపేయాతాం
తద్వజ్జీవ సమాగమః

సముద్రంలో కొట్టుకొని వచ్చే రెండు దుంగలు ఒకప్పుడు కలుసుకుంటాయి. మళ్ళీ విడిపోతాయి. అలాగే ఈ సంసార జలధిలోను జీవుల సంగతి అని. ఆశ్చర్యపడవలసినదేముంది దీనిలో — అన్నారు పక్కన వున్న ఒక ప్రపంచ జ్ఞాని అయిన పెద్దమనిషి.

— తిరుమల రామచంద్ర ★

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press, MallikarjunaRao Street Gandhinagar, Vijayawada-3 Editor : S Radhakrishna.



నైజాం: బి. మురిడేశ్వరరావు & కంపెనీ సీడెడ్: రూపా ఫిలింస్

Regd. No. H/YI-41 ANDHRA SACHITRA VARA PATRIKA